అక్టోబర్
2017

138

సంపుటి : 12 సంచిక : 6 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

సామాజిక న్యాయం - అవగాహన
ఒక్కరున్నా చాలు...
భూమికోసం పెరుగుతున్న ఐక్యపోరాటాలు
ఫిబ్రవరి విప్లవం తరువాతి పరిణామాలు
పెట్టుబడి - పర్యావరణం : కారల్‌మార్క్స్
పెట్టుబడిదారి విధానం - నిరుద్యోగం
సంఘ్ పరివార్ కట్టుకథ : సరస్వతి నాగరికత
ప్రయివేటు గుప్పిట్లోకి మన రక్షణ రంగం
తిరోగమన బాట పట్టిన ఆర్థిక వ్యవస్థ
విద్యార్థి ఎన్నికల్లో సంఘ్ పరివార్‌కు పరాభవాల పరంపర
అంతర్జాతీయ విప్లవకారుడు ఫైడల్ కాస్ట్రో
సైద్ధాంతిక, సాంస్కృతిక కృషిలో వెనుకబాటును అధిగమించాలి
మతోన్మాద వ్యతిరేక పోరాటంలో అసువులు బాసిన గౌరి లంకేశ్

# మతోన్మాద వ్యతిరేక పోరాటంలో అసువులు బాసిన గౌరి లంకేశ్

ఎకెఆర్

కన్నడనాట జర్నలిజంలో చెప్పుకోదగ్గ శక్తిగా, మతోన్మాద వ్యతిరేకపోరాటంలో అగ్రభాగాన ఉన్న, దారి తప్పిన విప్లవకారులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావటానికి కృషి చేస్తున్న గౌరిలంకేశ్‌ను మతోన్మాదశక్తులు పొట్టన పెట్టుకున్నాయి. సెప్టెంబరు 5వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఆమె ఆఫీస్ నుండి ఇంటికి వచ్చేటపుడు బైక్‌పై వెంబడించిన దుండగులు ఇంటిలోపలికి వెళుతున్న సమయంలో ఆమెపై రివాల్వర్‌తో సమీపం నుండి కాల్పులు జరిపారు. తల, ఛాతి, మెడపైన మూడు బుల్లెట్లు తగలటంతో ఆమె అక్కడికక్కడే మరణించారు. అభ్యుదయ వాదులు, హేతువాద దృక్పథం కలిగి, వామపక్ష భావజాలంతో కృషిచేస్తూ, సంఘ్ పరివార్ మతోన్మాద చర్యలను ప్రశ్నిస్తున్న నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, యస్‌యస్ కల్బుర్గిని హత్యచేసిన తరహాలోనే ఆమెనూ అవేశక్తులు హత్యచేశాయి. కల్బుర్గిని హత్యచేయటానికి ఉపయోగించిన రివాల్వర్, గౌరిలంకేశ్‌ను హత్యచేయటానికి ఉపయోగించిన రివాల్వర్ ఒకటేనని ఫోరెన్సిక్ నిపుణులు తేల్చారు. గోవింద పన్సారే హంతకులలో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. గోవా కేంద్రంగా పనిచేస్తున్న సనాతన సంస్థకు ఈ హత్యలతో సంబంధం ఉందని ప్రాథమిక సమాచారం వెల్లడిస్తున్నది. మతోన్మాదుల భావజాలం సమాజాభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. తమ భావాలు, సిద్ధాంతాలతో విభేదించేవారిని, భిన్నమైన భావాలు, సిద్ధాంతాలు కలిగిన వారిని సైద్ధాంతిక చర్చల ద్వారా ఒప్పించటం, తమదే సరైన విధానమని రుజువు చేసుకోవటం సాధ్యం కాదని మతోన్మాదులకు తెలుసు. కాబట్టి సైద్ధాంతిక చర్చలు జరగటం మతోన్మాదులకు ఇష్టం ఉండదు. తమ భావాలను వ్యతిరేకించే వారిని భయపెట్టటం, బెదిరించటం, వారిపై తప్పుడు కేసులు నమోదు చేయటం ద్వారా కోర్టుల చుట్టూ తిప్పటం, దాడులు, హత్యలు చేయటం ద్వారా తమ వ్యతిరేకుల నోళ్ళు మూయించటానికి ప్రయత్నం చేస్తుంటారు. అభ్యుదయవాదులను హత్య చేసిన ప్రతి సందర్భంలోనూ మతోన్మాదులు తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. కాని గౌరిలంకేశ్ హత్య తర్వాత ప్రజలలో వ్యక్తమౌతున్న మతోన్మాద వ్యతిరేకత భావాలు మతోన్మాదులను భయకంపితులను చేస్తున్నాయి. పత్రికా విలేకరులు,



ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వారు మాత్రమే కాక వామపక్షాలు, అభ్యుదయవాదులు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామిక, లౌకిక శక్తులు పెద్దసంఖ్యలో నిరసనలు తెలియజేయటం, ప్రదర్శనలు, సభలలో వేలాది మంది ప్రజలు పాల్గొని మతోన్మాదుల హత్యాకాండను ఖండించటం మతోన్మాదులకు ఆందోళన కలిగిస్తున్నది. అందువలననే గౌరి హత్యలో హిందు మతోన్మాదుల పాత్ర ఉన్నదన్నందుకు సీతారాం ఏచూరి, రాహుల్ గాంధీలకు లీగల్ నోటీసులు పంపారు. ఎవరు చంపారనేది విచారణలో తేలకుండానే మతోన్మాదులే నేరస్తులని ఏ విధంగా చెబుతున్నారని ప్రశ్నిస్తున్నారు. అమాయకులైన పశు వ్యాపారులు, చనిపోయిన పశువుల చర్మం వలుస్తున్న దళితులను అకారణంగా కొట్టిచంపుతున్న సంఘ్ పరివార్ తమ వరకు వచ్చేసరికి రుజువులు, సాక్ష్యాలు కావాలని అడగటం వారి ద్వంద్వనీతికి నిదర్శనం. వామపక్షాలు, అభ్యుదయ శక్తులు ఏ ఆధారాలు లేకుండానే గౌరి హత్యలో మతోన్మాదుల పాత్రను గురించి చెప్పటం లేదు. గతంలో జరిగిన అభ్యుదయవాదుల హత్యలతో పోలికలు, పోలీసుల దర్యాప్తులో లభించిన ప్రాథమిక ఆధారాలు ఆమె హత్యలో మతోన్మాదుల పాత్రను గురించి స్పష్టం చేస్తున్నాయి.

గౌరి 1962, జనవరి 29వ తేదీన బెంగళూరులో జన్మించింది. అభ్యుదయవాది, సాహిత్యం, కళల ద్వారా కన్నడ నాట అధికారాన్ని ప్రశ్నించిన ఆమెతండ్రి లంకేశ్ తనపేరుతోనే పత్రికను నడిపాడు. తన పత్రిక ద్వారా కన్నడ సాహిత్యంలో నూతన ధోరణులను ప్రవేశపెట్టాడు. జర్నలిస్టు, కవి, కథకుడు, సిని నిర్మాణంలో పాలు పంచుకోవటం, నాటకాలు రచించటం తదితరాల ద్వారా కన్నడ నాట ఒక తరాన్ని ఆయన ప్రభావితం చేశాడు. 2,000 సంవత్సరంలో తండ్రి చనిపోయిన తర్వాత లంకేశ్ పత్రిక నిర్వహణ బాధ్యతను ఆమె తీసుకున్నారు. అప్పటికి 16 సంవత్సరాల నుండి ఆమె వివిధ పత్రికలు, టివి ఛానల్స్‌కు జర్నలిస్టుగా పనిచేశారు. మొదట టైమ్స్ ఆఫ్ ఇండియా విలేకరిగా ఆమె తన ప్రయాణాన్ని ప్రారంభించింది. తర్వాత తన భర్త చిదానంద రాజ్‌ఘటాతో కలిసి ఢిల్లీ వెళ్ళింది. కొద్దికాలంలోనే ఢిల్లీ నుండి బెంగుళూరు తిరిగి వచ్చి సండేటైమ్స్ విలేకరిగా తొమ్మిది సంవత్సరాలు పనిచేసింది. 2000 సంవత్సరంలో ఆమె తండ్రి చనిపోయేనాటికి ఈ టివి తెలుగు ఛానల్‌కు బెంగళూరు ప్రతినిధిగా పనిచేస్తున్నారు. తండ్రి చనిపోయిన తర్వాత లంకేశ్ పత్రికకు ఆమె ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించగా, ఆమె సోదరుడు ఇంద్రజిత్ నిర్వహణ వ్యవహారాలు చూసేవాడు. పత్రికలో ప్రచారం చేసే అంశాలపై సోదరుడితో ఆమెకు విభేదాలు వచ్చాయి. ఆ క్రమంలో 2005లో పత్రికను పూర్తిగా తనే నిర్వహిస్తూ పత్రిక పేరును గౌరిలంకేశ్‌గా మార్చింది. అధికారంలో ఉన్న వారి అక్రమాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే తండ్రి సాంప్రదాయాన్ని కొనసాగిస్తూనే పత్రిక గమనాన్ని మౌలికంగా నూతన మార్గానికి మళ్ళించింది. హిందూ మతమౌఢ్యం పెరుగుదలకు, అది దేశ రాజకీయ రంగంలోకి విస్తృతంగా చొరబడటానికి వ్యతిరేకంగా పోరాడటానికి ఆమె గౌరిలంకేశ్ పత్రికను సాధనంగా చేసుకున్నారు. సామాజిక న్యాయం, మహిళల హక్కుల సాధన, లౌకికతత్వం కోసం ఆమె తీవ్రంగా కృషిచేసింది. తనకు లభించిన ప్రతి అవకాశాన్ని హిందూ మతోన్మాద రాజకీయాలను ఎండగట్టటానికి ఆమె వినియోగించుకున్నది. కర్నాటకలోని తీరప్రాంత జిల్లాలలో హిందు తీవ్రవాద గ్రూపులు మోరల్ పోలీసింగ్ పేరుతో మహిళలను వేధింపులకు గురిచేయటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఫలితంగా ఆమె హిందూ మితవాద గ్రూపుల ఆగ్రహానికి గురైంది. వారి దాడులకు లక్ష్యంగా మారింది. హిందూ మితవాద గ్రూపులు ఆమెపై తీవ్ర వ్యతిరేక ప్రచారం చేశాయి. వారు అనేకసార్లు ఆమెను బెదిరించారు.

కన్నడనాట మతోన్మాదశక్తులకు వ్యతిరేకంగా పోరాటం 1992లో (మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. మతోన్మాద వ్యతిరేక పోరాటంలో అసువులు బాసిన గౌరి లంకేశ్
ఎకెఆర్.................2

2. సామాజిక న్యాయం - అవగాహన
బి.వి రాఘవులు..... 4

3. ఒక్కరున్నా చాలు...
ఎస్. వీరయ్య ............8

4. భూమికోసం పెరుగుతున్న ఐక్యపోరాటాలు
విజూ కృష్ణన్ .......... 11

5. ఫిబ్రవరి విప్లవం తరువాతి పరిణామాలు
ఆర్.అరుణ్ కుమార్........ 16

6. పెట్టుబడి - పర్యావరణం : కారల్‌మార్క్స్
పి. దక్షిణా మూర్తి........... 18

7. పెట్టుబడిదారి విధానం - నిరుద్యోగం
ఎ.కోటిరెడ్డి.............. 20

8. సంఘ్ పరివార్ కట్టుకథ : సరస్వతి నాగరికత
జియాఉస్ సలామ్.......... 24

9. ప్రయివేటు గుప్పిట్లోకి మన రక్షణ రంగం
గౌతమ్ నవ్‌లఖ్ ......... 27

10. తిరోగమన బాట పట్టిన ఆర్థిక వ్యవస్థ
సి.పి. చంద్రశేఖర్ ....... 28

11. విద్యార్థి ఎన్నికల్లో సంఘ్ పరివార్‌కు పరాభవాల పరంపర ...............30

12. అంతర్జాతీయ విప్లవకారుడు ఫైడల్ కాస్ట్రో
ప్రకాశ్ కరత్ ............. 32

13. సైద్ధాంతిక, సాంస్కృతిక కృషిలో వెనుకబాటును అధిగమించాలి
బి.వి. ఆర్ ............ 34



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
ఫోన్: ఎడిటోరియల్ **9490099333**
మేనేజర్: **9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# అభివృద్ధి

ప్రపంచంలోనే భారత దేశం శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని, ఇదంతా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ ఘనతేనని కోడై కూసిన కార్పొరేట్ మీడియా ఆరుమాసాలుగా మన ఆర్థిక వ్యవస్థ కనబరుస్తున్న మందగమనాన్ని గురించి మౌనం వహించడం వెనుక మర్మమేమిటో తెలుసుకోవలసిన అవసరం ఉంది. చైనా జిడిపి 7 శాతం కన్నా తక్కువకు పడిపోయింది, మన దేశ జిడిపి 8 శాతం పైన పరుగెడుతోంది, ప్రపంచంలోనే అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ రికార్డుల కెక్కడానికి ఘనత వహించిన మోడీ, జైట్లీల జోడీయే కారణమని గతంలో ఊదరగొట్టారు. కానీ ఇప్పుడేమైంది. దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి కుదేలైంది. వ్యవసాయం సంక్షోభంలో పడింది. సర్వీసు రంగం మందగించింది. ప్రయివేటు పెట్టుబడులు కనుమరుగైనాయి. ఎగుమతులు చతికిల బడ్డాయి. జిడిపి పెరుగుదల 5.7 శాతానికి పడిపోయింది. మోడీ సర్కారు అంకెల మాయాజాలం చేసింది గనుక ఇది. కానీ వాస్తవ పెరుగుదల 3.7 శాతమేనని మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి, బిజెపీ సీనియర్ నాయకుడు యశ్వంత్ సిన్హా కుండబద్దలు కొట్టారు. మొత్తం మీద సిపిఐ(ఎం) హెచ్చరించినట్లు ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి ప్రవేశించే ప్రమాదంలో పడిందన్నది స్పష్టం. జిడిపి ఉరకలు పరుగులు పెడుతున్నప్పుడే దేశంలో నిరుద్యోగం రాజ్యమేలింది. ఉపాధి రహిత అభివృద్ధి దీనికి కారణమని విశ్లేషించారు. ఇప్పుడు జిడిపి దిగజారిపోతుంటే ఉపాధి పరిస్థితి మరింత ఘోరంగా తయారవుతుంది.

బిజెపి ప్రభుత్వ విధానాల వల్లే ఈ దుస్థితి నెలకొన్నదని కాంగ్రెస్ విమర్శిస్తోంది. మోడీ, జైట్లీ జోడీ దేశ ఆర్థికవ్యవస్థను ఈ దుస్థితికి తెచ్చారని యశ్వంత్ సిన్హా విమర్శిస్తున్నారు. వాజ్‌పేయి హయాంలో ఆర్థిక మంత్రిగా మీరు చేసిన నిర్వాకం మాకు తెలుసు అంటూ జైట్లీ యశ్వంత్ సిన్హాకు సమాధానం చెప్పారు. కాంగ్రెస్, బిజెపి రెండూ వినాశకర ఆర్థిక విధానాలను అమలు చేశాయని ఈ విమర్శలు, ప్రతివిమర్శల సారాంశం. వ్యక్తులు, వారి శక్తి సామర్థ్యాల సమస్య కాదు. విధానాలు ముఖ్యం. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి కనుసన్నల్లో ప్రపంచ వ్యాపితంగా అమలయిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలు భూగోళాన్ని పెద్ద ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశాయి. 2008లో ప్రారంభమైన ఈ సంక్షోభం ప్రపంచ వ్యాపితమై, భారత దేశాన్ని కూడా చుట్టుముట్టింది. సంక్షోభం నుండి బయటపడటానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఆర్థిక వ్యవస్థలను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయే గాని బయటపడేయడం లేదు. మన దేశంలో కాంగ్రెస్ అనుసరించిన నయా-ఉదారవాద విధానాలనే మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మరింత ఉధృతంగా అమలు చేస్తోంది. ఈ విధానాలు నిరుద్యోగాన్ని పెంచుతాయని, ప్రజల జీవన ప్రమాణాలను దిగజారుస్తాయని ఫలితంగా వారి కొనుగోలు శక్తి తగ్గి ఆర్థికాభివృద్ధి క్షీణిస్తుందని వామపక్షాలు, వామపక్ష ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు దేశంలో సరిగ్గా అదే జరుగుతోంది. అయినా అంకెల గారడీలతో, తాత్కాలిక ఉపశమనాలతో ఇంతకాలం నెట్టుకొచ్చిన ప్రభుత్వాలకు వాస్తవాలు ఒక్కసారిగా బద్దలవడం మింగుడు పడకుండా ఉంది. మోడీ ప్రభుత్వం ముందు ఇప్పుడు రెండే మార్గాలున్నాయి. ఒకటి, ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అమలు పరచడం. రెండు, ప్రజల చేత గద్దెనుండి కిందికి నెట్టివేయబడడం. కార్పొరేట్ పెట్టుబడిదారుల ఏజెంట్‌గా మొదటి పని అది చేయలేదు. రెండో దానికోసం ఎదురుచూస్తోంది.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# సామాజిక న్యాయం అవగాహన

**బి.వి.రాఘవులు**



రచయిత మార్క్సిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

**(1) సా**మాజిక న్యాయ సమస్యలపై పోరాటంలో మనం ముందుండవలసిన ప్రాధాన్యతపై పార్టీ చాలా కాలంగా నొక్కి చెపుతూ ఉంది. రాష్ట్రాలలో ఈ సమస్యలు తీసుకుంటూ ఉన్నారు, ఉద్యమాలు నిలకడగా నిర్మిస్తూ ఉన్నారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను నిర్మించాలన్న మన ప్రయత్నం వాస్తవ రూపం దాల్చాలంటే మన కృషి దేశవ్యాపితంగా ఇంకా మెరుగు పడవలసి ఉంది.

**(2)** సామాజిక సమస్యలపై మనం కార్యాచరణ చేసేటప్పుడు, సామాజిక న్యాయ స్వభావం, విప్లవోద్యమంలో దాని పాత్రకు సంబంధించిన అనేక విషయాలపై స్పష్టమైన అవగాహన ఉండాలి. పార్టీలో రెండు రకాల పొరపాటు భావనలున్నాయి. సామాజిక సమస్యలపై పని చేయడం వర్గ పోరాటాన్నించి మన దృష్టి మళ్ళిస్తుందని అందువలన వర్గ సంఘాలు బలహీన పడతాయన్న భావం ఒకవైపున, ప్రస్తుతం భారతదేశంలో ఉన్న కులవ్యవస్థ, దానితోపాటు సామాజిక అణచివేత ఉన్న నేపథ్యంలో సామాజిక న్యాయమే రోజువారీ పనికి, రాజకీయ కార్యక్రమాలకు కూడా కేంద్రం(ఫోకస్)గా ఉండాలన్న అభిప్రాయం మరోవైపున ఉన్నాయి. సామాజిక సమస్యలపై విశాల వేదికల్లో మన ఉమ్మడి కార్యక్రమాల కృషి పెరుగుతున్న కొద్దీ, సహజంగానే విధానపరమయిన, ఎత్తుగడలకు సంబంధించిన విషయాలు చర్చకు వస్తాయి. పార్టీ ఈ విషయంలో తన కార్యక్రమంలో స్పష్టమైన అవగాహన ఇచ్చింది.

**మన పార్టీ కార్యక్రమంలోని పేరా 5.10, 5.11, 5.12 మన అవగాహనను తెలియజేస్తున్నాయి.**

"కులపరమైన అణచివేతను అంతమొందించడంలో కూడా బూర్జువా భూస్వామ్య వ్యవస్థ విఫలమైంది. షెడ్యూల్డు కులాలకు చెందిన వారు అందరికన్నా దారుణంగా కష్టాలనెదుర్కొంటున్నారు. అస్పృశ్యత, తదితర వివక్షతా రూపాలు చట్ట వ్యతిరేకమని ప్రకటించబడినా దళితులు అణచివేతకు గురిచేయబడుతున్నారు. విముక్తికోసం దళితుల్లో పెరుగుతున్న చైతన్యాన్ని క్రూరమైన అణచివేత, అత్యాచారాలతో వెనక్కి కొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. దళితులు నిలదొక్కుకోవడంలో ప్రజాతంత్ర సారాంశం వుంది. సమాజంలో అత్యంత ఎక్కువగా అణచివేయబడిన వారి ఆకాంక్షలను అది ప్రతిబింబిస్తోంది. కులాలతో నిండిన సమాజంలో వెనుకబడిన కులాలు కూడా తమ హక్కులు వక్కాణిస్తున్నాయి." (5.10)

"అదే సమయంలో ఓటు బ్యాంకులను పదిలం చేసుకునే సంకుచిత లక్ష్యంతో కేవలం కులపరమైన పిలుపులతో కుల విభజనలను కొనసాగించేందుకు, దళితవర్గాలను ఉమ్మడి ప్రజాతంత్ర ఉద్యమాల నుండి విడగొట్టేందుకు ప్రయత్నించే శక్తులు కూడా పనిచేస్తున్నాయి. అనేకమంది కుల నాయకులు, కొన్ని బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు కుల ప్రాతిపదికన సమీకరణను సంకుచిత ఎన్నికల లబ్ధికోసం ఉపయోగించుకుంటున్నారు. అన్ని కులాల్లోని పీడిత ప్రజలతో ఉమ్మడి ఉద్యమాలు నిర్వహించడం పట్ల వ్యతిరేకంగా వున్నారు. పాత సామాజిక వ్యవస్థను కూలదోసేందుకు ప్రాతిపదికగా వుండాల్సిన భూమి, వేతనాలు వంటి మౌలిక సమస్యలనూ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలనూ వారు విస్మరిస్తున్నారు." (5.11)

"కుల అణచివేత, వివక్ష సమస్యకు సుదీర్ఘ చరిత్ర వుంది. పెట్టుబడిదారీ పూర్వ సామాజిక వ్యవస్థలో అది బలంగా వేళ్ళూనుకుని వుంది. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో ఉన్న సమాజం కుల వ్యవస్థతో రాజీపడింది. భారత బూర్జువా వర్గమే కుల దురభిప్రాయాలను పెంచి పోషిస్తోంది. కుల వ్యవస్థకూ, దళితుల అణచివేతకు వ్యతిరేకంగా ఐక్యత సాధించి నప్పుడే కార్మికవర్గ ఐక్యత ఏర్పడుతుంది. ఎందుకంటే దళిత జనాభాలో అత్యధికులు శ్రామికవర్గాలకు చెందినవారే. కులవ్యవస్థ నిర్మూలనకై పోరాటం ప్రజాతంత్ర విప్లవంలో ముఖ్యమైన భాగం. కుల అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటం వర్గ దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంతో ముడిపడి వుంది." (5.12)

**(3)** అందువలన సామాజిక అంశాలకు ప్రాధాన్యతనివ్వడం వలన వర్గ పోరాటాల ప్రాధాన్యత తగ్గి పోరాటాలు పక్కదారి పడతాయన్న ఆందోళన అర్థంలేనిది. పార్టీ కార్యక్రమాన్ని సరిగా అర్థం చేసుకోకపోవడం వలన ఏర్పడిన భావన ఇది.

మన పార్టీ కార్యక్రమం ఈ విషయంలో చాల స్పష్టంగా ఉంది. అందుకు ఈ క్రింది మూడు అంశాలను చూపవచ్చు. ఒకటి. కుల వ్యవస్థకు, దళితుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడం శ్రామిక జనంలో వర్గ ఐక్యతను నిర్మించడానికి ఏంతో అవసరం. రెండు, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడం విప్లవ కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం. మూడు, వర్గ దోపిడీ, కుల అణచివేతపై జరిగే పోరాటాలు ఒకదానితో ఒకటి సంబంధం కలిగినవి.

**(4)** సామాజిక న్యాయం కోసం, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే కృషియొక్క ప్రజాతంత్ర సారం గురించి అర్థం చేసుకోవడానికి కామ్రేడ్ లెనిన్ మాటలను గుర్తు చేసుకోవాలి.

కమ్యూనిస్టుల కార్యకలాపాల్లో సోషలిస్టు పార్శ్వం, ప్రజాతంత్ర పార్శ్వం, వీటి రెండింటి కీగల ప్రాధాన్యత గురించి లెనిన్ రష్యన్ సోషల్ డెమోక్రాట్ల కర్తవ్యాలు (1898) అన్న కరపత్రంలో క్రింది విధంగా వివరించారు.

"సోషల్ డెమోక్రాట్ల రోజువారి కార్యలాపాల లక్ష్యం శ్రామిక వర్గపోరాటాన్ని ముందుకు తీసుకపోవడం. ఈ క్రమంలో ఆ పోరాటపు

సోషలిస్టు పార్శ్వాన్ని, ప్రజాతంత్ర పార్శ్వాన్ని రెంటినీ పరిగణలోనికి తీసుకోవాలి. సోషలిస్టు (వర్గదోపిడీ వ్యవస్థను నిర్మూలించి సోషలిస్టు సమాజాన్ని నిర్మించడంకోసం పోరాటం), ప్రజా తంత్ర (రాజకీయ స్వేచ్ఛను సాధించి రష్యాలోని రాజకీయ సామాజిక వ్యవస్థలను ప్రజాతంత్ర యుతంగా నిర్వహించడం కోసం రాచరిక నిరంకుశత్వానిక వ్యతిరేకంగా పోరాటం) – ఈ రెండు రూపాల పోరాటంలో ఒకదానితో ఇంకొకటి విడదీయలేనివి. సోషల్ డెమొక్రాట్‌ల కార్యకలాపాల్లో ఇవి ఒకే నాణేనికి ఉండే బొమ్మా, బొరుసు వంటివి".

**(5)** సామాజిక సమస్యలను తక్కువ చేసినందువలన గాని, పూర్తిగా వదిలివేయడం వలన గాని వర్గ ఐక్యత మరియు వర్గపోరా టాలను నిర్మించడం సాధ్యపడదు. భారత దేశంలో పెట్టుబడిదారి విధానం పెరుగుతున్న క్రమంలో ఇదివరకే వర్ణాలుగా విభజింపబడిన సమాజం వర్గాలుగా కూడా విభజింపబడింది. ప్రతిరోజూ కార్మికవర్గం రకరకాల కులాల నుండి వచ్చినవారితో కొత్తగా తయారవుతూనే ఉంటుంది/లేదా తిరిగి పూరించబడుతూనే ఉంటుంది. రకరకాల తరగతుల నుండి వచ్చిన వారితో వైవిధ్యభరితంగా మారుతూనే ఉంటుంది. ఆచారాలు, కట్టుబాట్ల కారణంగా ఇదివరకటి నుండి కార్మికవర్గంలో నెలకొన్న విబేధాలకు తోడు కొత్తగా ఈ వర్గంలో వచ్చి చేరే వారితో మరికొన్ని విబేధాలు తోడవుతూ వుంటాయి. పర్యవసానంగా వర్గ ఐక్యతను నిర్మించడం చాలా కష్ట సాధ్యంగా ఉంటుంది. ఇప్పటికే ప్రజలలో ఉన్న అస్తిత్వ రాజకీయ, కుల, ప్రాంతీయ భావజాలాలను బూర్జువావర్గం ఓటు బ్యాంకులుగా ఉపయోగించుకుంటూ వర్గ ఐక్యతను దెబ్బతీస్తున్నది. ఐక్యతను దెబ్బతీసే వారి దయాదాక్షిణ్యాలకు వర్గ ఐక్యతను వదిలివేయకుండా మనపార్టీ, వర్గ సంఘాలు సామాజిక సమస్యలలో జోక్యం చేసుకుని విచ్ఛిన్నకారులకు అవకాశాలు లేకుండా చేయాలి.

మూడు వైపులనుండి దీనిపై దృష్టిపెట్టాలి. కార్మికవర్గంలో కుల, లింగ, మత తదితర దురభిమానాలకు వ్యతిరేకంగా నిరంతరంగా సైద్ధాంతిక ప్రచారం జరపాలి. వర్గంలోపల వర్గ ఐక్యతను దెబ్బతీసే అలవాట్లను, సంప్రదా యాలను అధిగమించేందుకు సామాజిక సంస్కరణలను ప్రారంభించాలి. ఆయా వర్గ, ప్రజాసంఘాలు తమ రంగాల్లో సామాజిక వివక్షనెదుర్కొంటున్న సభ్యుల యొక్క ప్రత్యేక సమస్యలపై (ఈ సమస్యలు పాలకవర్గాల,

**“కార్మికవర్గంలో కుల, లింగ, మత తదితర దురభిమానాలకు వ్యతిరేకంగా నిరంతర సైద్ధాంతిక ప్రచారం జరపాలి. వర్గం లోపల వర్గ ఐక్యతను దెబ్బతీసే అలవాట్లను, సంప్రదాయాలను అధిగమిం చేందుకు సామాజిక సంస్కరణలను ప్రారంభించాలి. ఆయా వర్గ, ప్రజాసంఘాలు తమ రంగాల్లో సామాజిక వివక్షనెదుర్కొంటున్న సభ్యుల ప్రత్యేక సమస్యలపై (ఈ సమస్యలు పాలకవర్గాల, యజ మానుల సృష్టి) పోరాటాలు చేపట్టాలి.”**



పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రులో దళితుల సామాజిక బహిష్కరణకు నిరసనగా ఢిల్లీలో వివిధ దళిత సంఘాలు, ప్రజావేదికల నిరసన ప్రదర్శన

యజమానుల సృష్టి) పోరాటాలు చేపట్టాలి. అణచివేతకు గురవుతున్న సామాజిక గ్రూపుల ప్రజాతంత్ర హక్కులకోసం నిజాయితీగా పోరాడే వేదికలన్నింటిలో చేరాలి. సామాజిక వివక్షతకు, అణచివేతకు వ్యతిరేకంగా జరిగే ఉమ్మడి కార్యక్రమంలోనూ, పోరాటాల్లోనూ చురుకుగా పాల్గొనాలి. ఈ విధంగా చేసినప్పుడు మాత్రమే పాలకవర్గం చైతన్య పూరితంగా చేస్తున్న ప్రయ త్నాలను, ఇప్పుడున్న వాస్తవ పరిస్థితులను మనం ఎదుర్కోగలం.

**(6)** భారతదేశంలో కుల వ్యవస్థ ఉన్నందు వలన సామాజిక న్యాయమే కేంద్రంగా మన రోజువారీ కార్యక్రమాలు, రాజకీయకార్య కలాపాలు ఉండాలని కొందరు అంటున్నారు.

వీరి ఆలోచన ప్రకారం 'సామాజిక న్యాయం'లోనే సమాజం, సమాజములో అన్ని అంశాలు ఇమిడి ఉన్నాయి. ఈ నినాదం సామా జిక అణచివేతను, వర్గ దోపిడీని కూడా పరిగణ లోనికి తీసుకుంటుంది. కానీ ఈ అవగాహన వర్గానికి, సామాజిక తరగతికి ఉన్న మౌలిక బేధాన్ని తుడిచి వేస్తుంది. అవగాహనలో, ఆచ రణలో మొత్తం పీడిత ప్రజలను విముక్తులను చేయడంలో కార్మికవర్గానికి ఉన్న పాత్రను నిర్వీర్యం చేస్తుంది. ఈ తప్పుడు అవగాహన రోజువారి కార్యక్రమాలలో మరికొన్ని తప్పుడు వైఖరులకు దారితీస్తుంది.

'సామాజిక న్యాయం' వర్గ పోరాటంలోని ప్రజాతంత్ర పార్శ్వానికి ప్రాతినిధ్యం వహి స్తుంది. అది వర్గ పోరాటంలోని సోషలిస్టు భాగానికి ప్రాతినిధ్యం వహించలేదు. ఈ తేడా నిగనుక విస్మరిస్తే, సామాజిక న్యాయంలోనే అంతా ఇమిడి వున్నదనుకుంటే వర్గపోరాటాలు, వర్గసంఘ నిర్మాణం వెనకపట్టు పడతాయి. అస్తిత్వ రాజకీయాల ఎన్నికల నినాదాలను, రాజకీయాలను యధాతదంగా స్వీకరించడానికి దారితీస్తుంది.

భారతదేశంలో సామాజికన్యాయం అంటే అణగారిన తరగతుల రిజర్వేషన్లు, ప్రాతిని ధ్యాలు, గుర్తింపులు, సమాన గౌరవం. ఈ అంశాలకు విప్లవ పార్టీ ప్రజాతంత్ర పార్శ్వంలోని పోరాటంలో ముఖ్యమైన స్థానం ఉంది. వీటిని మరుగుపరచడంగాని, తక్కువ చేయడంగాని చేస్తే విప్లవోద్యమంలో కలిసి రావలసిన అణ గారిన తరగతుల యొక్క ప్రజాతంత్ర డిమాండ్ల

> "వామపక్ష ప్రజాతంత్ర శక్తుల అభివృద్ధికి 'సామాజికన్యాయం' ప్రధాన ఎజెండాగా ఉండాలని కొందరు అభిప్రాయపడుతుంటారు. ఈ అభిప్రాయం అస్తిత్వ రాజకీయాల నుండే ఏర్పడింది కానీ పార్టీ వర్గ రాజకీయాల ప్రాతిపదికన ఏర్పడ్డది కాదు. సామాజిక న్యాయమనే ఒక పార్శ్వానికే ఏకపక్ష ప్రాధాన్యతను ఇచ్చి నిర్మించబడుతున్న ఏ రాజకీయ వేదికా విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోలేదు. పార్టీ అటువంటి వేదికలకు పరిమితం కారాదు."

కోసం పోరాడాల్సిన కార్మికవర్గం తన బాధ్యత నుండి తప్పుకోవడమే అవుతుంది. సామాజిక న్యాయం ప్రాముఖ్యతను, సంబంధిత సమస్యలను చేపట్టడంలో పార్టీ బలహీనతను గుర్తించి, పార్టీ సామాజిక సమస్యలను తీసుకునేందుకు అనేక రకాల చర్యలను ప్రారంభించింది. అయితే తప్పుని సరిదిద్దుకోడం అనే పేరుమీద మరో అంచుకు వెళ్లి అస్థిత్వ రాజకీయాలను వాటేసు కోవడం చెయ్యరాదు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని జనతా ప్రజాస్వామ్యం నినాదం స్థానంలో సామాజిక న్యాయం నినాదాన్ని ఉంచకూడదు.

**(7)** సామాజిక న్యాయాన్ని మాత్రమే ఏకపక్షంగా నొక్కిచెప్పడం అంటే వర్గ సంఘాలను, సామాజిక సంఘాలను ఒకే గాటన కట్టి వాటి మధ్యనున్న గుణాత్మక తేడాను గుర్తించకపోవడమే అవుతుంది.

వర్గసంఘాలు సామాజిక సమస్యలపై, సామాజిక సంఘాలు ఆర్థిక సమస్యలపై పనిచేయగలుగుతున్నందున రెండూ ఒకే స్వభావంగలవి అనుకోవడం తప్పు. సామాజిక సంఘాలలో ఆర్థిక అంశాలపై కార్యక్రమాలను గనుక చొప్పిస్తే దానివలన ఆ సంఘాల అస్థిత్వ ధోరణులు బలహీనపడతాయని భావించడం తప్పు. అది సమస్యను పైపైన చూడడమే అవుతుంది. ఇది సామాజిక సంఘాల స్వభావాన్ని, ఉద్దేశాన్ని విస్మరించడమే. వర్గపోరాటంలోని సోషలిస్టు పార్శ్వాన్ని నిర్వహించే విషయంలో వర్గ సంఘాల పాత్రను సామాజిక సంఘాలు భర్తీ చేయజాలవు. సామాజిక అంశాలను తీసుకున్నంత మాత్రాన వర్గ సంఘాలకు అవి ప్రత్యామ్నాయం కావు.

అస్థిత్వ రాజకీయాలకు ఆర్థిక డిమాండ్లు ఉండవని భావించకూడదు. ఉదాహరణకి కులాలలోని జనాభా ప్రాతిపదికన బడ్జెట్ నిధులు విభజించాలన్న డిమాండ్ పూర్తిగా ఆర్థిక డిమాండ్. ఈ డిమాండ్‌ని సామాజిక వేదిక నుండి తీసుకున్నప్పటికీ, తీసుకున్న డిమాండ్‌ను బట్టి సంఘం యొక్క స్వభావం నిర్ణయించ బడదు. ఏఏ తరగతుల వారిని కూడగడుతున్నాము అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

వర్గసంఘాల స్వభావం సామాజిక సంఘాల స్వభావంకన్నా పూర్తిగా భిన్నమయినది. వర్గసంఘాలకు విప్లవోద్యమంలో ఒక ప్రత్యేకమయినపాత్ర ఉంది. రెండింటి మధ్య నున్న ఈ గుణాత్మకమైన తేడాను విస్మరిస్తే వర్గ అవగాహన నుండి దూరమైనట్లే. సామాజిక సంఘాలు ముఖ్యంగా కులాల ఆధారంగా, మతాల ఆధారంగా అస్తిత్వాల ఆధారంగా ఏర్పడినవి. వాటి ఐక్యత సామాజిక తరగతుల ఆధారంగా ఉంటుంది. అవి కలిగించే చైతన్యం స్పాంటేనియస్‌గానూ, అస్థిత్వ ప్రాతిపదికన ఉంటుంది. అవి వర్గ చైతన్యాన్ని మసక బారుస్తాయి. ఆ సామాజిక సంఘాలను మనమే నిర్మించినప్పటికీ వాటి మౌలిక స్వభావంలో పెద్దగా తేడా ఉండదు. ఈ సామాజిక సంఘాల కార్యకలాపాలు సృష్టించే విడివిడి చైతన్యాన్ని మార్పు చేయాలనుకుంటే అది బయటి నుండి జోక్యం చేసుకోవడం వలనే సాధ్యపడుతుంది. మనపార్టీ, ప్రజాసంఘాలు సామాజిక అంశాలను చేపట్టడం ద్వారా, ఇతర సామాజిక సంఘాల ప్రజాతంత్ర డిమాండ్లకోసం చేసే పోరాటాలలో కలిసి పనిచేయడం ద్వారా మన పార్టీ, ప్రజాసంఘాలు అణగారిన తరగతుల నమ్మకాన్ని పొందాలి. మన పార్టీ సభ్యులు, నాయకులూ సామాజిక సంఘాలలోని అస్తిత్వ చైతన్యపు స్పాంటెనియస్ ధోరణికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడాలిగానీ ఆ అస్థిత్వ ఉచ్చులో మనం పడగూడదు. అస్తిత్వ సిద్ధాంతంగల మిత్రులతో కలిసి పనిజేసే సందర్భంలో వారెంతో సదుద్దేశం కలిగినవారైనప్పటికీ వారి సైద్ధాంతిక ప్రభావం మన కార్యకర్తలపైనా, ప్రజా పునాదిపైనా పడకుండా అప్రమత్తంగా ఉండాలి. కమ్యూనిస్టు వ్యతిరేక స్వభావంగల అస్థిత్వ రాజకీయ విచ్ఛిన్న కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి.

**(8)** వామపక్ష ప్రజాతంత్ర శక్తుల అభివృద్ధికి 'సామాజికన్యాయం' ప్రధాన ఎజెండాగా ఉండాలని కొంతమంది అభిప్రాయపడుతుంటారు. ఈ అభిప్రాయం అస్తిత్వ రాజకీయాల నుండే ఏర్పడింది కానీ పార్టీ వర్గ రాజకీయాల ప్రాతిపదికన ఏర్పడ్డది కాదు. సామాజిక న్యాయమనే ఒక పార్శ్వానికే ఏకపక్ష ప్రాధాన్యతను ఇచ్చి నిర్మించబడుతున్న ఏ రాజకీయ వేదికా విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోలేదు. పార్టీ అటువంటి వేదికలకు పరిమితం కారాదు.

**(9)** అస్థిత్వ రాజకీయాల నినాదాలను, కోర్కెలను ఏ విమర్శా లేకుండా యధాతదంగా అంగీకరించరాదు. 'ఎవరు ఎంత శాతం ఉన్నారో వారికి అంతశాతం వాటా ఉండాలి' , 'మేము 90 శాతం, మాకు మా వాటా కావాలి', 'బడ్జెట్‌ను జనాభా నిష్పత్తిలో పంచండి' , 'కేంద్రంలో ఓబిసిలకు రాజకీయ రిజర్వే


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

షన్‌లను కల్పించండి' 'క్రీమీలేయరు నిబంధనను తొలగించాలి' వంటి నినాదాలు ఇటువంటి కోవలోనివి. ఇటువంటి డిమాండ్ల పట్ల మన వైఖరిని వర్గ అవగాహన ప్రాతిపది కపై నిర్ణయించుకోవాలి. సామాజిక గ్రూపులు వర్గరహిత గ్రూపులు కావు. ఉదాహరణకు ఓబిసిల సామాజిక అస్థిత్వ సమస్య వారిలోని వర్గ విభజనను మరుగు పర్చజాలదు. ఒక సామాజిక తరగతి ముందుకు తెచ్చే ఏ డిమాండ్ అయినా ఆ తరగతి యొక్క ప్రజాస్వామ్య ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నట్లైతే అట్టి డిమాండ్ల పట్ల సానుకూల వైఖరి లేదా దాన్ని తగు విధంగా సవరించిన రూపంలో సానుకూల వైఖరి తీసుకోవాలి. ఈ విషయం ఆయా సందర్భాలను బట్టి ఎప్పటికప్పుడు నిర్ణయిం చవలసి ఉంటుంది.

**(10)** మార్క్సిజానికి, అంబేద్కరిజానికి పెద్దగా తేడా లేదని, ఉన్న తేడా కూడా చాల చిన్నదని కొందరు అంటుంటారు. భారతదే శానికి మార్క్సిజం సరిపోదని, దానికి అంబేద్కరి జాన్ని కలపాలని, మార్క్సిజం అంబేద్కరిజం ఒకదానితో ఒకటి సర్దుబాటు చేసుకోవాలని అంటూవుంటారు. అంబేద్కర్ పేరుమీద కొంత మంది మేధావులు, అస్థిత్వవాదులు ముందుకు తెస్తున్న ఈ ప్రచారాలతో మనం ఏకీభవించలేం. మార్క్సిస్టులకు సంబంధించినంతవరకు ఇది వర్గదృక్పధాన్ని వదిలి అస్తిత్వవాదాన్ని ఆలింగనం చేసుకోవడం అవుతుంది.

పెట్టుబడిదారి వ్యవస్థను నాశనం చేయా లనుకునే కార్మికవర్గ విప్లవ సిద్ధాంతం మార్క్సిజం. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశా లపై ఎంతతీవ్రమైన రాడికల్ భావాలూ కలిగి వున్నాపెట్టుబడిదారి వ్యవస్థను సంస్కరించాలని, ప్రజాస్వామికీకరించాలని అంబేద్కరిజం కోరుతోంది. మార్క్సిజం, అంబేద్కరిజం తాత్వి కంగా, రాజకీయంగా భిన్నమైన సిద్ధాంతాలు. అందువలన వాటిని కలగలపలేము. అయినప్ప టికీ అణగారిన తరగతుల అణచివేతకు వ్యతిరే కంగా అంబేద్కర్ అహరహం నిర్వహించిన గొప్ప పోరాటాన్ని మనం ముందుకు తీసుకు పోవాలి. డాక్టర్ అంబేద్కర్, పూలే, పెరియార్, నారాయణగురు వంటి వారెంతో మంది కులవ్యవస్థను ఎదిరించి పోరాడారు. ఈ మహానుభావుల రాడికల్ ప్రజాస్వామిక వారస త్వాన్ని ముందుకు తీసుకు వెళ్ళాలి. అందుకు కలిసివచ్చే వారందరూ మనకు మిత్రులు. వారితో కలిసి సామాజిక న్యాయ కృషిని ముందుకు తీసుకెళ్ళాలి. అయితే కలిసి

"అస్తిత్వ వాదులు మార్క్సిస్టు భావాలను, వర్గ ఉద్యమ పెరుగుదలను హర్షించరు. ఉమ్మడి కార్యక్ర మాలు చేసే క్రమంలో మనపార్టీ, ప్రజాసంఘాల వేదికలను అస్థిత్వ రాజకీయ ప్రచార వేదికలుగా వినియోగించుకొనేందుకు కొంతమంది ప్రయ త్నించవచ్చు. దీనిపట్ల మనం అప్ర మత్తంగా వుండాలి."



వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు. వీరిలో అత్యధికులు దళితులే

పనిచేయడం అంటే కలిసిపోవడం కాదు. వర్గదృష్టి యొక్క స్వతంత్రతను నిలుపుకుంటూనే ఉమ్మడి కృషిని కొనసాగించాల్సి వుంటుంది.

**ఇందుకొక ఉదాహరణ:** కమ్యూనిస్టులు సామాజిక న్యాయం కోసం పోరాడే శక్తులతో, ముఖ్యంగా దళితుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే శక్తులతో కలవాల్సిన అవసరాన్ని లాల్-నీల్ (ఎరుపు-నీలం) నినాదం నొక్కి చెపు తుంది. పార్టీ, ప్రజాసంఘాలు దళిత ప్రజాసం ఘాలతో, దళిత పార్టీలతో ఉమ్మడి కార్యాచరణ లలో అంగీకరించిన అంశాలపై జరిగే కార్యక్ర మాలలో కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని చెపుతున్నది. అంతేగాని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత నినాదాన్ని ప్రక్కనపెట్టి ఒక క్రొత్త రాజకీయ నినాదం ఇవ్వడాన్ని సూచించదు.

**(11)** పెట్టీ బూర్జువా మేధావుల ద్వంద్వ స్వభావం గనక దృష్టిలో ఉంచుకుంటే అస్తిత్వ భావాలను, రాజకీయాలను ప్రవచించే మేధావులతో కలిసి పని చేసేటప్పుడు తలెత్తే సమస్యలను అర్థం చేసుకోగలం. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా, సామాజికన్యాయం కోసం పోరాడే క్రమంలో అస్థిత్వ మేధావులలోని ప్రజాతంత్రవాదుల మద్దతును కూడగట్టేందుకు నిరంతరం ప్రయత్నించాలి. అస్తిత్వ రాజకీ యాలు ఉన్నప్పటికీ ఉమ్మడి వేదికలలో మనతో కలిసేందుకు కొంతమంది సిద్ధపడతారు కొంతమంది వామపక్ష ప్రజాతంత్ర వేదికలకు మద్దత్తు కూడా ఇస్తారు. వీరిని మనం ఆహ్వానిం చాలి. సోషలిజం పతనం అయిన తరువాత ఏర్పడిన జాతీయ అంతర్జాతీయ పరిస్థితులలో అస్తిత్వ రాజకీయాలు ముందుకు వచ్చాయి. అస్తిత్వ రాజకీయాలు సమాజంలోని వర్గ విభజననే ఒప్పుకోవు. అందువలన అస్తిత్వ వాదులు మార్క్సిస్టు భావాలను, వర్గ ఉద్యమ పెరుగుదలను హర్షించరు. ఉమ్మడి కార్యక్ర మాలు చేసే క్రమంలో మనపార్టీ, ప్రజాసంఘాల వేదికలను అస్థిత్వ రాజకీయ ప్రచార వేదికలుగా వినియోగించుకొనేందుకు కొంతమంది ప్రయ త్నించవచ్చు. దీనిపట్ల మనం అప్రమత్తంగా వుండాలి. ❊

పార్టీ నిర్మాణం

# ఒక్కరున్నా చాలు....

**ఎస్.వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

అధికార, ప్రతిపక్ష పార్టీలన్న తేడా లేదు. వామపక్షేతర పార్టీలన్నీ సరళీకృత ఆర్థిక విధానాలకే అంటకాగుతున్నాయి. జనం ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజలను సమీకరించగల రాజకీయ శక్తి నేటి అవసరం. అలాంటి ప్రత్యామ్నాయాన్ని కూడగట్టాల్సిన కమ్యూనిస్టు పార్టీ బలహీనంగా ఉన్నది. దాని ఫలితమే విధానాల్లో తేడా లేకపోయినా, ఒక పార్టీకి వ్యతిరేకంగా మరో పార్టీ అధికారంలోకి వస్తున్నాయి. అధికార పార్టీ మీద పెరిగిన అసంతృప్తిని సమీప ప్రత్యర్థిగా ఉన్న మరొక పార్టీ సొమ్ము చేసుకుంటున్నది. ప్రజలు పదేపదే మోసపోతున్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయాన్ని అందించాల్సిన బాధ్యత వామపక్షాలదే. సమాజంలో ఇప్పుడున్న పాలక పక్షాలకు వ్యతిరేకంగా గాని, వీరు అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా గాని పనిచేయడానికి అనేక శక్తులు, వ్యక్తులు, సంస్థలు లేకపోలేదు. కమ్యూనిస్టులతో కలిస్తే ప్రత్యామ్నాయ విధానాల కోసం ప్రజలను సమీకరించగలమన్న విశ్వాసం వారికి కలిగితే తప్పకుండా కలిసి వస్తారు. అలాంటి విశ్వాసం కలిగించాలంటే కమ్యూనిస్టు పార్టీ అన్ని మండలాల్లో పని చేయాలి. విస్తరించాలి. ప్రజలకు అందుబాటులోకి రావాలి. అంతేకాదు, కొన్ని ప్రాంతాల్లోనైనా బలమైన ప్రజాపునాది ఏర్పరచుకోవాలి. అప్పుడే కమ్యూనిస్టుల స్వంత పునాది ఇతర శక్తులకు విశ్వాసం కల్పిస్తుంది. ఒకరి బలం ఒకరికి తోడవుతుంది. నూతన శక్తి ఆవిర్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకే కమ్యూనిస్టు పార్టీ అన్ని మండలాలకు విస్తరించాలి. అవకాశం ఉన్నచోటల్లా ప్రజా పునాదిని బలోపేతం చేసుకోవాలి. ఇది ప్రణాళికాబద్ధంగా జరగవలసిన పని. ఎన్నికల తేదీలతో నిమిత్తం లేకుండా జరగాలి. ప్రజల సమస్యలపై పనిచేయడం వల్లజరగాలి. ప్రజలకు చేరువ కావాలి.

కమ్యూనిస్టు పార్టీ లేనిచోట నిర్మించడం ఎట్లా అన్నదే సమస్య. కార్యకర్తలు లేరు, సభ్యులు లేరు, ఏతోడూ లేని ఒక్కగానొక్క కార్యకర్త ఏమి చేయగలరన్నది మనముందున్న సమస్య. ఒక్కరు కూడా లేని చోటికి కనీసం ఒకరిని పంపించడమే మార్గం. ఒక కార్యకర్త ఉన్నప్పుడు చేయగలిగిందేమిటన్నది పరిశీలించవలసిన సమస్య. ఒక్క కార్యకర్త ఉన్నచోట చేయగలిగిం దేమీ లేదనుకుంటే పార్టీ లేని చోట పార్టీని నిర్మించడం సాధ్యం కాదని భావించాలా? అంటే పార్టీ విస్తరణకు మార్గం లేదా? పార్టీ ఉన్నచోట పునాది బలపర్చుకోవడం సమస్యగా ఉన్నది. పార్టీ లేనిచోటికే గదా విస్తరించాల్సింది. లేదు కాబట్టే కదా విస్తరించాల్సింది. పార్టీ ఆకాశం నుండి ఊడిపడదు. ఎవరో ఒకరు ప్రారంభించాల్సిందే. ఆ ఒక్కరు నేనే కావాలి గదా! జనం సమస్య మీద నేను పనిచేస్తే జనానికి నేను దగ్గరవుతాను గదా! ఆ జనం నా పార్టీకి దగ్గరవుతారు గదా! దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించింది కూడా ఒక్కరే. అమీర్ హైదర్‌ఖాన్‌ను ఈనాటికీ గుర్తుచేసుకుంటున్నాము. ప్రపంచంలో కమ్యూనిస్టు పార్టీకి విత్తనం వేసింది కూడా ఒక్కరే. అందుకే కారల్ మార్క్స్‌ను ప్రపంచం మరువజాలదు. ఎవరో ఒక్కరు ప్రారంభించాల్సిందే. ఆ ఒక్కరు ఎవరో ఎందుకు కావాలి? అది నేనే కావాలని ప్రతీ కమ్యూనిస్టు భావించాలి. పార్టీ లేని చోట నేను నిర్మించాలని నిర్ణయించుకోవాలి. ఆ బాధ్యత పార్టీ నాకు అప్పజెప్పితే అందుకు సిద్దపడాలి.

సమస్యలతో సతమతమవుతున్న జనం సహాయం కోసం నన్ను సంప్రదించాలా? లేక జనం దగ్గరకు నేను పోవాలా? రెండూ తప్పు కాదు. సాధారణంగా రెండూ జరుగుతూనే ఉంటాయి. జనం మన దగ్గరకు వచ్చి సమస్యలు చెప్పుకుంటే మన పని సులభతరం అవుతుంది కూడా. కానీ నీరు పల్లమెరుగునన్నట్లు జనం సహజంగా పోయేది అధికారపక్షం వైపు, పైరవీకారులవైపే. అధికారంలో ఉన్నవారు సమస్యను పరిష్కరించగలరన్న నమ్మకంతో పోతారు. అధికారులను ప్రభావితం చేసి పని చేసిపెట్టగలరన్న విశ్వాసంతో ప్రజా ప్రతినిధుల దగ్గరకు పోతారు. లంచం ఇస్తే పది రూపాయలు పోయినా పని అవుతుందన్న ఆశతో పైరవీకారులను ఆశ్రయిస్తారు. అందుకే జనం నా దగ్గరకు వస్తే సహాయం చేస్తానని అనుకోవడం వల్ల ప్రయోజనం లేదు. పార్టీ బలంగా ఉంటే నా దగ్గరకు కూడా వస్తారు. పార్టీ లేనప్పుడు, ఒకరిద్దరు కార్యకర్తలు మాత్రమే ఉన్నప్పుడు అధికారపక్షాన్ని లేదా దానికి చేరువగా ఉన్నవారిని వదిలి మన దగ్గరకు తమంతట తాము వస్తారనుకోవద్దు. మనం నిజాయితీగా సహాయం చేస్తామన్న విశ్వాసం కల్పించాలి. జనం దగ్గరికే మనం పోవాలి.

జనం సమస్యలను జనమే పరిష్కరించేట్లు చేయాలి. పరిష్కారంలో అవసరమైన సహాయాన్ని అందించాలి. జనాన్ని చైతన్యరహితులను చేసి ఎప్పుడూ తనపైనే ఆధారపడేవారిగా చేసి తమ చుట్టూ తిప్పుకోవాలని ఇతర పార్టీలు, పైరవీకారులు ఆలోచిస్తారు. జనాన్ని చైతన్యపరిచి, ఐక్యపరిచి తమసమస్యల పరిష్కారం కోసం తామే పోరాడే విధంగా దారి చూపడమే కమ్యూనిస్టులు చేయవలసిన పని. అందుకనే జనం మన దగ్గరకు రావాలని ఎదురుచూడవద్దు. జనం దగ్గరకు మనమే పోవాలి. సీపీఐ(ఎం) అఖిల భారత ప్లీనం చెప్పింది కూడా అదే. మాస్‌లైన్ అంటేనే అది. అందుకే అన్ని శ్రేణుల నాయకులు, కార్యకర్తలు, సభ్యులు జనం దగ్గరకే పోవాలి.

జనం కదలకపోతే ఏం చేయాలి? పోరాటం చేయాలనగానే ప్రజలు పోరాటాలకు సిద్ధపడతారనుకోలేము. పోరాడాలని మనం చెప్పినప్పుడు పోరాడరు. తాము పోరాడాలనుకున్నప్పుడు, తాము తీవ్రమైన అసంతృప్తితో ఉన్నప్పుడు మనం చెప్పకపోయినా పోరాడుతారు. కాకపోతే వారికి తోచిన పద్ధతుల్లో పోరాడుతారు. వారి నాడిని గమనించి సరైన పద్ధతిలో పోరాటం నడపడమే కమ్యూనిస్టులు చేయాల్సిన

పని. ప్రజలు పోరాటాలకు ఇంకా సిద్ధపడనప్పుడు ఏంచేయాలన్నది మరోప్రశ్న. పోరాటమే మార్గమని నిరంతరం ప్రజల దృష్టికి తేవాలి. అందుకే ప్రజలను నిరంతరం కలవాలి. ప్రజల సమస్యలను అధ్యయనం చేయాలి. వారు రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక సమస్యలు, సామాజిక సమస్యలు, పౌర సమస్యలు ఇంకా అనేక రకాల సమస్యలున్నాయి. అన్నీ పరిశీలించాలి. సమస్యలను అధ్యయనం చేయడానికి ఎంతో మంది అవసరం లేదు. ఎంత మంది ఉంటే అంతమంచిదే. ఒక్కరే ఉన్నా సమస్యలను అధ్యయనం చేయవచ్చు. బస్తీలోకి లేదా గ్రామంలోకి పోతే, ప్రజలను కలిస్తే నోరువిప్పి వారితో చర్చిస్తే సమస్యలు అర్థం చేసుకోవచ్చు. బజారులో అడుగుపెట్టగానే ఎవరూ చెప్పకున్నా అర్థమయ్యే సమస్యలు కోకొల్లలు. కావాల్సిందల్లా నేను ఆ బజారులోకో, ఆ గ్రామంలోకో పోవాలి. ఆఫీసులోనో, ఇంట్లోనో కూర్చుంటే కనిపించదు. బజారులో అడుగుపెడితే రోడ్డు ఎట్లా ఉందో తెలుస్తుంది. మురికి కాలువ పరిస్థితి అర్థమవుతుంది. అంతేకాదు, ఉదయం తొమ్మిది గంటల తర్వాత తీరికగా పోతే అనేక సమస్యలు అర్థం కావు. అప్పటికే ఆడా-మగా ఇంటిల్లిపాది వ్యవసాయ పనులకు గాని, ఉద్యోగాలకు గాని వెళ్ళిపోతారు. ముసలీ ముతక మాత్రమే మిగులుతారు. జనం ఇంట్లో ఉన్నప్పుడే, బజారులో దొరికేటప్పుడే పోవాలి. ఉదయం ఆరు నుండి తొమ్మిదిగంటల మధ్య బజారులో అడుగు పెడితే వాకిలి ఊడ్చే మహిళలు సమస్యలు చెప్పగలరు. ఆ బజారులో నల్లా ఉన్నదా? లేదా? అర్థమవుతుంది. బోరు పనిచేస్తున్నదో, లేదో అర్థమవుతుంది. ఎన్ని కిలోమీటర్ల నుండి నీరు మోసుకొస్తున్నారో కనిపిస్తుంది. సమస్యలు చెప్పగలిగిన యువత అందుబాటులో ఉంటారు. సాయంత్రం ఆరు తర్వాత బజారులో అడుగు పెడితే లైటు వెలుగుతుందో, లేదో అర్థమవుతుంది. చీకట్లో ఆడ పిల్లలు పడుతున్న బాధలు, వారి భయాలు అర్థమవుతాయి. పాములు, తేళ్ళ గురించి పసి పిల్లల భయం అర్థమవుతుంది. రచ్చబండ మీద, టీ కొట్టు దగ్గర పది మంది దొరుకుతారు. కాసేపు మాట్లాడే అవకాశం దొరుకుతుంది. నీవు పోయింది దళిత వాడైతే దళితుల సమస్యలు అర్థమవుతాయి. తండాకు పోతే లంబాడీల సమస్యలు అర్థమవుతాయి. అడవికి పోతే కొండ ప్రాంత గిరిజనుల సమస్యలు అర్థమవుతాయి. ఊరవతల పూరి గుడిసెలను కదిలిస్తే సంచార జాతుల సమస్యలు తెలుస్తాయి. అత్యంత వెనుకబడిన తరగతుల బాధలు గమనిస్తాం. ఎవరి దగ్గరకు పోతే వారి సమస్యలు అర్థమవుతాయి. ఎవరిని సమీకరించాల నుకుంటున్నామో వారి దగ్గరకు పోవాల్సిందే. తీరికగా ఉదయం తొమ్మిది గంటలకు బయటకు వచ్చి, సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి చేరుకుంటే చేయగలిగిందేమీ ఉండదు. ప్రజలతో సంబంధాలు ఏమీ రావు. జనం ఇళ్ళల్లో ఉన్నప్పుడు పోవడానికి సిద్ధపడితే ఒక్కరే పోయినా సమస్యలు తెలుస్తాయి. చూసిన సమస్యలు, విన్న సమస్య లన్నీ రాసుకోవాలి. వాటిలో ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న సమస్యలేమిటో గుర్తించాలి. ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి. ఆందోళనకు పూనుకోవాలి.

“ జనం ఇళ్ళల్లో ఉన్నప్పుడు పోవడానికి సిద్ధపడితే ఒక్కరే పోయినా సమస్యలు తెలుస్తాయి. చూసిన సమస్యలు, విన్న సమస్య లన్నీ రాసుకోవాలి. వాటిలో ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న సమస్యలేమిటో గుర్తించాలి. ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి. ఆందోళనకు పూనుకోవాలి. ”



పౌర సదుపాయాలకు నోచుకోని దళిత కాలనీ

ఆందోళన రూపాలు కూడా అనేకం. సమయం, సందర్భాన్ని బట్టి, అవసరాన్ని బట్టి తక్కువ శ్రమతో సులభంగా ప్రజలతో సంబంధాలు పెట్టుకోవడానికి ఉపయోగపడే ఆందోళనా రూపాలను ఎంపిక చేసుకోవాలి. పేపర్ ప్రకటన, వాల్‌పోస్టర్ కూడా ఆందోళనా రూపాలే. కానీ పత్రికా ప్రకటన ద్వారా నీవు చెప్పదలచుకున్న విషయాలకు పత్రికా దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాలి. పత్రికా వివరంగా రాసినప్పుడు కూడా నీ సంబంధం ప్రజలతో ప్రత్యక్షంగా కంటే, పత్రికతోనే ఉంటుంది. గోడ పత్రికతో నీ ప్రత్యక్ష సంబంధం గోడతోనే ఉంటుంది. అది కరపత్రం అయితే నీవు జనం చేతికి ఇస్తావు. జనంతో ప్రత్యక్ష సంబంధం వస్తుంది. పది మంది కూడిన దగ్గర వారి సమస్యల గురించి, పోరాడవలసిన అవసరం గురించి నీవు మాట్లాడితే ప్రజలు ప్రత్యక్షంగా నీకు చేరువవుతారు. వ్యక్తిగత సమస్యల మీద అధికారులకు వినతిపత్రాలు రాసి, బాధితులను వెంటబెట్టుకుని వెళ్ళి మాట్లాడితే వారితో ప్రత్యక్షబంధం ఏర్పడుతుంది. పేపర్‌లో పేరుకోసమో, ఫోటో కోసమో తాపత్రాయం కంటే ప్రజలతో సంబంధాల కోసం తాపత్రాయం అవసరం. అన్నీ చేయగలిగితే మంచిదే, కానీ నేను చేయవలసిన మొదటి పని ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని ఇచ్చేదే. నా పని ప్రారంభిం

> **"వినతిపత్రానికి కాగితం జనమే తెస్తారు. కరపత్రానికి డబ్బు లేదంటే తలా పది రూపాయలు వారే వేసుకుంటారు. పదేపదే ప్రజల మధ్య ఉన్నప్పుడు కార్యకర్త బాగోగులు కూడా వారే చూసుకుంటారు. ఇక్కడ కార్యకర్తకు సామర్థ్యం ఉందా? లేదా? అన్నది కూడా ఒక సమస్య. జనాన్ని కలవడానికి పెద్ద సామర్థ్యం అవసరం లేదు. అది మానవ సహజ లక్షణం."**

చాల్సింది అక్కడనే. అనేక సందర్భాల్లో పత్రికా ప్రకటనతో ప్రారంభిస్తున్నాం. ఆచరణలో అంతటితో ఆపివేస్తున్నాం. అందువల్ల పేపర్లో పేరు, ఫోటో వచ్చిందన్న ఆనందమే తప్ప ప్రజలతో సంబంధాలు బలపడడం లేదు. కార్యక్రమాల్లో కొనసాగింపు ఉండడం లేదు. అందుకే ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పరిచే ఆందోళనా రూపాలతోనే పని ప్రారంభించడం మంచిది. దాని వల్ల పేపర్లో పేరు రాకపోవచ్చు, కానీ నా ప్రజలతో నాకు సంబంధాలు ఏర్పడతాయి.

గ్రూపు మీటింగ్స్ నిర్వహించినప్పటికీ, కరపత్రాలు, పోస్టర్లు వేసినప్పటికీ, పత్రికల్లో ప్రకటనలు విస్తృతంగా ఇచ్చినప్పటికీ ప్రజలు కదలకపోవచ్చు. పోరాటాలకు సిద్ధపడకపోవచ్చు. అప్పుడు కూడా ప్రజల దగ్గరకు మనమే పోవాలి. పోరాటాల్లోకి తొలి అడుగు మనమే వేయించాలి. వినతిపత్రంపైన సంతకం పెట్టడానికి వారు వెనకాడరు. డిమాండ్లతో కూడిన బ్యాడ్జీ గాని, నిరసనకోసమైతే ఒక నల్ల బ్యాడ్జీ గాని పెట్టుకోవడానికి సిద్ధపడతారు. మనిషి మనిషిని కలిసి ఈ పనులు చేయించాలి. ఇవి పోరాట రూపాలే. ఒక సమస్యపై అధికారిని డిమాండ్ చేస్తూ సంతకం చేస్తున్నారంటే లేదా బ్యాడ్జీ ధరిస్తున్నారంటే పాలకులను డిమాండ్ చేస్తున్నారని అర్థం. అవి పోరాటాల ప్రాథమిక రూపాలే. అనేక సమస్యల మీద పదేపదే ఈ కార్యక్రమాలు నిర్వహించాలి. ఎన్ని సార్లు, ఎంత తరచుగా ప్రజలను కలవగలిగితే అంత మంచిది. ప్రజలకు విసుగొచ్చినప్పుడు ఇట్లైతే లాభం లేదు, కదులుదాం అని వారే అంటారు. ధర్నాలకు, ప్రదర్శనలకు, పికెటింగ్‌లకు వారే సిద్ధపడతారు. వారు సిద్ధపడ్డప్పుడు మన కార్యకర్త ముందు నిలబడాలి.

వినతిపత్రానికి కాగితం జనమే తెస్తారు. కరపత్రానికి డబ్బు లేదంటే తలా పది రూపాయలు వారే వేసుకుంటారు. పదేపదే ప్రజల మధ్య ఉన్నప్పుడు కార్యకర్త బాగోగులు కూడా వారే చూసుకుంటారు. ఇక్కడ కార్యకర్తకు సామర్థ్యం ఉందా? లేదా? అన్నది కూడా ఒక సమస్య. జనాన్ని కలవడానికి పెద్ద సామర్థ్యం అవసరం లేదు. అది మానవ సహజ లక్షణం. మనిషి సంఘజీవి. సోమరిగా ఇంట్లోనో, ఆఫీసులోనో కూర్చోకుండా జనం మధ్యకు పోవడమే మంచి లక్షణం. మనుషులతో మాట్లాడడం కష్టమైందేమీకాదు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి బ్రహ్మవిద్యలవసరం లేదు. వినతిపత్రం రాయడం రాకపోతే నాయకుల సహాయంతో నేర్చుకోవచ్చు. కరపత్రం రాయడం రాకపోతే నాయకులతో రాయించుకోవచ్చు. మిగిలినవన్నీ కార్యకర్త స్వయంగా చేయగలిగినవే. ఒక్కరైనా చేయగలిగినవే. సేవా కార్యక్రమాలు కూడా ప్రజలకు దగ్గర కావడానికి తోడ్పడతాయి. చెత్తను ఎత్తిపోయడం, వీధులు శుభ్రం చేయడం, పేద పిల్లలకు చదువు చెప్పడం, తెలిసిన డాక్టర్లతో మెడికల్ క్యాంపులు నిర్వహించడం వంటి అనేక రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చు. ప్రతిదీ వ్యాపారమైన నేపథ్యంలో ఏ చిన్న సహాయం చేసినా ప్రజలకు ఆ మేరకు ఊరట కలుగుతుంది.

ప్రజా సమస్యల మీద అప్పుడప్పుడు కదిలితే ప్రజల నుండి అభినందనలు వస్తాయి. ప్రజలతో సంబంధాలు మాత్రం రావు. పార్టీని నిర్మించుకునే అవకాశం రాదు. ప్రజా సమస్యల మీద నిరంతరం పనిచేయాలి. ప్రతి రోజూ ప్రజలతో సంబంధాల్లో ఉండాలి. నీటికి నిరంతరం వేడి అందిస్తున్నప్పుడే ఒక డిగ్రీ నుండి రెండవ డిగ్రీకి, రెండవ డిగ్రీ నుండి మూడవ డిగ్రీకి వేడెక్కుతూ ఉంటుంది. తొంభైతొమ్మిది డిగ్రీలు దాటితే ఆవిరవుతుంది. మధ్య మధ్యలో విశ్రాంతినిస్తే ఉన్న వేడి చల్లారిపోతుంది. మళ్లా మొదటికొస్తుంది. పొయ్యిమీద బియ్యం పెట్టి నిరంతరం తగిన మోతాదులో మంటనిచ్చినప్పుడే అన్నం ఉడుకుతుంది. మధ్యలో మంట తీసేసి, కాసేపటికి మళ్ళీ ఇస్తే తినడానికి పనికొచ్చే అన్నం కాదది.

ప్రజా సమస్యల మీద మనం నిర్వహించే ఆందోళనలు కూడా అంతే. విరామం లేకుండా నిరంతరం చేయవలసిందే. అప్పుడే ఫలితాన్నిస్తుంది. ప్రజలతో సంబంధాలు బలపడతాయి. ఏ ప్రజల మధ్య కార్యకర్త పనిచేయాలో, ఆ ప్రజల మధ్య తాను నివాసం ఉన్నప్పుడే ఇది కూడా సాధ్యపడుతుంది. ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండి ప్రజల దగ్గరకు ఎంత తరచుగా వెళ్ళి వచ్చినా అతిథిగా వెళ్ళిరావడమే తప్ప ప్రజల మనిషిగా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. ఏ సమయంలో సమస్య ఎదురైనా అందుబాటులో ఉంటావన్న విశ్వాసం ప్రజలకు కలగదు. అందుకే ప్రజల మధ్యనే ఉండాలి. పై నాయకత్వం సైతం గ్రామాలను, బస్తీలను సందర్శించినప్పుడు సమావేశం వరకు చూసుకుని రాకుండా రాత్రులు కూడా అక్కడే బసచేయడం ఉపయోగం. అనేక సమస్యలు ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడుతుంది.

ఈ ఆందోళనా కార్యక్రమాలు గాని, సేవా కార్యక్రమాలు గాని ఎంత కాలం చేయాలి? జనం పోరుబాట పట్టేదాకా చేయవలసిందే. పోరాట కాలంలోనూ చేయవలసిందే. మరో పోరాటానికి సన్నద్ధం చేయడం కోసమూ చేయాల్సిందే. నిరంతరమూ చేయవలసిందే. సమాజం మారేంతవరకూ చేయవలసిందే. ఏం చేయాలో తోచకపోతే జనాన్ని కలవాలి. ఏం చేయాలో జనమే చెబుతారు. నీరసం వస్తే జనాన్ని కలవాలి. జనంలోంచి ఉత్సాహం వస్తుంది. ఒకరిద్దరూ తోడుంటే వారితోనూ సంప్రదించాలి. శాఖ ఉంటే దానితోనూ చర్చించాలి. మండల కమిటీ ఉంటే ఇంకా మంచిదే. ఇంకా చాలా చేయవచ్చు. ఆందోళన ప్రారంభించినప్పుడే పార్టీ నిర్మాణానికి అవసరమైన ప్రయత్నాన్ని కూడా ప్రారంభించాలి. ప్రజా సమస్యల మీద ఆందోళనతో పాటు, ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకునే సమయంలోనే పార్టీని నిర్మించేందుకు జరిగే కృషి సమాంతరంగా జరగవలసిందే. చురుకుదనం ప్రదర్శించే చదువుకున్న యువతీ యువకులకు పోరాటాల అవసరాలను అర్థం చేయించాలి. పరిష్కార మార్గాలు సూచించాలి. సమాజ మార్పు కోసం చేయవలసిన కృషిని అర్థం చేయించాలి. నవతెలంగాణ, ప్రజాశక్తి, మార్క్సిస్టు, పీపుల్స్ డెమోక్రసీ వంటి పత్రికలు చదివించాలి. స్టడీ సర్కిళ్లు నిర్వహించాలి. కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయంతో ఏకీభవించే వారితో ఆగ్జిలరీ శాఖలు ఏర్పాటు చేయాలి. నెలలో ఒకట్రెండు సార్లైనా సమావేశపర్చాలి. పార్టీ శాఖను

(మిగతా 19వ పేజీలో)

# భూమికోసం పెరుగుతున్న ఐక్యపోరాటాలు



రచయిత ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి

విజూ క్రిష్ణన్

**కార్పొరేట్ శక్తులు** ప్రభుత్వ మద్దతుతో పెద్ద మొత్తంలో భూమిని గుంజుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ భూమిపై ఆధారపడి జీవించే ప్రజలు, భూమి యజమానులు ఇంతకు ముందె న్నడూ లేనంత ఐక్యతతో వారి ప్రయత్నాలను తిప్పికొడుతున్నారు.

భారతదేశవ్యాప్తంగా పెద్ద మొత్తంలో భూమిని గుంజుకునే ప్రక్రియ కొనసాగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, భారతీయ, విదేశీ కంపెనీలు, వ్యక్తులు కూడ భూమిని కొంటూ వుండడం లేదా తక్కువ ధరకు దీర్ఘకాలికంగా పెద్ద మొత్తంలో భూమిని లీజుకు పొందుతుం డడం జరుగుతున్నది. అది అదుపులేకుండా పెట్టుబడిని పోగుచేసే సాధనాలు తప్ప మరొకటి కాదు. ఆచరణ సాధ్యంకాని ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్)లు, జాతీయ పెట్టుబడి, ఉ త్పాదక మండళ్ళు (నిమ్జ్)లు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతాలు (ఇండస్ట్రియల్ కారిడార్లు), ఆర్థిక అభివృద్ధి ప్రాంతాలు (ఎకనమిక్ కారిడార్లు), "స్మార్ట్ సిటీస్" మరియు ఇతర కొత్త పేర్లతో పిలవబడే ప్రాజెక్టుల పేరుతో ఆ భూములన్నీ గుంజుకోబడుతున్నాయి. వాస్తవంగా ఇప్పుడు కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమంలో గుర్తించిన విషయమేమంటే, ప్రభుత్వమే అత్యంత దుర్మార్గంగా, సిగ్గుమాలిన తనంతో కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కొరకు, వారి తరఫున మధ్యవర్తిత్వం వహిస్తుంది.

ఒకప్పుడు వలస పాలనాయుగంలో దేశ సరిహద్దు ప్రాంతంలో నివశించే ప్రజల పట్ల సరియైన పట్టింపులేకుండా కాగితపు పటములపై దేశ సరిహద్దులు గీయబడినట్లుగానే, దేశంలో గజిబిజిగా వున్నసెజ్‌లు, మరియు "స్మార్ట్ నగరాలు'' లక్షలాది ప్రజల జీవితాలను గాయపరుస్తున్నాయి. వలస పాలనా కాలంలో లాగా కాకుండా, ఈ ప్రాజెక్టులు యిబ్బందులను సృష్టిస్తూ, ఆ ప్రాంతాలలో ఎంతో కాలంగా నివశిస్తున్న ప్రజలను అక్కడి నుండి వెళ్ళిపోయేట్లు చేస్తున్నాయి. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్‌లు, మైనింగ్, పోర్ట్‌లు, సాగునీటి ప్రాజెక్టులు, రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టుల పేరుతో పెద్ద మొత్తంలో యిప్పటికే అస్థిరమైన పరిస్థితులలో నివశిస్తున్న రైతాంగాన్ని, గిరిజన ప్రజలను, ఆటవిక జాతులను, మత్స్య కార్మికుల ను, యింకా అణగారిన వర్గాల ప్రజలను ఆ భూముల నుండి బలవంతంగా ఖాళీ చేయించే పనిలో పాలుపంచుకుంటున్నారు. కష్టపడి సాధించుకున్న భూమిపై వున్న హక్కులు తీసివేయడం ద్వారా వనరులను లూటీ చేయడం సులభతరం చేశారు. న్యాయమైన నియమాలన్నీ గాలికి వదిలివేయబడినాయి. ఒక ప్రాంతాన్ని చూపించి, వారు అక్కడే వుండే విధంగా తగిన ఏర్పాట్లు చేసే కనీస ప్రయత్నం కూడ చేయలేదు. ఈ హింసాయుతమైన చర్యలు సవాల్ చేయబడకుండా వుండవు. అటువంటి ప్రాంతాల లో కోపోద్రిక్తులైన ప్రజల ఐక్యతను నిర్మించడం ద్వారా ఒక పోరాటానికి తెరతీస్తున్నాం. ప్రజల లో ఈ విధమైన ఐక్యత మునుపెన్నడూ లేదు.

### వేగవంతమైన నయా ఉదారవాద విధానాలు:

దశాబ్ద కాలానికి పైగా భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో, వలస పాలనలో చేయబ డిన ఉపయోగంలేని భూసేకరణ చట్టం 1894కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఎగిసిపడిన నిరసనలు అతి కిరాతకంగా అణచివేయబడినాయి. ప్రాణ నష్టానికి కూడ దారితీశాయి. పార్లమెంట్‌లో జరిగిన చర్చలు, మరియు వివిధ వ్యాపారవర్గ ప్రతినిధులతో జరిపిన చర్చల అనంతరం, కాంగ్రెస్‌పార్టీ నాయకత్వంలోని యు.పి.ఎ. ప్రభుత్వం భూ సేకరణలో పారదర్శకత, న్యాయమైన పరిహారం, పునరావాస చట్టం 2013 (యల్‌ఎఆర్‌ఆర్–లార్)ను యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చింది. లార్ 2013 చట్టంలో అనేక సమస్యలున్నాయి. అఖిల భారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) మరియు వామపక్ష పార్టీలు ఆ సమస్యలను లేవనెత్తినాయి. దానిని బలపరచ డానికి అనేక సవరణలు పార్లమెంట్‌లో సూచించ బడినాయి. ఆ సవరణలు రైతుల, భూమిపై ఆధారపడి జీవించే ప్రజల ప్రయోజనాలను రక్షించే విధంగా భరోసానిచ్చాయి. యు.పి.ఎ. మరియు బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఎ. మధ్య జరిగిన రాజీ అనంతరం ఆ చట్టం నీరు కార్చబడినప్పటికీ వలస పాలనలో చేసిన చట్టం కన్నా చాలా అభివృద్ధికరమైది. దేశం యొక్క ఆహార భద్రతా ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని, ముందుగా రైతు యొక్క అంగీకారం తీసుకోవాలని మరియు సామాజిక ప్రభావపు అంచనా వేయాలన్న నియమం ఈ చట్టంలో పొందుపరచబడింది.

అధికారంలోనికి వచ్చిన అనంతరం, ఎన్.డి.ఎ. ప్రభుత్వం 'లార్ 2013'పై తన యొక్క అభిప్రాయాన్ని మార్చుకొని 2014 డిశంబర్‌లో ఆర్డినెన్స్ ద్వారా కొన్ని సవరణలను చేయాలని కోరింది. రియల్‌ఎస్టేట్, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చడానికి భూమిని గుంజు కునే మార్గాన్ని సులభతరం చేసింది. మళ్ళీ మనను వలసపాలనా యుగంలోని దయనీయ మైన స్థితికి తీసుకొనిపోయింది. బ్రిటిష్ పాల కులు కూడ, ప్రైవేట్ కంపెనీలకు అవసరమైన భూములు సేకరించడానికి రైతుల అంగీకారం అవసరం లేదన్న విషయాన్ని చట్టంలో చేర్చలేదు. వలస పాలకులు చేసిన చట్టం ప్రకారం కూడ, రైతాంగం యొక్క అనుమతి లేకుండా భూమిని బలవంతంగా తీసుకొనవచ్చు. కానీ అది కేవలం ప్రభుత్వ ప్రాజెక్టుల కొరకు మాత్రమే. బిజెపి ప్రభుత్వం జర్మనీలోని నాజీ పాలన నుండి ప్రేరణ పొందినట్లు కనపడుతుంది. అక్కడ ప్రజా ప్రయోజనాలుగా చెప్పబడుతున్న లక్ష్యం కొరకు ప్రజల నుండి వారి భూములను బలవంతంగా గుంజుకునే చట్టాలు చేయబడినాయి.

దీని ప్రభావంతో ఎన్‌డిఎ ప్రభుత్వం వలస పాలనలోని భూసేకరణ చట్టం 1894ను తిరిగి

“ఈ పరిణామాలన్నీ దేశవ్యాప్తంగా ఏనాడు లేనంత తీవ్రమైన నిరసనలకు దారితీశాయి. రైతులు మరియు భూమిపై ఆధారపడి జీవించే యితర వర్గాలకు చెందిన ప్రజలందరు వారి జీవనాధారమైన భూమి, వనరులు పోగొట్టు కుంటున్నామన్న భయంతో ఒక్క దగ్గరకు చేరినారు.”

ప్రవేశపెట్టింది. భూమిపై ఆధారపడి జీవించే రైతులు, యితరుల యొక్క అనుమతి పొందాలన్న నియమాన్ని మరియు సామాజిక ప్రభావపు అంచనా నియమాలను రద్దుచేసింది. సెక్షన్ 10ఎ క్రింద నిర్వహించబడే ప్రాజెక్టులు ఈ అవసరాల నుండి మినహాయించబడుతూ కొనసాగుతున్నాయి. ఒక “ప్రత్యేక కేటగిరి”లో యిది 5 అంశాలను చేర్చింది. వాటిలో అంత స్పష్టంగా లేని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం క్రింద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మరియు పారిశ్రామిక కారిడార్‌ల కొరకు కేటాయించబడిన భూమి కూడ వున్నది. చాలా సేకరణలు రెండు కేటగిరీల క్రిందకు వస్తాయి కాబట్టి ‘లార్ 2013’ లోని కనీస రక్షణ చర్యలను ప్రభుత్వం రద్దు చేసింది. అంతేకాకుండా ఒక నిపుణుల కమిటీ సమీక్ష చేయాలన్న నిబంధనను కూడా నిలిపివేసింది.

రోడ్లకు, రైల్వే లైన్లకు యిరువైపులా ఒక కిలోమీటరు వరకు భూమిని కలుపుకొనడానికి ఉద్దేశించబడిన పారిశ్రామిక కారిడార్‌లు అంటే అర్థం ఏమిటో ప్రభుత్వం వివరించింది. భూమి యజమానులకు చట్టపరమైన రక్షణ చర్యలు, అవసరమైనంత భూమిని పొందడానికి హామీకి అవసరమైన నిబంధనలను అఖిల భారత కిసాన్ సభ లాంటి సంఘాలు కోరినాయి. కానీ భూయజమానుల హక్కులు, భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల హక్కులన్నీ నీరుగార్చబడినాయి. కనీస పారదర్శకత నియమాలు అంగీకరించబడలేదు. ఆహార భద్రతా రక్షణ చర్యలు నిలిపివేయబడినాయి. వివిధ పంటలు పండే సారవంతమైన భూమి మరియు వర్షాధారంతో పండే పంట భూములు ఏ విధమైన నియమ నిబంధనలు లేకుండా స్వాధీనం చేసుకుంటున్నారు. భూమి యజమానులు కాకుండా భూమిపై ఆధారపడి జీవించే ప్రజలు కనీస పునరావాస చర్యలు, సహాయక చర్యలు లేకుండానే వదిలించుకోబడినారు. కేంద్రం లేదా రాష్ట్రాల వద్ద భూమిని ఉపయోగించుకునే విధానానికి ఏ విధమైన ప్రతిపాదనలు లేవు. భూమిని ఉపయోగించే విధానంలోని మార్పుల ఫలితంగా విశేషమైన ఆదాయాలు, అంతులేని లాభాలు కార్పొరేట్ కంపెనీల వద్ద మాత్రమే పోగుపడుతున్నాయి. ఈ లాభాలలో భూమి యజమానులకు మరియు భూమిపై ఆధారపడి జీవించే ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి ఏ విధమైన చర్యలు లేవు. కుటుంబంలో ఒక వ్యక్తికి ఉద్యోగం యివ్వాలన్న ప్రభుత్వ ప్రతిపాదన, కుటుంబం యొక్క ప్రధానమైన జీవనాధారాన్ని తొలగించి, కుటుంబంలోని ఒక వ్యక్తికి ఒక గుర్తుగా ఉద్యోగం యివ్వడంతో సమానం. భారతదేశంలో రైతు వ్యవసాయం చేయడం అనేది కుటుంబానికి సంబంధించిన విషయం మరియు అందరికి జరిగే నష్టాన్ని ఏదో ఒక ఉద్యోగంతో పరిహారం చెల్లించడం అంటే అది కనీస విజ్ఞతను అతిక్రమించడం తప్ప మరొకటి కాదు.

ఈ పరిణామాలన్నీ దేశవ్యాప్తంగా ఏనాడు లేనంత తీవ్రమైన నిరసనలకు దారితీశాయి. రైతులు మరియు భూమిపై ఆధారపడి జీవించే యితర వర్గాలకు చెందిన ప్రజలందరు వారి జీవనాధారమైన భూమి, వనరులు పోగొట్టుకుంటున్నామన్న భయంతో ఒక్క దగ్గరకు చేరినారు. ఎ.ఐ.కె.ఎస్. లాంటి రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ సంఘం, దళిత మరియు గిరిజన సంఘం మరియు యితర ప్రజా ఉద్యమాలకు చెందిన సంఘాలు వందల సంఖ్యలో కలిసి ‘భూమి అధికార్ ఆందోళన’ (భూమి హక్కుల కొరకు ఉద్యమం)గా ఏర్పడి పెద్దఎత్తున ప్రజా ప్రతిఘట నను నిర్మించినాయి. ప్రతిపక్ష పార్టీలు కూడ ఈ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లోపల, వెలుపల ఐక్యం అయినాయి. రాజకీయ అత్యవసరాలు, ఎన్నికల ఆలోచనలు ఆ ప్రతిపాద నలను తాత్కాలికంగా నిలుపుదల చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసినాయి.

ప్రస్తుతం వున్న భూ సంస్కరణలు మరియు భూసేకరణ, భూమి లీజు, భూమిని ఉపయోగించుకునే చట్టాలను బలహీనపరిచే ప్రయత్నాలు, వస్తున్న సమస్యలను త్వరగా పరిష్కరించే విధానం (ఫాస్ట్ ట్రాక్) అమలుచేస్తున్నారు. ‘లార్ 2013’ ను సవరించాలన్న అనేక ప్రయత్నాలు విఫలం చెందిన తరువాత, బిజెపి లేక దాని భాగస్వామ్య పక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాలలో, భూ సంస్కరణ చట్టాలలో వున్న యిబ్బందులు తొలగిపోయే విధంగా కొత్త చట్టాలను తీసుకొని వచ్చే ప్రయత్నం బిజెపి చేసింది. కనీసం ఒక స్వతంత్ర సంస్థగా వున్నట్లు కనిపించే ప్రయత్నం చేయని, నిపుణులతో నిండి వున్న ‘నీతి ఆయోగ్’ భూ చట్టాలకు సంబంధించిన వివిధ లాభదాయక నిబంధనలను నీరుగార్చ డానికి సిఫారసులు చేసే ప్రయత్నం చేసింది. అనేక రాష్ట్రాలు తమ యొక్క భూ సీలింగ్ చట్టాలు, భూమిని వినియోగించుకునే నియమ నిబంధనలను సవరించినాయి. రాజస్థాన్ రాష్ట్రంలోని వసుంధర రాజే నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ యాక్ట్, లాండ్ పూలింగ్ స్కీంలను చట్టాలుగా అంగీక రింపచేసుకున్నది. 2016 ఆగస్ట్‌లో గుజరాత్ ప్రభుత్వం భూ సేకరణలో పారదర్శకత, న్యాయమైన పరిహారం, పునరావాస చట్టం 2013 (గుజరాత్ సవరణ)ను తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ లాండ్ పూలింగ్ చట్టాన్ని తీసు కొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం 123 జి.ఓ.ను తెచ్చింది. హైకోర్టు రద్దు చేసినపుడు 123 జి.ఓ. స్థానంలో భూ సేకరణలో పారదర్శకత, న్యాయమైన పరిహారం, పునరావాస చట్టం 2016 (తెలంగాణా సవరణ)ను తీసుకొచ్చింది. ఈ చట్టం భూమిని స్వాధీనపర్చుకునే విధానాన్ని సులభతరం చేసింది. జార్ఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం ఛోటా నాగపూర్ కౌలుదారీ చట్టం, 1908, సంతాల్ పరగణా కౌలుదారీ చట్టం 1949లకు సవరణలు తెచ్చింది. చట్ట విరుద్ధ భూబదిలీకి వ్యతిరేకంగా రక్షణగా ఈ చట్టాలు వున్నాయి. చట్ట విరుద్ధంగా బదిలీ అయిన గిరిజనుల భూములను తిరిగి వారికి అప్పజెప్పే హామీని యిచ్చాయి. బిజెపి మరియు దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాలలో నయా ఉదారవాద విధానాలు మరింత వేగవంతం చేయబడుతూ ఇటువంటి రక్షణలన్నింటినీ నీరుగార్చుతున్నాయి. కానీ కాంగ్రెస్ పాలిత

రాష్ట్రమైన కర్ణాటక, బిజు జనతాదళ్ పాలిత రాష్ట్రమైన ఒరిస్సాలు కూడా ఏమీ వెనుకబడిలేవు. అవి కూడ భూమిని సులభంగా స్వాధీనం చేసుకునే చట్టాలను తీసుకువచ్చాయి.

ఈ విధానాల చేత బాగా దెబ్బతిన్నవారు అత్యంత అణగారిన వర్గాలకు చెందిన దళితులు మరియు ఆదివాసీలు. పీసా చట్టం, ఫారెస్ట్ రైట్స్ యాక్ట్, రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు అలాంటి ప్రాంతాలలో గిరిజనుల చేత, లేక గిరిజనుల మధ్య భూ బదిలీలు నిషేధించాలన్న మార్గదర్శకాలు యిచ్చినప్పటికీ, వనరులు బాగా వున్న ప్రాంతాలలో చట్ట విరుద్ధంగా భూ స్వాధీనాలు జరిగినట్లు నివేదికలు అందినాయి.

**దురవస్థలో కారిడార్‌లు:**

ఈ సందర్భంలో సెజ్‌లు, మైనింగ్, పరిశ్రమలు మరియు పట్టణీకరణ కొరకు పెద్ద మొత్తంలో వ్యవసాయ, అటవీ భూములు సేకరించబడుతున్నాయన్న విషయం గమనించవలసి వుంటుంది. అన్యాయమైన నియమ నిబంధనలకు లోబడి, సెజ్‌లు, పారిశ్రామికీకరణ పేరుతో భూములు సేకరించబడుతున్నాయి. వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారాల కొరకు దుర్వినియోగం చేస్తున్నారు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్), సెజ్‌ల కొరకు నిర్దేశించబడిన భూమి ఉపయోగించబడలేదని గుర్తించింది. 2014 నాటికి సెజ్‌ల కొరకు కేటాయించబడిన 45,635.63 హెక్టార్ల భూమికి గాను, కేవలం 28,488.49 హెక్టార్ల భూమిపైనే పని ప్రారంభమైంది. కాగ్ 17 రాష్ట్రాలలో జరిగిన మొత్తం ఉల్లంఘనలను కనుగొన్నది. ఒరిస్సాలో 96.58 శాతం సెజ్ భూమి ఉపయోగించబడకపోవడం చేత ఆ రాష్ట్రం అతిపెద్ద అపరాధిగా గుర్తించబడింది. ఆ రాష్ట్రంలో అలాంటి భూమి చట్ట విరుద్ధంగా తాకట్టు పెట్టడం ద్వారా 75 వేల కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకోబడినాయి. 10 సం.ల కాలంలో కేవలం 2 శాతం ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభించబడడానికి సిద్ధంగా వున్నాయి. బొగ్గు గనులను, సంబంధిత భూములను కోరుకున్న అనేక కంపెనీలు వాటియొక్క సొంత విలువలను పెంచుకోవడం తప్ప, ఆ భూములను అసలు ఉపయోగించలేదు. ప్రజా ప్రయోజనాల పేరుతో సెజ్‌ల కొరకు సేకరించబడిన కొన్ని వేల ఎకరాల భూమి తరువాత కాలంలో అమ్మి వేయబడడం లేదా యితర అవసరాల కొరకు ఉపయోగించబడింది. సెజ్‌ల కొరకు సేకరించిన భూమిని మళ్ళించిన గ్రూపులలో రిలయెన్స్

“ఈ సందర్భంలో సెజ్‌లు, మైనింగ్, పరిశ్రమలు మరియు పట్టణీకరణ కొరకు పెద్ద మొత్తంలో వ్యవసాయ, అటవీ భూములు సేకరించబడుతున్నాయన్న విషయం గమనించవలసి వుంటుంది. అన్యాయమైన నియమ నిబంధనలకు లోబడి, సెజ్‌లు, పారిశ్రామికీకరణ పేరుతో భూములు సేకరించబడుతున్నాయి. వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారాల కొరకు దుర్వినియోగం చేస్తున్నారు.”




ప్రభుత్వాలు సెజ్‌ల పేరుతో విస్తారమైన పంటభూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయి

ఇండస్ట్రీస్ మరియు ఎస్సార్ స్టీల్స్ వున్నాయి.

సెజ్ యాక్ట్, 2005, అధికారయుతం చేయబడిన నాటి నుండి 1.50 లక్షల ఎకరాల భూమి పరిధిలో 576 సెజ్‌లకు ఆమోదం ఇవ్వబడింది. వాటిలో 2014 మార్చి నాటికి 1.13 ఎకరాల పరిధిలోని 392 సెజ్‌లు గుర్తించబడినాయి. 392 గుర్తించబడిన జోన్లలో, 152 జోన్లలో మాత్రమే పని నడిచింది. సెజ్‌ల ప్రక్రియ దేశ ఆర్థిక వ్యవస్థపైన చెప్పుకోదగిన ప్రభావం చూపించలేదు అని ఆడిట్ పేర్కొన్నది. యింతకు ముందున్న చట్టం అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేసిందన్న ప్రభుత్వం పేర్కొన్నదానికి భిన్నంగా 804 పారిశ్రామిక ప్రాజెక్టులలో కేవం 8 శాతం మాత్రమే భూసేకరణలో వున్న సమస్యల కారణంగా నిలిచిపోయినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసింది.

దేశమంతటా (అన్ని వైపులా) పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి ప్రాంతాల (కారిడార్‌లు) ఏర్పాటుకు ప్రయత్నాలు చేయబడినాయి. ఆరు రాష్ట్రాల గుండా 1483 కి.మీ. పొడవున సాగిపోతున్న ఢిల్లీ–ముంబాయి పారిశ్రామిక కారిడార్ కొరకు, పారిశ్రామిక ప్రాంతం, నిమ్జ్, పెట్టుబడి ప్రాంతాల కొరకు నిర్ధేశించబడిన ప్రదేశం 6 లక్షల ఎకరాల వరకు వుంటుంది. 800 కి.మీ. పొడవున అడ్డంగా వున్న విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్ ఈస్ట్‌కోస్ట్ ఆర్థిక కారిడార్‌లో భాగంగా వున్నది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 79,960 ఎకరాలు నాలుగు కేంద్రాలు మరియు 11 పొటెన్షియల్ క్లస్టర్ల కొరకు సేకరించబడవలసి వున్నది. 560 కి.మీ. పొడవున వున్న చెన్నై–బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ కొరకు 47,563 ఎకరాలు సేకరించవలసి వున్నది. 17 కేంద్రాలు కలిగి వుండి 1840 కి.మీ. పొడవున్న అమృత్ సర్–కోల్‌కతా పారిశ్రామిక కారిడార్, 10 కేంద్రాలు కలిగి వుండి 1000 కి.మీ. పొడవున్న బెంగళూరు –ముంబాయి ఆర్థిక కారిడార్‌లు వున్నాయి.

దేశంలో గజిబిజిగా వున్న ఏడు రవాణా కారిడార్‌లు వివిధ దశలలో నిర్మాణంలో వున్నాయి. మెకిన్సీ మరియు ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ల చేత చిత్రీకరించబడుతున్న విషయమేమంటే, రవాణాలోని వృధాను తగ్గించడం మరియు చైనాను అందుకునే ప్రయత్నం చేయం అనేది కారిడార్‌లకు చెందిన అంతర్గత వ్యవస్థలో ఒక భాగం. ఐ.ఎం.ఎఫ్.

“అన్ని రకాల పంటలు పండే 33,000 ఎకరాలకు పైగా భూమిని బెదిరింపులతో ప్రజల నుండి సేకరిం చబడింది. పెద్ద దేశాలైనటువంటి యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల రాజధానులు ఏవీ కూడ యింత వైశాల్యంలో భూమిని సేకరించలేదన్న విషయం మనం గమనించాలి.”

ప్రపంచ బ్యాంక్ మరియు డబ్ల్యూ.టి.ఓ.తో పాటు, వరల్డ్ ఎకనామిక్ ఫోరం త్రయం స్వేచ్ఛా వ్యాపారాన్ని మరియు స్వేచ్ఛా వ్యాపార ఒప్పం దాలను సులభతరం చేస్తాయి. ఈ త్రయం స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాలు (ఎఫ్.టి.ఎ.) సరంజామాతో వచ్చింది. (ఫిర్యాదుల చట్టాలు మరియు న్యాయపాలన). నికోలస్ హిల్డ్‌యర్డ్ దీనిని “స్థలాన్ని సమయంతో నిర్మూలించడం” గా పేర్కొంటాడు. “ఇది వేగవంతమైన రైల్వేల కన్నా కొంచెం వేగవంతమైనవి, పెద్ద రోడ్ల కన్నా కొంచెం పెద్దవి, లోతైన తీరాల కన్నా కొంచెం లోతైనవి, పెద్దవైన విమానాశ్రయాల కన్నా కొంచెం పెద్దవి అని ఆయన పేర్కొన్నాడు. యిప్పుడు నిర్మించబడుతున్న కారిడార్‌లు స్వేచ్ఛా వ్యాపార జోన్లుగా గ్రహించబడినాయి. అక్కడ పన్నుల సూచికలు కూడ తీసివేయబడినాయి”. అని ఆయన అంటాడు. పెద్ద ఎత్తున సంపదను సులభంగా గుంజుకోవడానికి ప్రపంచం చుట్టూ ఈ మూకుమ్మడి కారిడార్‌లు నిర్మించ బడుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ షుమారు 8603 చదరపు కి.మీ. (21 లక్షల ఎకరాలు) ప్రదేశాన్ని చూపుతున్నది. ప్రతిపాదిత రాజధాని నగరం, అమరావతి ఒక్కదాని కొరకే 53,621 ఎకరాల భూమి ఆక్రమించుకోవలసి వుంటుంది. అన్ని రకాల పంటలు పండే 33,000 ఎకరాలకు పైగా భూమిని బెదిరింపులతో ప్రజల నుండి సేకరిం చబడింది. పెద్ద దేశాలైనటువంటి యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల రాజధానులు ఏవీ కూడ యింత వైశాల్యంలో భూమిని సేకరించలేదన్న విషయం మనం గమనించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడ మచిలీపట్నం పోర్ట్ మరియు పారిశ్రామిక కారిడార్ కొరకు ఒక లక్ష ఎకరాలకు పైగా భూమిని సేకరించాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నది. యిది, ఒక మంచి పోర్ట్ కొరకు అవసరానికి మించిన భారీ సేకరణ. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లక్షల ఎకరాల భూమిని సేకరించింది. యింకా తన భూ బ్యాంక్ కొరకు ఏడు లక్షల ఎకరాలను సేకరించాలని ప్రయత్నం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా 6 లక్షల ఎకరాలను సేకరిం చింది. యింకా కొన్ని లక్షల ఎకరాల సేకరణకు ప్రతిపాదిస్తున్నది.

నీతి ఆయోగ్ కోస్తాప్రాంతంలోని ఆర్థిక జోన్లను పునరుద్ధరించేప్రతిపాదనలను చేస్తున్నది. రెండు జోన్లు ఒక్కొక్కటి 2000 నుండి 3000 చదరపు కి.మీ.లలో విస్తరించి వుంటాయి. అందులోని భూమి ఎక్కువగా జీవావరణ ప్రాంతానికి చెందినది. సాగర్‌మాల ప్రాజెక్ట్ 12 పోర్టులు , 1208 దీవులకు విస్తరించాలని ప్రణాళిక రూపొందించారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసిన ప్రకటన ప్రకారం యిది 8 లక్షల కోట్ల రూపాయలతో వున్న పోర్టులను ఆధునీకరించడం, సంబంధిత పారిశ్రామి కీకరణ మరియు కొత్తపోర్టులను దశలవారీగా 2015–35 మధ్యలో ఏర్పాటు చేయాలని యోచిస్తోంది.

ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ వలన ఉత్తరప్రదేశ్‌లోని 23,000 పైగా గ్రామాలు నష్టాలకు గురి అవుతున్నట్లు అంచనా వేయబ డింది. ‘యమునా ఎక్స్‌ప్రెస్‌వే’ కు సంబంధించి 1.43 లక్షల ఎకరాల భూమి సేకరించ బడుతుండగా, 37,362 ఎకరాల భూమి గంగా ఎక్స్‌ప్రెస్‌వే కొరకు సేకరించబడుతున్నది. రవాణా కొరకు ఉద్దేశించబడిన కారిడార్ కొరకు సారవంతమైన కొన్ని వేల ఎకరాలు సేకరించబ డతాయి. ‘యమునా ఎక్స్‌ప్రెస్‌వే’ కొరకు సేకరించిన భూమి ఎక్కువగా గోల్ఫ్ కోర్టులు మరియు ఉద్యోగ కల్పన చేయని ప్రాజెక్ట్‌ల కొరకు ఉపయోగించబడింది. ప్రతిపాదిత “100 స్మార్ట్ నగరాల” ప్రాజెక్టులు కూడ విశాలంగా వ్యాపించి వున్న భూమిని తప్పించడానికి దారితీస్తాయి. ఈ లక్ష్యం కొరకు నీటిని దోపిడీ చేయటం తీవ్రమైన అసమానతలకు, కొరతకు దారితీ స్తుంది. ప్రతిపాదించబడిన “స్మార్ట్ నగరాలలో” మణిపూర్‌లోని మయన్మార్ సరిహద్దుకు దగ్గరలో వున్న ఒక నగరం జీవావరణ ప్రాంతానికి అపాయకరంగా మారే అవకాశం వున్నది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సాగునీటి ప్రాజెక్టు లైనటువంటి పోలవరం, మల్లన్నసాగర్ ప్రాజెక్ట్‌ల ప్రభావం ఒడిషా, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాలపై వుంటుంది. అవి పెద్ద ఎత్తున నీటి ముంపుకు గురౌతాయి. అధికార లెక్కల ప్రకారం, పోలవరం ప్రాజెక్ట్ వలన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో 276 గ్రామాలపై ప్రభావం చూపుతుంది. ఒక లక్ష ఎకరాల వ్యవసాయ భూమి నీటి మునిగి పోతుంది. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ కొరకు 18,000 ఎకరాలు సేకరించబడుతుంది. 16 గ్రామాలు మరియు 5,000 ఎకరాల సాగు భూమి నీట మునుగుతుందని అంచనా వేయ బడింది. పునరావాసాల దయనీయ స్థితి, నర్మదా లోయ ప్రాంతాలలోని ప్రజల అనుభవాలన్నీ సూచికలుగా వుంటాయి.

అలాంటి భూసేకరణ జరిగినప్రాంతాలలో, అణగారిన ప్రజలైనటువంటి భూమిలేని పేదలు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు మరియు ఆదివాసీలు తీవ్రంగా దెబ్బతిన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దళితుకులకు, ఆదివాసీలకు యివ్వబడిన అసైన్డ్ భూములు, ఉన్నత కులాలకు చెందిన వారి భూముల ధరలతో పోలిస్తే అత్యంత తక్కువ ధరకు సేకరించబడినాయి. ప్రభుత్వం నిరంకుశంగా అలాంటి భూములను ఏ విధమైన నష్ట పరిహారం, పునరావాసం లాంటివి కల్పించకుండానే స్వాధీనం చేసుకుం దన్న అభియోగాలున్నాయి. బీడు భూముల సర్వేలు, తరతరాలుగా సాగుచేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతులను బలవంతంగా వెళ్ళ గొట్టడానికి ఉపయోగించబడినాయి. కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న రైతులు (బగైర్ హుకుమ్ రైతులు), కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల కారణంగా బలవంతంగా వెళ్ళగొట్టబడతారన్న బెదిరింపులను ఎదుర్కొన్నారు.

ఆ విధంగా భూసేకరణ అనేది ప్రజల వద్ద వున్న సంపద, వనరులను పోగుచేసి, కార్పొరేట్ ప్రపంచానికి బదిలీచేసే ఒక వనరుగా తయా రైంది. ప్రభుత్వం యొక్క పాత్ర మోసపూరితంగా ఉండకూడదు. యిది కార్పొరేట్ శక్తుల ప్రయోజ

నాల కొరకు కొద్ది భూమిని కలిగి వున్న ప్రజలను బలవంతంగా వెళ్ళ గొడుతూ, బలి పశువులైన ప్రజలు అనుభవిం చాల్సిన చట్టపరమైన రక్షణ చర్యలను సిగ్గులేనితనంతో అమలు జరగకుండా ఉల్లంఘించినది. అటవీ హక్కుల చట్టం, షెడ్యూలు ఏరియాలకు పంచాయితీల విస్తరణ చట్టాలు షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఉల్లంఘించ బడినాయి. అటవీ హక్కుల, భూమి పట్టాల కొరకు లక్షల్లో వచ్చిన దరఖాస్తులన్నీ ఒక పథకం ప్రకారం తిరస్కరించబడినాయి. హిమాచల్ ప్రదేశ్‌లో దళితులచే అనుభవించబడిన "షామ్లత్", ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పేదలకు యివ్వ బడిన డి ఫాం పట్టా భూములు, యింకా యితర రాష్ట్రాలలో దళితులకు, యితర బలహీన వర్గాలకు పంపిణీ చేయబడిన భూములన్నీ యిప్పుడు స్వాధీనం చేసుకోబడడానికి గురిపెట్ట బడినాయి. కౌలుదార్లు, భూమిలేని వ్యవసాయ కూలీలు, చేతివృత్తి దారులు మరియు గ్రామీణ నిరుపేదలు పునరావాస చర్యలు, జీవనోపాధి రక్షణ చర్యలు నిరాకరింపబడు తున్నారు. అనేక రాష్ట్రాలు 'లార్ 2013'ను బలహీనపరచి, పేదలకు జీవనోపాధిని కల్పించే భూములను దోచు కుంటున్నాయి.

> **"కౌలుదార్లు, భూమిలేని వ్యవసాయ కూలీలు, చేతివృత్తి దారులు మరియు గ్రామీణ నిరుపేదలు పునరావాస చర్యలు, జీవనోపాధి రక్షణ చర్యలు నిరాకరింపబడుతున్నారు. అనేక రాష్ట్రాలు LAAR 2013ను బలహీనపరచి, పేదలకు జీవనోపాధిని కల్పించే భూములను దోచు కుంటున్నాయి."**




రాజస్థాన్‌లోని సికార్‌లో ఇటీవల జరిగిన భారీ కిసాన్ రాలీ సందర్భంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ తగలేస్తున్న రైతులు

**ప్రతిఘటన నిర్మాణం:**

రైతాంగం మరియు జీవనాధారం కొరకు భూమిపై ఆధారపడే ప్రజలు, విశాల ప్రాతిపదికన నిర్మించే ఐక్యత ద్వారా పెట్టుబడిదారుల హింసాత్మక చర్యలను సవాల్‌చేసే సామర్థ్యంపైనే వారి భవిష్యత్ ఆధారపడి వున్నదని తెలుసుకున్నారు. పోలవరం, మల్లన్నసాగర్, నర్మదా లోయలలో అణచివేత ఉన్నప్పటికీ పోరాటాలు చాలా సహనంగా నిర్మించబడుతున్నాయి. వివిధ రీతులలోని పారిశ్రామికీకరణలను జాగ్రత్తగా అంచనా వేయడం, ఖనిజ లోహాల వెలికితీత, అడవి మరియు నీటి వనరుల దోపిడీ మరియు జరిగిన తప్పిదాల నుండి గుణపాఠాలు నేర్చుకోవడం, భూసేకరణపై ఒక సరియైన అవగాహనాస్థితికి చేరుకోవడానికి దారితీశాయి. ఈ పోరాటంలో భాగస్వాములైన సంఘాలు భిన్న మార్గాల ఒంటరితనం నుండి బయటపడినాయి. అవి ప్రతిఘటనను నిర్మించడానికి భాగస్వామ్య అనుభవం మరియు సహకార విధానంపై ఆధారపడిన ఆంతరంగిక వ్యవస్థ అవసరాన్ని గుర్తించినాయి.

యిప్పుడు, భూసేకరణ ఆర్డినెన్స్‌ను ప్రతిఘటించడానికి ఏర్పడిన 'భూమి అధికార్ ఆందోళన్' అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. నర్మదా లోయలో 40,000 కుటుంబాలు నీటి మునకకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు సంఘీభావం మరియు దానిలో పాలుపంచుకోవడం, మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో ఢిల్లీ–ముంబాయి పారిశ్రామిక కారిడార్ కొరకు చేసిన భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం మరియు కన్హార్ డ్యాం కొరకు గిరిజన ప్రజలను ఖాళీ చేయించిన దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలన్నీ కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్మించే దిశలో వున్నాయి. అదే విధంగా, తరతరాలుగా ప్రభుత్వ మిగులు భూములను సాగుచేసుకుంటున్న సాగుదారులను పెద్ద ఎత్తున బలవంతంగా ఖాళీ చేయించే దాన్ని అడ్డుకునేందుకు చేసే పోరాటం మరియు అడవిలో సాంప్రదాయబద్ధంగా నివసించే ప్రజలు మరియు ఆదివాసీల హక్కులను రక్షించే దాని కొరకు జరిగే పోరాటాలతో కూడ 'భూమి అధికార్ ఆందోళన్' కలిసి పోరాటం చేస్తున్నది. సెజ్‌లు, పారిశ్రామికీరణ మరియు యితర సాకులతో సేకరించబడిన వేల ఎకరాల భూమి కొన్ని సంవత్సరాలుగా ఉపయోగించబడకుండానే మిగిలిపోయింది. భూమిలేని పేదలు ఐక్యం అయి, ఆ భూములను సాగుచేసే రోజులు రాబోతున్నాయి. "భూమిని తిరిగి యివ్వండి" అనేదే భవిష్యత్ పిలుపు అవుతుంది.

ఖనిజ, జల, అటవీ వనరులను లూటీ చేయటం లక్ష్యంగా జరిగే విచక్షణారహిత భూసేకరణను వ్యతిరేకించే ఈ ప్రతిఘటన, భూమిని పంచే భూ సంస్కరణల దిశగా సాగే పోరాటంలో ఒక భాగం. యిది యిల్లులేని వారికి యిల్లు కావాలన్న హక్కులను, జీవనోపాధి రక్షణకు హామీనిచ్చే పోరాటంలో కూడ ఒక భాగం. ఆదాయాలు పూర్తిగా పడిపోయి గతంలో లేనంత సంక్షోభంలో కూరుకుపోయి, భూమి సాగే ప్రధాన జీవనాధారంగా వుండి, ఆ భూమి నుండి బలవంతంగా నెట్టివేయబడిన రైతాంగానికి ఈ పోరాటం ఒక విశాల ఐక్య వేదికగా శాశ్వతంగా నిలుస్తుంది.

❄

**(అనువాదం: బోడపట్ల రవీందర్)**

# ఫిబ్రవరి విప్లవం తరువాతి పరిణామాలు



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**ఆర్. అరుణ్ కుమార్**

రష్యాలో అధికార సంక్షోభాన్ని 1917 ఏప్రిల్, మే నెలలు తీవ్రతరం చేశాయి. అక్టోబరిస్ట్‌లకు నేతృత్వం వహిస్తున్న మంత్రి గుచ్కోవ్ రాజీనామాకు వత్తిడి పెరిగింది. ద్వంద్వ ప్రభుత్వం ఇక కుదిరేది కాదని ప్రజల్లో వెల్లువెత్తిన అసంతృప్తి స్పష్టం చేసింది. సోవియట్‌లకు ఎటువంటి నియంత్రణ ఇవ్వకుండా పూర్తి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని పెట్టుబడి దారులు కోరుకున్నారు. మరోపక్క మెన్షెవిక్‌లు, నరోద్నిక్‌లు ప్రావిన్షియల్ ప్రభుత్వంలో చేరి కొన్ని మంత్రి పదవులు పొందాలనుకున్నారు. సోవియట్ వారి విధానాల్ని పూర్తిగా మార్చు కోవాలనే మూడో మార్గాన్ని బోల్షివిక్‌లు ప్రతిపాదించారు. పెట్టుబడిదారుల మీద ఏ విశ్వాసం ఉంచకుండా.. పూర్తి అధికారాన్ని కార్మి కులు, సైనికులకు చెందిన సోవియట్‌ల డిప్యూటీలకు అప్పజెప్పాలని వివరించారు.

దేశ పరిస్థితుల్లో వచ్చిన మార్పులపై కేంద్రీకరించిన ఈ కొత్త నినాదానికి కారణాన్ని లెనిన్ వివరించాడు. ఫిబ్రవరి విప్లవం తర్వాతి రెండు నెలలకు కూడా యుద్ధం ముగియలేదు. 'ఓ ముగింపు' పలికే వరకు యుద్ధం చేసేందుకు పెట్టుబడిదారులు ఉవ్విళ్లూరారు. వారి వర్గ పాలన కోసం వారి చేతుల్లోని అధికారాన్ని ఉపయోగించేందుకు.. మోసపూరిత ఎత్తులతో ప్రజాదరణ, మద్దతు పొందేందుకు ప్రయత్నించారు. దేశం యావత్తు నిరుద్యోగం, ఆకలి, కరువుతో తల్లడిల్లుతుంటే ఆ రెండు నెలల్లో పెట్టు బడిదారులు నిర్ఘాంతపోయేంత లాభాల్ని కళ్ల జూశారు. భూమిపై యాజమాన్యం ఎవరిదన్న విషయంపై నిర్ణయం తీసుకునేందుకు అసెంబ్లీని ఏర్పరిచే రాజ్యాంగం గురించి ప్రావిన్షియల్ ప్రభుత్వం అదే పనిగా చిలుక పలుకులు పలి కేది. ఎంత కాలం దానికి పడుతుందనే విషయం పై స్పష్టత ఇవ్వకుండా ఆ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు భూమి కోసం రైతులు ఎదురుచూడాలని ప్రావిన్షియల్ ప్రభుత్వం కోరుకుంది. ఆగ్రహంతో ఎస్టేట్ భూముల్ని ముట్టడించిన రైతుల్ని వినాశకర శక్తులని ముద్ర వేసి వారి చర్యల్ని ఖండించేది. జార్ పాలనను కూల్చడంలో ప్రముఖ పాత్ర వహించిన శ్రామికులు, రైతుల్ని లక్ష్యపెట్టకుండా తమ అధికారాన్ని నిలుపుకునేందుకు పెట్టుబడిదారులు ప్రయత్నిస్తున్నారని ఇలాంటివన్నీ రూఢీ చేశాయి. ఇలాంటి నేపథ్యంలో బోల్షివిక్‌లు పూర్తి అధికారాన్ని సోవియెట్‌లకు మార్పిడి చేయాలని పిలుపునిచ్చారు.

"ద్వంద్వ ప్రభుత్వం ఎక్కువ కాలం సాగద"ని లెనిన్ పేర్కొంటూ "పెట్టుబడిదారుల సుప్రీం పాలన వైపు వెనక్కు వెళదామా... నిజమైన ప్రజాస్వామ్యం, మెజారిటీ నిర్ణయాల వైపు ముందుకు కదులుదామా..." అనే నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. వర్గ పోరాటాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడంలో విఫలమై... ద్వంద్వ ప్రభుత్వంలో తమ భాగస్వామ్యం ద్వారా 'మాటలు, వాగ్దానాలు, తీర్మానాలు, కమిషన్ల'తో 'దాన్ని మార్చి, పైపూత పూసి, పునరుద్ధరించాల'ని కోరుకుంటున్న మెన్షెవిక్‌లు, నరోద్నిక్‌లను ఆయన విమర్శించాడు. శ్రామికులు, రైతు వర్గాల్లో ఆందోళనల్ని కొనసాగిస్తూ ప్రజలకు ఈ మోసాన్ని బట్టబయలు చేయాలని బోల్షివిక్‌లకు ఉద్బోధించాడు. 'సమయం కోసం నిరీక్షిస్తే మేలు జరగదు.. పరిస్థితులు చేయిదాటిపోతాయ'ంటూ సోవియెట్‌లలో బోల్షివిక్‌లకు ఇంకా మెజారిటీ రాకున్నా కూడా సోవియెట్‌లకు అధికారాన్ని బదలాయించాలని కోరాడు. 'అల్ప-బూర్జువా అశక్తత' స్వభావమంటూ మెన్షివిక్‌లు, నరోద్నిక్‌ల రాజీపూర్వక వైఖరిని లెనిన్ తప్పుబట్టాడు. పెట్టుబడిదారుల మైనారిటీకి వ్యతిరేకంగా పనిచేసే శ్రామిక, రైతు మెజారిటీ తప్ప వేరే మార్గం లేదని స్పష్టం చేశాడు. సోవియెట్‌లు అధికారాన్ని నిలుపుకోవడంలో తొలుత కొన్ని తప్పులు జరిగే అవకాశం ఉండొచ్చు కానీ ఇది తప్ప వేరే మార్గం లేదని తేల్చిచెప్పాడు.

**ఆర్థిక వినాశం**

సోవియెట్‌లపై రష్యాలోని పెట్టుబడిదారి వర్గం పూర్తి అసంతృప్తితో ఉన్నారు. సోవియెట్ నేతల రాజీలతో కూడా. సోవియెట్‌ల నుంచి మరిన్ని రాయితీలు పొందేందుకు, ఆర్థిక వ్యవస్థపై పూర్తి నియంత్రణ కోసం వారు రష్యా ఆర్థిక జీవితాన్ని ధ్వంసం చేయాలని చూశారు. చాలా చోట్ల వారు ఉత్పత్తి శక్తుల్ని ఛిన్నాభిన్నం చేశారు. చాలా పరిశ్రమలు ఉత్పత్తి నిలిపివేశాయి. అనేక గనులు మూతబడ్డాయి లేదా ఉత్పత్తి తగ్గించాయి. దేశం ఎంతో అవసరంలో ఉన్నా కూడా యంత్రా ల్ని మరమ్మతు చేయడానికి, ఉత్పత్తుల్ని తరలించడానికి నిరాకరించారు. బొగ్గు లభ్యతపై కొరతను సృష్టించి రైళ్లు, పరిశ్రమలు నిలిచిపోయేలా చేశారు. నిత్యావసరాల కొరతను కూడా సృష్టించారు. దీన్ని విప్లవ ప్రతీఘాతక చర్య కింద లెనిన్ అభివర్ణించాడు.

పెట్టుబడిదారులపై చర్యలు తీసుకోకుండా ఈ పరిస్థితికి కారణం బోల్షివిక్‌లేనంటూ ప్రావిన్షి యల్ ప్రభుత్వం నిందించింది. పెట్టుబడిదారు లకు వ్యతిరేకంగా ప్రభుత్వంలోని మెన్షెవిక్‌లు ఏమీ చేయలేదు. కమిటీలు, కమిషన్లు, తీర్మానాల పేరిట మాటలకే పరిమితమయ్యారు. 'దోపిడీ దారుల వికృతనాట్యాన్ని' బహిర్గతపరిచేందుకు బోల్షివిక్‌లు నడుం బిగించాలని లెనిన్ కోరాడు. ఈ దోపిడీకి సంబంధించిన సరైన సమాచారాన్ని వెలువరించి 'ధరలు-లాభాలు' వివరాలు జనాల్లోకి తీసుకెళ్లాలని కార్మికులు ఉద్యోగులను కోరాడు. పెట్టుబడిదారుల్ని బట్టబయలు చేయడమే వారిని నిలువరించే తొలి అడుగు అని చెప్పాడు. వస్తువుల ఉత్పత్తి, సరఫరాలపై కార్మి

కుల ప్రభావంతమైన నియంత్రణను నెలకొల్పడమే... విపత్తును తప్పించే ఒకే ఒక మార్గమని ఆయన స్పష్టం చేశాడు. ఉనికిలోనున్న జాతీయ సంఘం సోవియెట్ ద్వారా శ్రామిక, కూలీ వర్గాలు అధికారాన్ని కైవసం చేసుకోవాలని కోరాడు. ఈ సంఘం ద్వారా ఉత్పత్తిని పునర్వ్యవస్థీకరించాలని, వస్తువులు, సేద్య ఫలాల్ని పంచుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ సరఫరా పద్ధతుల్ని తేవాలని, రైతులు, శ్రామికులు లాభాల్ని పంచుకోవాలని సూచించాడు. శ్రామిక, రైతు వర్గాల రాజకీయ ఆధిపత్య రూపంలో పెట్టుబడిపై వర్గపోరాటం చేయాలని ఆయన కోరాడు.

"మెన్షివిక్‌లు, నరోద్నిక్‌ల అవకాశవాదాన్ని ఎండగట్టాల్సిందిగా బోల్షివిక్‌లకు పిలుపునిచ్చాడు. భూమి స్వాధీనం కోసం, సంక్షోభాన్ని తొలగించడం కోసం, ఓటమి దిశగా వెళుతోన్న దేశాన్ని కాపాడుకోవడం కోసం యుద్ధానికి వ్యతిరేకంగా తమ ప్రచారాన్ని వ్యాప్తి చేయాలని కోరాడు."



ప్రజలచే కూల్చివేయబడిర జార్ చక్రవర్తి విగ్రహం

### స్థానిక ఎన్నికలు

ఈ కాలంలోనే మున్సిపాలిటీలు, జిల్లా సమితులకు ఎన్నికలు జరిగాయి. 'విప్లవ కాలం'లో వస్తున్న ఎన్నికలను ఎంతో ప్రాముఖ్యమైనవిగా లెనిన్ చూశాడు. రాజ్యంతో యుద్ధాన్ని, సోషలిస్ట్ శక్తుల పురోగమనాన్ని వ్యతిరేకించిన 'ఇంటర్నేషనలిస్ట్ మెన్షివిక్'లతో పాటు బోల్షివిక్‌లు ఎన్నికల్లో పాల్గన్నారు. పాపులర్ సోషలిస్టులు, సోషలిస్ట్ రెవల్యూషనరీలు, ట్రూడోవిక్‌లతో కలసి నరోద్నిక్‌లు ఏర్పాటు చేసిన వర్గం, ప్లెఖనోవ్, యెదిన్స్టోవ్‌ల కూటమితో మెన్షివిక్‌లు కూడి ఓ బ్లాక్‌ను రూపొందించారు. దీన్ని 'అల్ప–బూర్జువాల విచిత్ర కలయిక'గా 'నియమాలులేని కూటమి'గా లెనిన్ చూశాడు. "పార్టీల్ని ఎవరు లెక్కచేస్తారు.. గెలవడమే ఇక్కడ విషయం. అదే ప్రతిచోట, ప్రతిసారి బూర్జువా శాసకుల నినాదం." అని ఆ వర్గాల తీరుని లెనిన్ వివరించాడు. మెన్షివిక్‌లు, నరోద్నిక్‌ల అవకాశవాదాన్ని ఎండగట్టాల్సిందిగా బోల్షివిక్‌లకు పిలుపునిచ్చాడు. భూమి స్వాధీనత కోసం, సంక్షోభాన్ని తొలగించడం కోసం, ఓటమి దిశగా వెళుతోన్న దేశాన్ని కాపాడుకోవడం కోసం యుద్ధానికి వ్యతిరేకంగా తమ ప్రచారాన్ని వ్యాప్తి చేయాలని కోరాడు.

ఈ ఎన్నికల ప్రక్రియలో 'ఇతర పార్టీల్ని విమర్శించేపుడు... మన గురించి విమర్శ చేసుకోవడం మరిచిపోకూడద'ని పేర్కొంటూ బోల్షివిక్‌ల రెండు లోపాల్ని లెనిన్ బహిరంగంగానే ఒప్పుకున్నాడు. ధనిక వర్గ ప్రజలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో బోల్షివిక్‌లు అభ్యర్థుల్ని నిలపడంలో చేసిన తప్పిదాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రజల ముందు కచ్చితంగా నిజాయితీగా ఉండాల్సిందేనని ఆయన ఉద్ఘాటించాడు. 'పైకి మంచి మాటలతో నిష్ఠుర సత్యానికి ముసుగు వేయడం కష్టజీవులు, శ్రామికుల పోరాటానికి అతి ప్రమాదకరమ'ని స్పష్టం చేశాడు. ఎంత చేదుగా ఉన్నా కూడా యదార్థాన్ని రాజీ లేకుండా నేరుగా ఎదుర్కోవాలని చెప్పాడు. ఈ నియమాన్ని పాటించలేని విధానం వినాశకర విధానమని ఆయన అభివర్ణించాడు. ఇది ఎంత కష్టంగా ఉన్నా ప్రజల కళ్లు తెరిపించి అసత్యానికి వ్యతిరేకంగా పోరాడేలా వారికి నేర్పుతుందని ఆయన వాదించాడు. వాస్తవాలకు పూతలు పూయకుండా నిక్కచ్చిగా ప్రజలకు వివరాలు చెప్పాలని, వర్గ పోరాటాన్ని మూలకు ఊడ్చేయకుండా.. అన్ని రాజకీయ పరిస్థితుల్లో దాని సంబంధంపై స్పష్టతనివ్వాలని బుద్ధి చెప్పాడు.

మెన్షివిక్‌ల మానిఫెస్టో నిండా నిండిపోయిన అంశాల్ని, నినాదాల అసలు వాస్తవాల్ని ఈ వ్యూహంతోనే లెనిన్ బట్టబయలుచేశాడు. 'యుద్ధం–విప్లవం' ప్రశ్నపై ఆయన ఇచ్చిన ప్రసంగంలో మెన్షివిక్‌లు, నరోద్నిక్‌లు, ఇతర 'విప్లవ రక్షకుల' అందమైన కల్లబల్లి మాటల ముసుగుల్ని ఆయన చింపివేశాడు. చాలా తేలిగ్గా వాస్తవాన్ని ఎదుటనిలిపాడు. యుద్ధ వర్గ స్వభావాన్ని.. ఈ ప్రశ్నకు సంబంధించి వివిధ సమూహాల, వర్గాల స్థానాల్ని వివరించాడు. సోషలిస్ట్ విప్లవం గురించి, బోల్షివిక్‌లపై పెట్టుబడిదారులు, వారి ఆశ్రిత వర్గాలు వ్యాప్తి చేసిన అవాస్తవాల్ని ఆయన బహిర్గతం చేశాడు. తమ వర్గం ఇతర వర్గాల మధ్య వైరుధ్యాన్ని.. సామ్రాజ్యవాద యుద్ధం నుంచి వచ్చిన వారి వ్యూహాల్ని వివరించాడు. తాను మాటల్ని, వాగ్దానాల్ని నమ్మలేనని.. అది వినాశనానికే దారి తీస్తుందని, ఒకరి రాజకీయ నిజాయితీని పరీక్షించేవి చేతలేనని లెనిన్ స్పష్టంచేశాడు. 'కాగితపు ప్రకటనల్ని నమ్మొద్దని పార్లమెంట్ రిపబ్లిక్‌ల పాఠాలు మనకు నేర్పుతాయి... పెట్టుబడిదారీ ప్రభుత్వాలు మొదలెట్టిన యుద్ధం కార్మికుల విప్లవంతోనే ముగుస్తుంది.' అని బలంగా నమ్మాడు.

సోషలిస్ట్ యుగానికి తగ్గట్టు మారిన పరిస్థితుల అవసరాలను తీర్చే విధంగా తమ పార్టీ విధానాల్ని పునర్నిర్మించుకునేలా బోల్షివిక్ పార్టీని లెనిన్ ముందుకు నడిపాడు. జర్మనీలో లీబ్‌ఖ్నెక్ 'ఒంటరి'గా ఉన్నాడనే విషయానికి వివరణనిస్తూ 'చాలా దేశాల్లో ప్రతిదీ గాఢనిద్రలో ఉన్నట్టు కనిపించొచ్చు' అంటూ లెనిన్ "కార్మిక వర్గానికి ప్రాతినిథ్యం వహిస్తోన్న ఈ ఒకే ఒకటి... లీబ్‌ఖ్నెక్‌కు, జైళ్ళలో మగ్గుతోన్న సోషలిస్టుల మైనారిటీకి శ్రామిక వర్గం అండ అవుతుంది. ఆర్థిక పురోగతి మొత్తం బలమవుతుంది" అని ఆశను వ్యక్తం చేశాడు. శ్రామిక వర్గంపై, వారి శక్తిపై లెనిన్‌కు ఉన్న అచంచలమైన విశ్వాసాన్ని ఈ మాటలు పట్టిచూపుతాయి.

**"చరిత్ర దీన్ని నిన్న రుజువు చేసింది... రేపూ రుజువు చేస్తుంది." అన్నాడు. ఎంత గొప్ప మాట..!**

**( అనువాదం: వారాల అజయ్‌కుమార్)**


అధ్యయనం

# పెట్టుబడి - పర్యావరణం కారల్‌మార్క్స్

పి. దక్షిణామూర్తి

> మానవునికీ, ప్రకృతికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని అత్యంత పవిత్ర మైనదిగా పరిగణించి పరిరక్షించాలి. అటువంటి సంబంధం అత్యంత సామాన్యంగా ఉండాలి. దోపిడికీ, దురాశకు పోయి ప్రకృతిని నాశనం చేయరాదు. ప్రకృతి ద్వారా లభించే సహజ వనరులను అత్యంత జాగ్రత్తతో కాపాడి భావితరాలకు అందించాలి.
>
> **- ఎర్త్‌డే సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్**

**కా**ర్ల్‌మార్క్స్ మళ్లీ గుర్తుకొచ్చాడు. ప్రతీ సంక్షోభ సమయంలోనూ పెట్టుబడిదారులకు కూడా మార్క్స్ గుర్తుకొస్తున్నాడు. కానీ ఈసారి ఆర్థికసంక్షోభం కాదు. పర్యావరణ విధ్వంసక సంక్షోభం. పర్యావరణ సంబంధాలను పెట్టుబడి దారీ ఉత్పత్తి సంబంధాలు నడిపిస్తుంటాయనీ, మితిమీరిన పారిశ్రామిక సరుకుల ఉత్పత్తి ద్వారా అత్యధిక లాభం సంపాదించడమే అత్యధిక పెట్టుబడిదారీ విధానం యొక్క లక్ష్యమనీ ఆ లాభాల కోసం పెట్టుబడిదారుడు ఎంతకైనా తెగిస్తాడనీ, ప్రకృతిని పర్యావరణాన్ని కూడా లెక్కచేయడనీ కార్ల్‌మార్క్స్ తన రచనలలో విశ్లేషించడం జరిగింది. పర్యావరణం – సోషలిజం (ఎకోసోషలిజం) పైన రచనలు చేసే జాన్ బెల్లామీ ఫోస్టర్, పాలర్ బర్‌కెట్ అనేవారు తమ సుప్రసిద్ధమైన "మార్క్స్ అండ్ ది ఎర్త్" (మార్క్స్ మరియు భూమి) అనే గ్రంథంలో ఈ విషయాలను సోదాహరణంగా వివరిం చడంతో పర్యావరణం గురించి మార్క్స్, ఎంగిల్స్ చెప్పిన మాటలు మళ్లీ పెద్దఎత్తున చర్చ నీయాంశమైనాయి. మానవుడు ప్రకృతి మీద తన శక్తిని ఉపయోగించి శ్రమచేసి ఉపయోగపు విలువ కల్గిన వస్తువులను తయారుచేస్తాడనీ ప్రకృతి – మానవుడు – శ్రమల మధ్య ఉన్న కార్యాకారణ సంబంధాన్ని 1875లోనే గోధా ప్రోగ్రామ్ అనే తన విమర్శలో మార్క్స్ తెలియజేసాడని ఈ రచయితలు తమ పుస్తకంలో గుర్తుచేసారు. 1844లో మార్క్స్ వ్రాసిన "ఎకనామిక్ అండ్ ఫిలసాఫికల్ మాన్యుస్క్రిప్ట్స్"లో కూడా ప్రకృతి మానవ జీవితానికి ఆధారమనీ, అన్ని శాస్త్రాలూ ప్రకృతి నుండే పుడతాయనీ కూడా ఉటంకించాడు. కానీ ఉపయోగపు విలువ కోసం తయారుచేసిన వస్తువును పెట్టుబడి దారుడు సరుకుగా మార్చి అత్యధిక లాభానికి అమ్ముకొం టాడనీ, కార్మికుడు చేసే శ్రమ వలన అదనపు విలువ పెట్టుబడిదారుడికి లభిస్తుందనీ అదనపు విలువే లాభమనీ మొట్టమొదట ప్రపంచానికి తెలియజెప్పినమార్క్స్,



ఆ లాభం కోసం పెట్టు బడిదారుడు సైన్సునీ, ప్రకృతి శక్తులనీ ఇష్ట మొచ్చిన రీతిలో వాడుకొంటాడనీ, కార్మికుడి ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోడనీ, ఈ క్రమంలో ప్రకృతిని ధ్వంసం చేస్తాడనీ విశ్లేషించాడు.

సుప్రసిద్ధ కమ్యూనిస్టు మానిఫెస్టో (కమ్యూనిస్టు ప్రణాళిక)లోనే మార్క్స్, ఎంగిల్స్‌లు పర్యావరణానికి సంబంధించిన డిమాండ్స్ చేశారు. భూముల మీద ఆస్తి హక్కు రద్దుచేసి, భూముల మీద వచ్చే కౌలు డబ్బు అంతా సామాజిక కార్యాలకు వినియోగించాలని చేసిన మొట్టమొదటి డిమాండ్ నేటి పరిస్థితులకు సరిగ్గా సరిపోతుంది. పర్యావరణానికి అత్యంత ప్రమాదకరంగా మారిన మితిమీరిన గనుల తవ్వకం, చమురు బావుల తవ్వకం, అమెరికా తదితర ప్రాంతాల్లో కొండలను, రాళ్లను చమురు సహజ వాయువుల కోసం తొలచడం తదితర చర్యలను నిరసిస్తూ వివిధ ప్రాంతాల్లో ఉద్యమి స్తుండడం గమనిస్తే కమ్యూనిస్టు మానిఫెస్టోలో చేసిన ఈ మొదటి డిమాండ్ ఎంత సార్వజనీ నమైనదో అర్థమవుతుంది. అంటే ప్రజలకి అవసరమైన ఉత్పత్తులను ప్రభుత్వమే ఒక సమిష్టి ప్లాను ప్రకారం అవసరమైనంత మాత్రమే ఉత్పత్తి చేయడం ద్వారా అధికోత్పత్తి సంక్షోభాలను నివారించడమే కాక పర్యావరణ విధ్వంసాలను కూడా తగ్గించుకోవచ్చు.

కమ్యూనిస్టు మానిఫెస్టోలోని ఆరవ డిమాండ్ ప్రకారం ప్రజా రవాణా సాధనాలు ప్రభుత్వం చేతిలోనే కేంద్రీకృతమయి ఉండాలి. అంటే పద్బందీ అయిన ప్రజారవణా వ్యవస్థను ప్రభుత్వమే రూపొందించడం ద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించడం, ప్రజలందరూ సామాజిక రవాణా వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవడం వలన పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల వినియోగం తగ్గిపోతుంది. ఫలితంగా ఇంధనాలు మండించడం వలన జరిగే వాయుకాలుష్యాన్ని తగ్గించవచ్చు. చమురు వెలికితీత వలన జరిగే హానిని కూడా కనిష్టస్థాయిల్లో ఉంచవచ్చు. ఈ వాయు కాలుష్యం వలన జరిగే భూతాపం సమస్య కూడా తగ్గే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ ఫ్యాక్టరీలూ, ఉత్పత్తి సాధనాలు ప్రభుత్వమే నిర్వహించడమనే ఏడవ డిమాండ్ కూడా పైన చెప్పినట్లు సమాజానికి అవసరమైనంత మేరకే జరిగే సామాజిక ఉత్పత్తి వ్యవస్థకి సంబంధించినది. దాని వలన జరిగే లాభాలు పైనే చెప్పుకొన్నాం. అనూహ్యమైన పర్యావరణ మార్పుల వలన సారవంతమైన భూములు కూడా చౌడు భూములుగా మారడం మనం చూస్తున్నాం. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగం పెరగడం వలన కూడా భూముల నాణ్యత తగ్గిపోవడం మనకనుభవమే. బంజరు భూములను సాగుచేయాలని, ఒక సమిష్టి పథకం ప్రకారం భూములు సారవంతం చేయాలని కూడా ఏడవ డిమాండులో చర్చించారు. సేంద్రీయ ఎరువులు ప్రాధాన్యం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. అటువంటి సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా బంజరు భూములను సారవంతం చేయాలని కూడా మార్క్స్ విశదీకరించాడు. వ్యవసాయాన్నీ పరిశ్రమలనూ సమ్మేళనం చేయాలని అటువంటి సమ్మేళనం పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడేలా ఉండాలని తొమ్మిదవ డిమాండ్‌వలన మనకు అర్థమ

వుతుంది. వ్యవసాయ ఉత్పత్తులను సమర్థంగా వినియోగించుకోవడం కోసం వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి కల్పన కూడా పెరుగుతుంది.

ఇక విపరీతమైన పట్టణీకరణ వలన ఏర్పడుతున్న వివిధ సామాజిక ఆర్థిక సమస్యల పట్ల, పట్టణాల్లో నెలకొనే ఆవాసాలు సమస్య, వాహన, శబ్ద కాలుష్యం, పారిశుద్ధ్య సమస్యలు వాటి వలన నేడు మనమంతా ఆందోళన చెందుతున్నాం. జనసంఖ్య విషయంలో వివిధ ప్రాంతాల మధ్య అసమానతలు తగ్గించడం ద్వారా పట్టణాలకూ, పల్లెలకూ గల భేధాన్ని రద్దుచేస్తే పైన పేర్కొన్న సమస్యలన్నింటి నుండి బయట పడవచ్చని కూడా ఆనాడే కమ్యూనిస్టు ప్రణాళికలోని తొమ్మిదవ డిమాండ్ సూచించింది.

పెట్టుబడిదారీ విధానంలో గరిష్ట ఉత్పత్తి కోసం టెక్నాలజీ వినియోగం పెరుగుతుందనీ, దానివలన పర్యావరణానికి తీవ్ర హానీ జరుగుతుందనీ, కార్మికుని పీల్చిపిప్పి చేయడమే కాక ప్రకృతి సహజసిద్ధ ప్రసాదాలైన భూమిని, మట్టినీ ఖనిజాల లాంటి సహజవనరులని కూడా గరిష్టంగా దోచేసిన కూడా పెట్టుబడిదారుడు తృప్తి చెందక లాభాల వేట కొనసాగిస్తాడని కూడా మార్క్స్ తెలియజేసాడు.

"పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం వలన పర్యావరణానికి జరుగుతున్న హాని, వాతావరణ మార్పుల వలన కలిగే దుష్ప్రభావాలు అనేకం నేడు ప్రపంచమంతా అనుభవిస్తోంది. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం వలన భూగోళం రోజురోజు కి వేడెక్కుతోందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతూ హెచ్చరిస్తున్నా, పెట్టుబడిదారులు ఖాతరు చేయడం లేదు."



పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టిస్తున్న పర్యావరణ కాలుష్యం నేడు మానవాళి మనుగడకే ముప్పుగా మారింది

కారల్‌మార్క్స్ జీవించి ఉన్న రోజుల్లో పెట్టుబడి దారి విధానం వలన, పారిశ్రామికీకరణ వలన జరిగే పర్యావరణ, వాతావరణ కాలుష్యం కొన్ని దేశాలకో, ప్రాంతాలకో పరిమితమై ఉండేది. కానీ నేడది విశ్వవ్యాపితమైంది. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం వలన పర్యావరణానికి జరుగుతున్న హాని, వాతావరణ మార్పుల వలన కలిగే దుష్ప్రభావాలు అనేకం నేడు ప్రపంచమంతా అనుభవిస్తోంది. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం వలన భూగోళం రోజురోజు కి వేడెక్కుతోందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతూ హెచ్చరిస్తున్నా, పెట్టుబడిదారులు ఖాతరు చేయడం లేదు. ప్రకృతి లోని సహజ వనరులైన సౌరశక్తిని, వాయుశక్తిని, సముద్రపు అలల ద్వారా వచ్చే శక్తిని సమర్థంగా ఉపయోగించుకోవాలని చెప్తున్నా, ఆ వనరులను కూడా పెట్టుబడి మింగేయదన్న గ్యారెంటీ ఏమీ లేదు. అటువంటి సహజ వనరులను ప్రపంచ మానవాళి సౌఖ్యం కోసం ప్రజాస్వామ్య యుతంగా వినియోగించగలిగే ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ కోసం మేధో సంపన్నులు ఆలోచన చేయాలి. ఒకవైపు మార్క్స్ ప్రతిపాదించిన అటువంటి నూతన సమాజం కోసం ప్రపంచ వ్యాప్తంగా కృషి జరుగుతూంటే మరో ప్రక్క నిర్ధిష్ట కాలపరిమితిలో భూ ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను రెండు డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పరిమితం చేయడానికి ఉద్దేశించిన "పారిస్ ఒప్పందం" నుండి అమెరికా వైదొలగడం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదానికి పరాకాష్ట కాదా! ❋

# ఒక్కరున్నా చాలు....

(10వ పేజీ తరువాయి)

నిర్వహించిన పద్ధతిలోనే ఆగ్జిలరీ శాఖను నిర్వహించవచ్చు. పార్టీ తరపున నిర్ణయాలు చేసే అవకాశం తప్ప మిగతావన్నీ ఆగ్జిలరీ శాఖ కూడా చేయగలుగుతుంది. కనీసం ఆరు మాసాలు ఆగ్జిలరీ శాఖను రెగ్యులర్‌గా నడిపితే పార్టీలో చేరడానికి సిద్ధపడినవారిని చేర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా పార్టీ శాఖను ఏర్పాటు చేయవచ్చు. ఒకేఒక్క కార్యకర్త ఉన్నప్పటికీ ఇవన్నీ చేయవచ్చు. ఇప్పుడింకా ఏమాత్రం ఒక్కరుగా మిగలరు. తన చుట్టూ తోడుగా ఆగ్జిలరీ శాఖ సభ్యులుంటారు. ఆరు మాసాలు దాటితే తనకు తోడు పార్టీ శాఖ ఉంటుంది. మరో ఆరు మాసాలు దాటితే తనకు తోడు కొన్ని శాఖలు ఏర్పడతాయి. ఒక కమిటీ కూడా ఏర్పరచుకునే అవకాశం కూడా ఉంటుంది. అంటే నిర్ధిష్ట కాల పరిమితిలో కార్యకర్త ఒక్కరే అన్న మాటకు అర్థం లేకుండా పోతుంది. బృందం ఏర్పడుతుంది. ప్రారంభ దశలో చేసిన పనికి అనేక రెట్లు ఎక్కువ కృషి చేయడానికి ఆరు మాసాలు తిరిగే లోపు అవకాశం ఏర్పడుతుంది. కనీసం ఒక సంవత్స రంలో బృందం ఏర్పడుతుంది. ఏర్పడాలి. ఇంకా ఏర్పడకపోతే ఆ కార్యకర్త పనిలో ఏదో లోపం ఉన్నదని గ్రహించాలి. పనిని సమీక్షించి లోపాన్ని గుర్తించాలి. సరిదిద్దుకోవాలి. తద్వారా రెండవ సంవత్సరంలోనైనా ఫలితం సాధించ గలిగే అవకాశం ఏర్పడుతుంది. మొదటి సంవత్సరంలోనే తరచూ తన పనిని సమీక్షించు కోగలిగితే సంవత్సరాంతంలో ఫలితం గ్యారెంటీ ఉంటుంది. అందుకే ఒక్కరే ఉన్నారన్న ఆందోళ న అవసరం లేదు. ఒక్కరే ప్రారంభించాలన్న అవసరాన్ని గుర్తించాలి. అది పార్టీ విస్తరణకు తోడ్పడుతుంది.

# పెట్టుబడిదారి విధానం నిరుద్యోగం

ఎ కోటిరెడ్డి



రచయిత ప్రజాశక్తి సహాయ సంపాదకులు

పెట్టుబడిదారీ విధానం నిరుద్యోగం సయామీస్ కవలల లాంటివి. అవి విడదీయరాని విధంగా కలిసిపోయి ఉంటాయి. వాటిని విడదీయటంగాని, పెట్టుబడిదారీ విధానం కొనసాగుతుండగా నిరుద్యోగాన్ని రూపుమాపటంగాని సాధ్యం కాదు. కాని పాలక వర్గాలు తమకు అధికారం ఇస్తే అందరికీ ఉద్యోగాస్తామని ప్రచారం చేసుకుంటారు. అధికారంలో ఉన్నపార్టి నిరుద్యోగాన్ని తగ్గిస్తున్నట్లు, అత్యధిక శాతం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించినట్లు ప్రచారం చేసుకుంటుంటే ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్నదని, తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని, ఉద్యోగార్థులైన యువతీయువకులందరికీ ఉద్యోగాలిస్తామని ప్రచారం చేస్తుంటారు. 2014ఎన్నికలలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ఈ విధంగానే ప్రచారం చేశాయి. తాము అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండుకోట్ల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. బాబువస్తే జాబు వస్తుందని, రాష్ట్రాన్ని పారిశ్రామిక కేంద్రంగా మారుస్తామని, యువకులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని టిడిపి చెప్పింది. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల కాలం దాటిపోయింది. నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించినట్లు, ఇంకా కల్పించబోతున్నట్లూ రెండు ప్రభుత్వాలూ ప్రచారం చేసుకుంటున్నాయి. కాని అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఉద్యోగ కల్పనపై చేస్తున్న విశ్లేషణలు చూస్తే వీరుచెబుతున్నది ఎంత అసత్యమో స్పష్టం అవుతుంది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ కల్పన తగ్గిందని, నోట్లరద్దు, జియస్‌టి, బ్యాంకుల ఏకీకరణ తదితర సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు జరిపే క్రమంలో నూతన ఉద్యోగాల కల్పన నామమాత్రంగానే జరిగిందని, ఉన్న ఉద్యోగాలే తగ్గిపోవటంతో ఉద్యోగులు, కార్మికులు నిరుద్యోగులుగా మారుతున్నారని ఈ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విధంగా జరగటం పెట్టుబడిదారీ విధాన సహజ లక్షణం. అధికారంలో ఉన్న పార్టీలు ఎన్ని కుప్పిగంతులు వేసినా దీనిని మార్చటం సాధ్యం కాదు. అందు వలననే నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించే ప్రయత్నాలను పక్కన పెట్టి, వారిని మభ్యపెట్టటానికి, భ్రమల్లో ముంచటానికి ఆ పార్టీలు పూనుకుంటున్నాయి. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' 'స్టార్టప్ ఇండియా' 'స్టాండప్ ఇండియా' తదితర నినాదాలతో దేశాన్ని భారీస్థాయిలో పారిశ్రామికీకరణ చేయబోతున్నట్లు, తత్ఫలితంగా కోట్లాది మందికి ఉద్యోగాలు రానున్నట్లు ప్రచారం చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి ఒకసారి పారి శ్రామికవేత్తల సమావేశం జరపటం, ముఖ్య మంత్రి, మంత్రుల బృందాలు నెలకొక సారి విదేశీ పర్యటనలు చేస్తూ, విదేశీ కంపెనీలు రాష్ట్రంలోకి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల వరద ప్రవహింపచేయబోతున్నట్లు భ్రమలు కల్పిస్తున్నది. కాని వాస్తవం అందుకు విరుద్ధంగా ఉన్నది.

ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈ భ్రమలు కరిగిపోయేకొద్దీ నిరుద్యోగులుగా ఉన్న యువత, విద్యార్థులలో అసంతృప్తి పెరుగుతున్నది. ఈ అసంతృప్తిని దారి తప్పించటానికి, ఉద్యోగులు, నిరుద్యోగుల మధ్య తగాదాలు పెట్టటానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. అందులో భాగంగా ఉద్యోగుల సర్వీస్ కాలం పూర్తి కాకుండానే వారిని రిటైర్ చేయాలని ప్రభుత్వాలు పథకాన్ని రూపొందిస్తున్నాయి. అందుకోసం 50 సంవత్సరాల వయసు, లేదా 30 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వారిని ఉద్యోగాల నుండి తొలగించాలని ప్రభుత్వాలు పథకాలు రూపొందించి, ప్రచారంలో పెడుతున్నాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకోసం చట్టాలు రూపొందించనున్నట్లు వెల్లడౌతున్నది. 50 సంవత్సరాలు దాటిన వారి శక్తి సామర్థ్యాలను అంచనా వేయటం, ఆ అంచనాల ప్రాతిపదికగా పని చేయటానికి శక్తి లేనివారిని రిటైర్ చేయటం తదితరాలను ముందుకు తెస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలతో ఒక సర్క్యులర్‌ను రూపొందించినట్లు ప్రచారంలోకి రావటం, ఉద్యోగుల నుండి తీవ్ర నిరసన వ్యక్తం కావటంతో అటువంటిదేమీ లేదని, తాను సంతకం చేయనిదే ఆదేశాలెలా జారీ అవుతాయని ముఖ్యమంత్రి బుకాయించటం జరిగింది. కేంద్రం ఐఎయస్, ఐపియస్‌ల పని విధానాన్ని మధింపు చేస్తామని, సరిగా పనిచేయని వారిపట్ల చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. పనిని మధింపు చేయటం ప్రారంభం అయితే అది ఐఎయస్, ఐపియస్‌లతోనే ఆగదు. అన్ని స్థాయిలకు విస్తరిస్తుంది. ఈ క్రమంలో తమ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించని వారిని, రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్న వారిని, వారిపని సరిగా లేదనే సాకుతో తొలగించటానికి ప్రభు త్వాలు పూనుకుంటాయి. ఈ విధంగా వివిధ రకాలైన కొలబద్దలను ప్రవేశపెట్టి ఉద్యోగాలలో ఉన్నవారిని తొలగించటం, ఆ తర్వాత కొంద రికి కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగాలిచ్చి, పెద్దమొత్తంలో ఉద్యోగాలు కల్పించామని ప్రచారం చేసుకోవటం ప్రభుత్వాల ఎత్తుగడగా కన్పిస్తున్నది.

## పెరుగుతున్న నిరుద్యోగం

పెట్టుబడిదారీ విధానంలో నిరుద్యోగ్యాన్ని నిర్మూలించటం అసాధ్యం. పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి సాధనాలు నిరంతరం అభివృద్ధి అవుతుంటాయి. పెట్టుబడిదారులు తమవద్ద పోగుపడిన అదనపు విలువలో కొంత భాగాన్ని యంత్రాలను ఆధునీకరించటానికి, ఉత్పత్తిని విస్తృతం చేయటానికి వినియోగిస్తారు. ఇందులో భాగంగా ఉన్న యంత్రాలను ఆధునీకరించటం, కొత్త యంత్రాలను ప్రవేశపెట్టటం

చేస్తారు. అంతకు ముందున్న యంత్రాలకు అదనంగా రూపొందించే ప్రతి ఆధునిక యంత్రమూ తప్పనిసరిగా శ్రమ ఉత్పాదకతను పెంచుతుంది. శ్రమ ఉత్పాదకత పెరిగే కొద్ది సరుకుల ఉత్పత్తి పెరిగి, కార్మికుల అవసరం తగ్గుతుంది. ఆధునిక యంత్రాలు ఉత్పత్తిరంగం లోకి వచ్చేకొద్ది ఒక నిర్దిష్ట మొత్తం సరుకులను ఉత్పత్తి చేయటానికి అంతకు ముందు వినియోగించిన మానవశ్రమలో కొంతభాగం తోనే ఇపుడు అంతకన్నా ఎక్కువ సరుకులను ఉత్పత్తి చేయగలుగుతారు. ఫలితంగా ఉత్పత్తి పెరుగుతుంటే కార్మికుల అవసరం తగ్గు తుంటుంది. పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడి దారులు నిరంతరం యంత్రాలను ఆధునీక రించటం, నూతన ఉత్పత్తి పద్ధతులను ప్రవేశ పెట్టటం చేస్తారు. ఫలితంగా ఉత్పాదకత నిరంతరం పెరగటం, కార్మికుల సంఖ్య తగ్గటం జరుగుతుంటుంది. ఈ క్రమంలో ఉత్పత్తి పెర గటంతో పాటు నిరుద్యోగం కూడా పెరుగు తుంటుంది.

**“పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందేకొద్దీ భారీ పారిశ్రామిక సంస్థలు అవిర్భ వించటం, అవి క్రమంగా కార్పొరేట్, బహుళ జాతి సంస్థలుగా రూపుదాల్చటం జరుగు తుంటుంది. ఈ సంస్థలు భారీస్థాయిలో ఉత్పత్తి చేయటంతో ఉత్పత్తి ఖర్చులు తగ్గుతుంటాయి. ఉత్పత్తి విస్తరించేకొద్దీ శ్రమ ఉత్పాదకత మరింతగా పెరుగుతుంది.”**


కార్పొరేట్ రంగానికి ప్రభుత్వాలు పెద్ద పీట వేయడంతో అత్యధిక ప్రజానీకానికి ఉపాధి కల్పించే చిన్నతరహా పరిశ్రమలు కనుమరుగవుతున్నాయి

**చేతివృత్తులు, చిన్న పరిశ్రమల విధ్వంసం**

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందేకొద్దీ భారీ పారిశ్రామిక సంస్థలు అవిర్భ వించటం, అవి క్రమంగా కార్పొరేట్, బహుళ జాతి సంస్థలుగా రూపుదాల్చటం జరుగు తుంటుంది. ఈ సంస్థలు భారీస్థాయిలో ఉత్పత్తి చేయటంతో ఉత్పత్తి ఖర్చులు తగ్గుతుంటాయి. ఉత్పత్తి విస్తరించేకొద్దీ శ్రమ ఉత్పాదకత మరింతగా పెరుగుతుంది. ప్రస్తుతం మనదేశం లో గృహ పరిశ్రమల నుండి చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమల వరకు వివిధస్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నది. వివిధ రకాల సరుకుల ఉత్పత్తి, సేవలను అందించటం ద్వారా లక్షలాది మంది స్వయం ఉపాధిని పొందుతున్నారు. కొన్ని రకాల సరుకులు కార్పొరేట్ సంస్థల నుండి చిన్న పరిశ్రమల వరకు ఉత్పత్తి చేస్తున్నాయి.. పరిశ్రమ స్థాయి పెరిగిన కొద్దీ సరుకులు మరింత చౌకగా తయారవుతాయి. కాబట్టి బహుళజాతి, కార్పొ రేట్ సంస్థలు ఉత్పత్తి చేసే సరుకులు చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో ఉత్పత్తి చేసిన సరుకుల కన్నా తక్కువ ధరలకు ఉత్పత్తి అవుతాయి. ఆ సరుకులతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో తయారైన సరుకులు మార్కెట్లో పోటీ పడలేవు. అందువలన చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొన్ని రక్షణలు కల్పించటం, రాయి తీలివ్వటం చేయాలి. అపుడు మాత్రమే అవి మనుగడ సాగించగలవు. ఆ విధంగా రాయితీలి వ్వకపోతే పెద్ద పరిశ్రమలతో ఎదురౌతున్న పోటీలో చిన్న పరిశ్రమలు దివాళా తీస్తాయి. సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత చిన్న పరిశ్రమలకు ఉండే రక్షణలను రద్దు చేస్తున్నారు. పెద్ద పరిశ్రమల నుండి పోటీలేనివి, పోటీ ఉన్నప్పటికీ కొన్ని సానుకూలతలున్న కొద్దిభాగం చిన్న పరిశ్రమలు మాత్రమే బతికి బట్టకట్టటానికి అవకాశం ఉంటుంది. అందు వలన పోటీలో నిరంతరం దివాళా తీస్తున్న చిన్న, మధ్యతరహా పరిశ్రమలలోని కార్మికులు, చిన్న పరిశ్రమల యజమానులు కూడా నిరుద్యోగుల జాబితాలో చేరి, వారుకూడా ఉ ద్యోగాల అన్వే షణలో ఉన్న నిరుద్యోగులకు తోడవుతారు. ఆ విధంగా ఒకవైపు పారిశ్రామికో త్పత్తి పెరుగుతుం టే మరోవైపు నిరుద్యోగం పెరుగుతుంటుంది.

‘మేకిన్ ఇండియా’, ‘స్టార్టప్ ఇండియా’, ‘స్టాండప్’ ఇండియా తదితర నినాదాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించటానికి దోహదం చేయవు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేవు. నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతుంటుంది. యువతలో అసంతృప్తి పెరగటం తమ పాలనకు ఎదురౌతున్న ప్రమాదంగా పాలకవర్గాలు పరిగణిస్తాయి. ఈ ప్రమాదం నుండి నుండి బయట పడటానికి పాలకవర్గాల ముందు రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పిం చటం. రెండవది.నిరుద్యోగులు తమ వాస్తవ సమస్యలను అర్థం చేసుకొని, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటంలోకి రాకుండా చేయటం. మొదటి దానిని అమలు జరపటం బూర్జువా, భూస్వామ్యవర్గ పార్టీలకు సాధ్యం కాదు. అందువలన వారిని దారి తప్పించి, తమ వర్గపాలనకు ఎదురౌతున్న ప్రమాదాన్ని తప్పించుకోవటం కోసం యువతను నైతికంగా పతనం చేయటానికి, వేర్పాటువాద, విచ్ఛిన్నకర ఆందోళనలలో వారిని సమిధలుగా మార్చే

> **"ముఖ్యంగా వ్యవసాయ రంగం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొం టున్నది. వ్యవసాయోత్పత్తులకు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి ధరలను నిర్ణయిస్తా మని ఎన్నికలకు ముందు బిజెపి చేసిన వాగ్దా నాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కన పెట్టింది."**

విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. యువకులలో ఐక్యతపెరగకుండా అస్థిత్వవాద ఉద్యమాలను ముందుకు తెస్తున్నాయి. తమ అధికారం పదిలంగా ఉండటం కోసం బూర్జు వా, భూస్వామ్యవర్గ పార్టీలు యువతను ఏ విధంగా పతనం చేస్తాయో రాష్ట్రంలోని పరి ణామాలను చూస్తే స్పష్టం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని విస్తృతంగా సరఫరా చేస్తున్నది. రాష్ట్రంలో మంచినీరు దొరకని గ్రామా లు, పట్టణాలు ఉన్నాయి. కానిమద్యం దొరకని ప్రాంతం లేదు. ప్రజలు మంచినీరు కావాలని ఎంతగా అరిచి గీపెడుతున్నా ప్రభు త్వం మాటల తో కాలక్షేపం చేస్తున్నది మినహా మంచినీటిని సక్రమంగా సరఫరా చేయలేక పోతున్నది. మరోవైపున విస్తారంగా బ్రాంది షాపులు, బార్ లు, మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతు లిస్తున్నది. వీధివీధినా బెల్టుషాపులు ఏర్పాటు చేసి, మద్యాన్ని ప్రతిఇంటికీ అందు బాటులో ఉంచుతున్నారు. యువతను మద్యం మత్తులో ముంచుతున్నది. మరోవైపు కుల, మత, ప్రాంతీ య, లింగ, జాతి, భాషా తదితర వైషమ్యాలను పెంచి పోషిస్తున్నది. ఫలితంగా ఉద్యోగాల సాధన, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటంలో అగ్రభాగంలో ఉండవలసిన యువత కుల, మత, భాషా, ప్రాంతీయ వైష మ్యాలతో ముక్కలై పోతున్నది. వివిధ రకాలైన అరాచకుల చేతుల్లో పనిముట్టు గా మారు తున్నది. పాలకవర్గాలు చైతన్య పూర్వకంగానే యువతను దారితప్పించి, తమ విధానాలకు ప్రతిఘటన లేకుండా చూసుకుంటున్నారు.

### దివాళాతీస్తున్న రైతాంగం

గత రెండున్నర దశాబ్దాల కాలం నుండి ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తున్నాయి. దీనిలో భాగంగా అనేక రంగాలలో స్వేచ్ఛావాణిజ్యానికి అవకాశం కల్పిస్తున్నాయి. అనేక రంగాలలో దిగుమతి సుంకాలను అతి తక్కువ స్థాయికి తగ్గించాయి. ఫలితంగా విదేశీ ఉత్పత్తులు మన మార్కెట్‌ను ముంచివేస్తున్నాయి. ఈ విధంగా స్వేచ్ఛగా దిగుమతులు జరగటంతో దేశంలోని అనేక పరిశ్రమలు, వృత్తుల ద్వారా తయారయే సరు కులు వాటితో పోటి పడలేకపోతున్నాయి. అందువలన దిగుమతులు పెరిగేకొద్ది చిన్న పరిశ్రమలు, వృత్తులు, పోటీకి తట్టుకోలేని పరిశ్రమలు దివాళా తీస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొం టున్నది. వ్యవసాయోత్పత్తులకు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి ధరలను నిర్ణయిస్తా మని ఎన్నికలకు ముందు బిజెపి చేసిన వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కన పెట్టింది. గతం నుండి ఉన్న కనీస మద్దత్తు ధరల నిర్ణయ విధానం, మార్కెట్లో ధరలు తక్కు వగా ఉన్నపుడు ప్రభుత్వం మార్కెట్లో జోక్యం చేసుకుని రైతాంగ ఉత్పత్తులను కొనుగోలు చేసే విధానాన్ని పక్కన పెట్టింది. ఫలితంగా రైతాంగం పంటలకు గిట్టుబాటు ధరలు లభించక దివాళా తీస్తున్నారు. అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుం టున్నారు. గత రెండు దశాబ్దాలలో మూడు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, కోటిమందికి పైగా రైతులు తమ భూములను కోల్పోయి, వ్యవసాయ కార్మికులుగా మారుతున్నారు.

పారిశ్రామికాభివృద్ధి పేరుతో ప్రభుత్వం రైతుల భూములను బలవంతంగా లాక్కోవటం కూడా నిరుద్యోగం పెరగటానికి కారణ మౌతున్నది. దేశాన్ని, రాష్ట్రాన్ని పెద్ద ఎత్తున పారిశ్రామికీకరణ చేస్తున్నామనే పేరుతోకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూములు తీసుకుంటు న్నాయి. ప్రభుత్వాలు చేస్తున్నది పారిశ్రామికీకరణ కాదు. ఆ పేరుతో ఆశ్రిత పెట్టుబడిదారులకు భూములను, సంపదలను కట్టబెడుతున్నాయి. భూములు తీసుకుంటున్న రైతుల ఉపాధిని గురించి, వారికి తగిన పునరావాసం కల్పిం చటం, పరిహారం అందించటం గురించి ప్రభు త్వాలు ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవటం లేదు. భూములు తీసుకున్న ప్రాంతంలో ఉన్న వ్యవ సాయ కార్మికులు, కౌలురైతులు, చేతివృత్తి దారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు తదితరులను గురించి ప్రభుత్వాలు పట్టించు కోవటం లేదు. పరిశ్రమలు వచ్చి ఉపాధి కల్పిస్తాయని ప్రభుత్వం చెబుతున్న మాటలు ఆచరణలోకి రావటం లేదు. పరిశ్రమలు వచ్చిన చోటకూడా అవి కల్పించే ఉపాధి నామ మాత్రంగానే ఉంటున్నది. ఇందుకు రాజధాని ప్రాంతమే ఉదాహరణ. అక్కడ తాత్కాలిక సచి వాలయం నిర్మాణ సందర్భంలో కూడా స్థానికులు పదిమందికి కూడా ప్రభుత్వం పనులు కల్పించ లేదు. అందువలన భూములు సేకరిస్తున్న ప్రాంతాలు నిరుద్యోగం, ఉపాధి లేమికి కేంద్రాలు గా మారుతున్నాయి.

### పని గంటల పెంపు

పనిగంటల పెంపు నిరుద్యోగం పెరగటం లో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఉద్యోగులు, కార్మికులు చట్టరీత్యా ఎనిమిది గంటలు పని చేయాలి. కాని ప్రైవేటు యాజమాన్యాలు చట్టాన్ని ధిక్కరించి, కార్మికులు, ఉద్యోగుల చేత పది నుండి పన్నెండు గంటల వరకు పనిచేయిస్తు న్నాయి. ఆ విధంగా ఉద్యోగులు, కార్మికుల చేత ఎక్కువ కాలం పనిచేయిస్తున్న యాజమాన్యాలు వాస్తవంలో నిరుద్యోగం పెరగటానికి దోహదం చేస్తున్నారు. ఉ దాహరణకు 100 మంది కార్మికులు ఎనిమిది గంటల చొప్పున పనిచేస్తున్న పరిశ్రమలో, కార్మికులు చేసే పని గంటలను 10కి పెంచితే 25 మంది కార్మికుల శ్రమ యజమానులకు కలిసివస్తుంది. ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులలో నాలుగో వంతు, అంటే 25 మంది నిరుద్యోగులుగా మిగులుతారు. 12 గంటలకు పెంచితే సగం మంది కార్మికులు పనులు కోల్పోతారు. ప్రస్తుతం ప్రైవేటు యాజ మాన్యాలు 10 గంటలే పనిచేయిస్తున్నారని భావించినా, మొత్తం పనిచేస్తున్న కార్మికులలో నాలుగో వంతుమంది నిరుద్యోగులుగా మిగిలి పోతున్నారు. అందువలన ప్రభుత్వం, ప్రైవేటు రంగాల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని ఖచ్చితంగా అమలు చేస్తే నిరుద్యోగులలో గణనీయమైన భాగానికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వటం సాధ్యం అవుతుంది.

### వేతనాలు పెరిగితే నిరుద్యోగం తగ్గుతుంది

సరళీకరణ విధానాలలో భాగంగా ప్రభు త్వాలు కార్మికచట్టాలను నీరుగార్చటం, యజమా నులకు అనుకూలంగా చట్టాలను

మార్చటం చేస్తున్నాయి. ప్రపంచీకరణ ఫలితంగా పరిశ్రమ లను ఎక్కడికైనా తరలించటానికి అవకాశాలు పెరిగాయి. అస్థిత్వవాద ఉద్యమాలు పెరగటం కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసింది. ఫలితం గా కార్మికుల పోరాటశక్తి సన్నగిల్లింది. అందు వలన కార్మికులు పొందుతున్న వేతనాలు క్రమంగా తగ్గుతున్నాయి. సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత అదనంగా ఉత్పత్తి అయిన విలువలో కార్మికులు పొందుతున్న వేతనాలు అంతకుముందు పొందుతున్న మొత్తం లో సగానికి పైగా తగ్గింది. అంటే ఒకవైపున ఉత్పత్తి పెరుగుతూ ఉంటే మరోవైపు కార్మికుల వేతనాలు పడిపోతున్నాయి. ఫలితంగా వారి కొనుగోలు శక్తి తగ్గుతున్నది. కార్మికులు సరుకులను కొనలేకపోతే వాటిని ఎక్కడ అమ్మాలి? ఎగుమతులు చేయటం ద్వారా అమ్ముకోమని సరళీకరణవాదులు ప్రచారం చేస్తున్నారు. ఇదే ప్రచారం ప్రపంచం అంతటా చేస్తున్నారు. కార్మి కుల వేతనాలు తగ్గించటం కూడా ప్రపంచం అంతటా జరుగుతున్నది. అందువలన ఎగుమతు లకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. మనదేశ ఎగుమతులలో ఒడిదుడుకులు కూడా ఇదే విష యాన్ని స్పష్టం చేస్తున్నాయి. అందువలన కార్మికుల వేతనాలు పెరగటం తయారైన సరు కులు అమ్ముడుపోవటానికి, నిరుద్యోగాన్ని తగ్గించటానికి దోహదం చేస్తాయి.

> **"అస్థిత్వవాద ఉద్యమాలు పెరగటం కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసింది. ఫలితం గా కార్మికుల పోరాటశక్తి సన్నగిల్లింది. అందు వలన కార్మికులు పొందుతున్న వేతనాలు క్రమంగా తగ్గుతున్నాయి. సరళీకరణ విధానాలు ప్రారంభ మైన తర్వాత అదనంగా ఉత్పత్తి అయిన విలువలో కార్మికు లు పొందుతున్న వేతనాలు అంతకుముందు పొందుతున్న మొత్తం లో సగానికి పైగా తగ్గింది."**



ఉపాధి తరిగి మద్య సేవనం పెరగడంతో యువతలో నేర ప్రవృత్తి పెరిగింది

కాబట్టి నిరుద్యోగాన్ని తగ్గించటం, నిరుద్యో గులకు ఉద్యోగాలివ్వటం అనేది ప్రభుత్వం అను సరించే విధానాలపై ఆధారపడి ఉంటుంది. కార్మికుల వేతనాలు పెంచటం, పనిగంటలను తగ్గించటం, రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు తదితరుల ఆదాయాలను పెంచటం, దిగుమతుల నుండి మన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను రక్షించటానికి ప్రభుత్వం పూనుకుంటే నిరుద్యోగులకు కొంతమేరకు ఉ ద్యోగాలు ఇవ్వవచ్చు. కాని సరళీకరణ విధా నాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలు వీటిలో ఏ ఒక్క చర్యను తీసుకోవటానికి పూనుకోవు. అందు వలన కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వృత్తిదా రులు, ఇతర పేదలు తమ జీవన పరిస్థితులను మెరుగు చేసుకోవటం కోసం చేసే పోరాటాల విజయమే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించ టానికి దారితీస్తుంది. కాబట్టి నిరుద్యోగులు ఉ ద్యోగాల కోసం ఐక్యంగా పోరాడుతూనే వివిధ వర్గాల కష్టజీవులు చేసే పోరాటాలకు మద్దత్తు ఇవ్వాలి.

# ప్రయివేటు గుప్పిట్లోకి మన రక్షణ రంగం

(27వ పేజీ తరువాయి)

ప్రధాన లబ్దిదారుగా ఉన్నది. రఫాయేల్ సంస్థతో కలిసి అమెరికాకు చెందిన సప్తమ నౌకాదళం మన యుద్ధ విమానాలను రిపేరు చేసే ఒప్పం దాలను చేసుకున్నది. ఈ సప్తమ నౌకాదళం 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో మనదేశాన్ని బెదిరించింది. ఇటువంటి చరిత్ర ఉన్న సంస్థతో 2016 ఆగస్టులో మోడీ ప్రభుత్వం "మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్"ను ఎలా చేసుకున్నది? భారత ప్రభుత్వం, లాభదాయకమైన ఒప్పందాలను ఫ్రెంచ్ సంస్థలకు ఏ ప్రయోజనాల కోసం అందిస్తున్నది? అది కూడా అమెరికా నావికా దళానికి, రక్షణ విధానానికి అనుకూ లంగా ఉన్న సంస్థలతో ఏ విధంగా ఒప్పందం చేసుకుంటున్నది?

రక్షణ మంత్రిత్వశాఖ, డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ యూనిట్ల పాత్ర విషయంలోనూ, మిలటరీ అవసరాల కనుగుణంగా ఉత్పత్తులు చేయడంలోనూ, నత్తనడక నడుస్తున్నది. పబ్లిక్ సెక్టార్‌ని వృద్ధి చేయమని, ప్రైవేటు సంస్థలను ద్వితీయ స్థానంలో ఉంచమని సూచిస్తూ "విజయ్ కేల్కర్" కమిటీ 2005వ సంవత్సరంలో ఇచ్చిన నివేదికను, ముఖ్యగా రక్షణ వ్యవస్థకు సంబంధిం చి దేశీయ ఉత్పత్తులను ఉపయోగించ్మన్న సూచనలను బుట్ట దాఖలా చేసింది. తద్భిన్నంగా ప్రైవేటు రంగానికి పెద్ద పీటవేసి అగ్రస్థానాన కూర్చోబెట్టి పబ్లిక్ సెక్టార్‌ని ద్వితీయ స్థానానికి తోసేసింది.

**అనువాదం : డాక్టర్ శమంతకమణి**

# సంఘ్ పరివార్ కట్టుకథ సరస్వతి నాగరికత



రచయిత హిందూ పత్రిక ఢిల్లీ ఎడిషన్ చీఫ్

జియా ఉస్ సలాం

**సింధులోయ నాగరికతకు సరస్వతి సింధూ నాగరికతగా పేరు పెట్టడంలో హర్యానా ప్రభుత్వ ప్రతిపాదనలను, మితవాద ఎజెండాను మేధావులు, చరిత్రకారులు గమనించాలి.**

కొత్త సీసాలో పాత సారా సరఫరా చేసినట్లు హర్యానా చరిత్ర పురావస్తు శాస్త్రాల వాకిలిలో ఉన్నది. సింధులోయ నాగరికతకు సరస్వతి సింధూ నాగరికతగా తిరిగి పేరు పెట్టాలనే తాజా ప్రతిపాదన రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం చేసింది. ఈ సంవత్సరం ప్రారంభంలో హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ కట్టర్ ఆధ్వర్యంలో నడుస్తున్న సరస్వతి సంస్కృతి అభివృద్ధి బోర్డు సింధులోయ నాగరికతను సరస్వతి సింధు నాగరికతగా పున: నామకరణ చేయడానికి తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని ప్రకటించింది. ఆ ప్రతిపాదనలు ఇలా చెప్పాయి. సింధులోయ నాగరికతగా చెప్పబడుతున్న ప్రదేశాలు పాకిస్తాన్‌లో వందకంటే తక్కువ మాత్రమే ఉన్నాయి. అదే సమయంలో హర్యానాలో వెయ్యి వరకు ప్రదేశాలు ఉన్నాయి. అతిపెద్దమైన హరప్పా ప్రదేశం రాఖీగర్హీ, అతి ప్రాచీనమైన బిర్రన రెండూ హర్యానాలోనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఫతేబాద్ జిల్లాలో తవ్వకాలు తిరిగి ప్రారంభించింది.

చరిత్రకారులు, పురావస్తు శాస్త్రజ్ఞులను ఒకేరకంగా ప్రభావితం చేయడంలో ఇది విఫలమైంది. ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్ హాబీబ్ సరస్వతి నాగరికత గురించి విపులంగా రాశారు. "ఇదొక కల్పిత గాథకు కసరత్తు" అన్నారు. "ఇది రాజకీయాల మీద ఆధారపడిన బిజెపి పాత నినాదమే తప్ప చరిత్ర కాదు" అని హాబీబ్ చెప్పారు. ప్రాచీన భారత చరిత్ర మీద సంచలనాత్మకంగా కృషిచేసి అందరి చేత గౌరవింపబడే ప్రొఫెసర్ డిఎన్ ఝా ఈ ప్రతిపాదనను కొట్టిపారేశారు. "సింధునాగరికతకు తిరిగి పేరు పెట్టాలనే ఆలోచన చాలా పాతది. "సరస్వతి సాంస్కృతిక సంస్థ అనేది ఎన్‌డిఎ పాలనలో స్థాపించబడింది. అయితే అది 2005-2006లో యుపిఎ అధికారంలోకి వచ్చినప్పుడు రద్దు చేయబడింది. మతతత్వ మోడీ పాలనా కాలంలో ఇది పునరుద్ధరించబడడంలో ఆశ్చర్యం ఏమీ లేదు నాజీల పాలనా కాలంలో మొత్తం పురావస్తు శాస్త్రాన్ని దుర్వినియోగం చేయడాన్ని ఇది గుర్తుకుతెస్తుంది."

ప్రముఖ పురావస్తు శాస్త్రజ్ఞుడు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, ఎక్కువ మంది చేత విస్తృతంగా చదవబడిన "హరప్పాను అవగాహన చేసుకోవడం" పుస్తక రచయిత అయిన రత్నాగర్ చరిత్ర, పురావస్తు శాస్త్రాల మధ్య వ్యత్యాసాన్ని స్పష్టంగా చెప్పడం ద్వారా అనుమానాలను తొలగించారు. నాగరికతను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రయత్నం వేయి సంవత్సరాలకు చెందిన వేదకాలపు నాగరికతను తెలుసుకోవడానికి ఉద్దేశించినది. ఇది అవసరమైనది. "పురావస్తు శాస్త్రము అడిగేదానిని చరిత్ర సమర్థించలేదు. ఎందుకంటే అవి వేరైన పద్ధతులు" అని షిరీన్ చెప్పారు. "ఇందులో కొత్తదనమేమీ లేదని స్వర్గీయ ఎస్‌పి గుప్త చాలా సంవత్సరాల క్రితమే చెప్పారు." హర్యానాలో పెద్దసంఖ్యలో ప్రదేశాలు ఉన్నట్లుగా చెబుతున్నారని ఆమె చెప్పారు. "భిన్నమైన సంస్కృతులకు చెందిన ప్రదేశాలను లెక్కించడం ద్వారా పెద్ద సంఖ్యను పొందగలిగారు. తన గ్రంథమైన "హరప్పా అవగాహనా"లో పురాతన నాగరికత గురించి మనకు 150 సంవత్సరాలకు పైగా తెలుసు, వాస్తవానికి సింధులోయా నాగరికతను సరస్వతీ నాగరికతగా పిలవడానికి వీలులేదు అని ఆమె స్పష్టం చేశారు. సరస్వతీ నాగరికతగా నామకరణం చేయాలని అడిగేవాళ్లు ఆవిష్కరణల సంఖ్యతో సంబంధం లేకుండా హరప్పా, మొహంజోదారో ఇప్పటికీ అతిపెద్ద ప్రదేశాలుగానే మిగిలి ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలని ఆమె వాదిస్తారు. వారు సుసంపన్నమైన కళాఖండాలు, అద్భుతమైన నిర్మాణ శాస్త్రాన్ని, వాస్తుశాస్త్రాన్ని కలిగి ఉన్నారు. బహుశా వారు కేంద్రీకృతమైన ఆర్థిక, రాజకీయాలను కలిగి ఉండడాన్ని ఇష్టపడతారు. ప్రముఖ ప్రదేశాల విషయంలో కూడా ఇలాగే ఉన్నారు. అందువల్ల హరప్పా అనేది సంతృప్తికి చిరునామా అని ఆమె వ్రాశారు. "హరప్పా, మొహంజోదారోలో పురాతనమైన మట్టిదిబ్బలను తవ్వినట్లయితే ఆ కాలానికి చెందిన కేవలం ఒక కుండ, రెండు పూసల గొలుసులను కనుగొనవచ్చు. రకరకాలు కలగలిసిన అనేక కుండలు, సామాగ్రి మరియు ఇతర అభరణాలు ఉన్నట్లయితే మనం దానిని హరప్పా అని పిలవలేము. అది హరప్పా సంబంధాలకు ప్రతిగా ఉన్న ప్రదేశం మాత్రమే. సరస్వతీ లోయకు సంబంధించిన ప్రదేశాలు ఎక్కడ ఉన్నాయి? వాటిలో ఎక్కువ భాగం స్థానిక సంస్కృతులకు చెందిన ప్రదేశాలుగా మనం గుర్తించవచ్చు. విలక్షణమైన కుండలు, మట్టి గాజులు, పూలజాడీలు, తిరగళ్లు, రోళ్లు లాంటి వాటితో కొన్ని హరప్పా సంబంధాలను ప్రదర్శిస్తాయి. అలాగే పూర్తి స్థాయి సంపూర్ణమైన హరప్పా ప్రదేశాలను పోలి ఉంటాయి."అని ఆమె రాశారు.


ఏది ఏమైనా ఈ కాలంలో సింధునదికి ఉపనదిగా ఉన్న సరస్వతి పేరు పెట్టాలా? వద్దా? అనే చర్చ ఉధృతంగా జరుగుతున్నది. ఝా ఇలా చెప్పారు: ఇది సరస్వతీ నాగరికత, సింధు నాగరికత కాదు అని తరచుగా వాదిస్తున్నారు. వేద సాహిత్యం నదికి ప్రాధాన్యత ఇచ్చింది, దానిని సరస్వతిగా గుర్తించింది. కొంతమంది పురావస్తు శాస్త్రజ్ఞులు దానిని దాదాపుగా ఎండిపోయిన నదిగా, ప్రస్తుతం భారతదేశంలో ఘగ్గర్‌నదిగా తెలుసుకున్నారు. తరువాత అది దిగువగా ప్రవహించి పాకిస్తాన్‌లో హక్రానదిగా,

అది ఈశాన్యం వైపు కొండల నుంచి ప్రవహించి సింధు ప్రవాహం వైపు నైరుతి దిక్కుగా వెళుతుంది. ఆ కాలానికి చెందిన స్మారక చిహ్నాలుగా అనేకమైన మట్టిదిబ్బలు (ఉదా: కలిబంగన్) సరస్వతీ నది ఒడ్డువెంట ఉంటాయి.  దాని వెంట ఎక్కువ భాగం సింధునది యొక్క ఒండ్రులోయలు ఉంటాయి. అందువల్ల  ఇది సరస్వతి నాగరికతగా పిలవబడాలి. సింధు నాగరికతగా కాదు అని వాదనలు చేస్తున్నారు. ఈ వాదనలో ఇబ్బందులు ఉన్నాయి. మొదటిది, కొన్ని హరప్పా ప్రదేశాలు ఘగ్గర్ హక్రా నదీ తీరం వెంబడి ఉన్నాయి. రెండవది, ఋగ్వేదంలో సరస్వతి నదికి సంబంధించిన ఎటువంటి ఆధారమూ లేదు. వాస్తవానికి ఇది ప్రస్తుతం ఎండిపోయింది.  వేయి ప్రదేశాలకు సంబంధించిన ఆధారాలను చూపాలని ఝా ప్రశ్నించారు. “ ఈ మొత్తం ప్రదేశాలు చెల్లాచెదరుగా ఉన్నాయి, అలాగే ఏ పెద్ద నది వెంటా ఒక వరుస క్రమంలో ఏర్పడలేదు.”

ఏది ఏమైనా ఉపగ్రహాల ఛాయాచిత్రాలు హర్యానా సరస్వతీ వారసత్వపు బోర్డుయొక్క వాదనలను స్పష్టం చేస్తాయి. ప్రముఖ చరిత్రకారుడు సతీష్ చంద్ర ఈ వాదనను కొట్టిపారేశారు. “సరస్వతి నదిని కనుగొనడానికి వారు చాలా కష్టపడుతున్నారు. అది గొప్ప మనోహరమైన నది అని, హరప్పా కాలానికి చెందిన అనేక ప్రదేశాలకు సంబంధించిన ఆధారాలను చూపుతామని వారు వాదిస్తున్నారు. వాస్తవానికి నాగరికత అనేది చిన్ననదుల తీరం వెంట అభివృద్ధి చెందిందనే విషయాన్ని వారు మరచిపోతున్నారు. సాంప్రదా యకంగా ప్రజలు నదులలో నీరు వాడరు, కానీ బావులు, చెరువుల్లో నీరు వాడతారు. ఒక పెద్ద నదిని కలిగి ఉండడం నాగరికతకు గుర్తుగా భావించవచ్చా? అనేది ప్రశ్నగానే ఉన్నది.

ఇర్ఫాన్ హబీబ్ ఉపగ్రహాల ఊహాచిత్రాల “ఆధారాలను” కొట్టిపారేశారు. చిత్రాలలో నీరు కనిపించడం అనే వాదన మొత్తం కల్పితం. హక్కర్, ఇండస్ నదుల మధ్య సంబంధం లేనట్లు ఉపగ్రహ ఊహా చిత్రాలు చూపించాయి. ఆయన కూడా షిరీన్ రత్నాగర్ లాగా చూశారు” ఆ ప్రాంతం భౌగోళికంగా సంక్లిష్టంగా ఉంటుంది. మధ్యయుగాలలో కూడా అనేకమైన నదులు, వ్యవసాయ కాలువలు కలిగి ఉన్న ప్రాంతం. భూగర్భజలం ఒకచోట నుండి మరొక చోటుకి విస్తరించినట్లుగా, పురాతన నీటిప్రవాహం శివాలిక్ ప్రాంతం నుండి కచ్ అగాధంలోకి వెళ్లినట్లుగా ఆధారం లేదు.”

“వాస్తవానికి నాగరికత అనేది చిన్ననదుల తీరం వెంట అభివృద్ధి చెందిందనే విషయాన్ని వారు మరచిపోతున్నారు. సాంప్రదాయకంగా ప్రజలు నదులలో నీరు వాడరు, కానీ బావులు, చెరువుల్లో నీరు వాడతారు. ఒక పెద్ద నదిని కలిగి ఉండడం నాగరికతకు గుర్తుగా భావించవచ్చా? అనేది ప్రశ్నగానే ఉన్నది.”



హరప్పా నగర శిథిలాల ఆధారంగా రూపొందించిన చిత్రం

“ఆర్.ఎన్ సింగ్, పురావస్తు శాస్త్రజ్ఞుల బృందం ఈ ప్రాంతాన్ని అన్వేషించి, 2008లో నివేదిక నిచ్చారు. ఇక్కడ ప్రకృతి దృశ్యం ఇటీవల మానవుల కార్యకలాపాలతో అప్రమత్తం చేయబడింది. ఉపగ్రహ ఊహాచిత్రాలు మాకు ఉపయోగపడలేదు. పురాతన నదులు ఉన్న ప్రాంతం కలిసిపోకుండా చూపడంలోఉపగ్రహం సహాయపడలేదు. మొత్తం మీద హరప్పా ప్రదేశాల కోసం ఇవ్వబడిన ప్రాంతీయ సమా చారం చాలా సందర్భాలలో తప్పుగా ఉన్నది. అలాగే ఘగ్గరీ నది యొక్క ఎండిపోయిన పాయలకు దగ్గరగా లేదు అని ఆమె స్పష్టం చేశారు.

### కట్టు కథనుంచి వాస్తవానికి

వీటన్నింటి మధ్య సరస్వతి నది విషయంలో అనేక విమర్శనాత్మక వాదనలు ఉన్నాయి. వాస్తవానికి దీనికి  చాలా అస్తిత్వం ఉన్నది. బోర్డుప్రకటనలు: “నది  ఇక కల్పితగాథగా ఉండదు. దాని ఉనికి వాస్తవం. సరస్వతి ఒక కట్టుకథ అని ఏ ఒక్కరూ అనలేరు. నది కనిపించింది అని నిరూపించిన దగ్గర నుండి ఎవరూ కాదనలేరు. అలాగే నదికి సంబంధించి పురాణగాధ అనే పదాన్ని ఏ ఒక్కరూ ఉపయోగించలేరు.”ఈనది అంతర్వాహినిగా ఉన్నది, గంగా, యమునా నదులను ప్రయోగ వద్ద కలుస్తుంది అని పురాణం అంటున్నది. ఈనది పశ్చిమ దిక్కుగా రాణా ఆఫ్ కచ్ వైపు ప్రవహించి పాకిస్థాన్‌లోకి వెళుతుందని నమ్ముతున్నది అని బోర్డు చెబుతున్నది.

“పెద్ద నదులైనా మూడింటిలో సరస్వతి కూడా ఒక భాగం అనేది ఒక పురాణకథ”. ఆ నది పశ్చిమం వైపు ప్రవహిస్తుందని ఎవరైతే నమ్ముతారో వారు దానిని పరిశీలించాలి అని హబీబ్ పట్టుపట్టారు. “వారి యొక్క తర్కం ప్రకారం, హర్యానాలో భూగర్భజలాలలో అది పుట్టింది. వారు హర్యానాలో నల్లా నుంచి నీరు తీసుకురాగలిగితే, అప్పుడు సరస్వతి నది యొక్క అసలైన ఆధారం హర్యానాలో ఉందని చెప్పవచ్చు. హిమాచల్‌ప్రదేశ్‌లో కాదు అనవచ్చు.

“సింధులోయ నాగరి కత పేరు మార్చాలనే ఆలోచన చాలా సంవత్స రాల పాతది. అలాగే అది మితవాదుల మత తత్వపు ఎజెండా. ముస్లింలను ‘ఇతరులు’గా, విదేశీ యులుగా ప్రకటించడం, హిందువులు దేశీయ ప్రజలని, వారి పూర్వీకులు ఆర్యులు అని సమర్థించే విధంగా నొక్కి చెబుతున్నారని ఝా అంటున్నారు.”


ప్రయాగవద్ద త్రివేణి సంగమం

సరస్వతి నది కొండల్లో పుట్టడం వలన అక్కడ నుండి ఎక్కువ నీరు తేలేము. శివాలిక్‌లో నది పుట్టినట్లయితే అటు రాణా ఆఫ్ కచ్‌కు గానీ, లేదా కల్పిత సంగమమైన గంగా, యమునాతో ప్రయాగ వద్దగానీ నీరు తేలేము. ప్రస్తుత రోజుల్లో సరస్వతి హిమాలయాల్లో పెరగడం కానీ లేదా సముద్రంలోకి జారి పడటం కానీ లేదు. దానితో సంబంధం ఉన్న ఘగర్ ఇటీవల కాలానికి చెందినది, హక్రాతో దాని కలయిక అందరూ నమ్ముతున్నట్లుగా నిర్దిష్టంగా లేదు.

హబీబ్ తన వాదనకు మరిన్ని వివరాలను ఘగ్గర్ మైదానాలు ఒండ్రుమట్టితో ఏర్పడిన విధానాన్ని పరిశీలించడం ద్వారా బహిర్గతం చేశారు. పెద్దనది హిమాలయాల నుండి క్రిందికి రావడం వలన ఈ ప్రాంతంలో మైదానాలు ఏర్పడినాయి అని అన్నారు. ఋగ్వేదం 10 వ అధ్యాయంలో సరస్వతి పేర్కొనబడినదని ఆయన అంగీకరించారు. అది ఎక్కడైతే ఉందని ప్రకటించారో ఆ ప్రాంతం యమునా, సట్లెజ్‌ల మధ్య ఉన్నది. బహుశా అది ఈ రోజున్న సరస్వతి కావచ్చు. సరస్వతి వినాశన వద్ద అదృశ్యమైందని బ్రహ్మణులు చెప్పారు. ఆ విధంగా అది ఘగ్గర్‌లో కలిసిపోయిందని చెబుతారు.

“ఋగ్వేదంలో చెప్పబడిన సరస్వతి నది ఉనికిలో ఉన్నదని చెప్పబడుతున్నంత పెద్దదేమీ కాదు. లేదా ఏకంగా రాణా ఆఫ్ కచ్‌లోకి ఆసక్తిదాయకమైన సరస్వతిలాగా ప్రవహిస్తుందా అని ఝా మరింత వివరంగా చెప్పారు. మరోవైపు ఏదైతే వినాశనలో ఎండిపోయినదని చెప్పబడుతున్నదో ఆ నదికి సంబంధించిన ఆలోచన, భూగర్భంలో 500 కి.మీలు ప్రవహిస్తుంది అనేది మరీ పాతది కాకపోవచ్చు. అయితే సరస్వతి నదీ క్రిందికి ప్రవహించి రాణా ఆఫ్ కచ్‌లో త్రివేణి సంగమంగా ఏర్పడిందనేది కట్టుకథ. కాబట్టి ఇది హిందూత్వ భావజాలకులు మతతత్వం, పేరెన్నికగన్న మూఢనమ్మకాలతో త్రివేణి సంగమాన్ని ఎంచుకున్నారు.”

విషయం అదైతే, సింధులోయ నాగరికతకు సరస్వతీ నాగరికతగా పేరు మార్చాలనే ఆతృత, అమితాసక్తి వారికి ఎందుకు?

### సాంస్కృతిక ఎజెండా

సింధులోయ నాగరి కత పేరు మార్చాలనే ఆలోచన చాలా సంవత్స రాల పాతది. అలాగే అది మితవాదుల మత తత్వపు ఎజెండా. ముస్లింలను ‘ఇతరులు’గా, విదేశీయులుగా ప్రకటించడం, హిందువులు దేశీయ ప్రజలని, వారి పూర్వీకులు ఆర్యులు అని సమర్థించే విధంగా నొక్కి చెబుతున్నారని ఝా అంటున్నా రు. భారతదేశం యొక్క అసలైన నివాసులం మేమే అని వారు వాదించినప్పటి నుంచి, ఈదేశ మూలపురుషులుగా ప్రాచీనమైన హరప్పా నాగరికతకు చెందినవారుగా ప్రకటించు కుంటు న్నారు. అయితే వాటి కొన్నిముఖ్యమైన ప్రదేశాలు (మొహంజదారో, హరప్పా) ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉన్నాయి, కనుక దాని మూలాలు తప్పనిసరిగా ఇండియాలో కనుక్కోవాలి. అందువల్ల హిందూ త్వ ఔత్సాహికులు హరప్పా నాగరికతకు సరస్వతీ నాగరికతగా పేరు మార్చడంలో ఆశ్చర్యం అవసరం లేదు. అందు వల్ల ముస్లింలను విదేశీయులుగా, హరప్పా నాగరికతను సరస్వతీ నాగరికతగా చిత్రించ డంలో ఉన్న సంబంధాన్ని తక్షణం అర్థం చేసుకోవాలి.

ఝా వాదనకు షిరీన్ రత్నాగర్ మద్దతు లభించింది. సరస్వతి అనేపదం వేద సాహిత్యం, హరప్పా నాగరికత మధ్య అస్థిత్వ సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. వాస్తవానికి ఏదైనా కష్టమైన సంబంధానికి ఇది ఉపకరిస్తుంది. అందువల్ల సరస్వతి ముద్ర మేధోపరమైన వాస్తవంలో నిలవడం చాలా కష్టం. ఆ నదికి సంబంధించిన ప్రశ్న అది సింధునదికి ఉపనది మాత్రమే అనేది మనం ఎప్పుడూ మరవకూడదు”. గంగా, యమునా, నదులతో పోల్చినప్పుడు అంతర్వాహి నిగా ఉన్న ఆ నది అంత ఘనమైనదేమీ కాదు.

అందువల్ల సరస్వతీ నాగరికత అనే పురాణ కథను పూడ్చిపెట్టడం మంచిది అని ఝా నొక్కి చెప్పారు. “ఋగ్వేదంలో సరస్వతి నది గురించి చెప్పడం కట్టుకథ కాదు. కానీ సరస్వతి నాగరికత అనేది కేవలం కల్పితం అని హబీబ్ అన్నారు. కల్పితంతో ఒకరు ఎలా పోరాడతారు?” పురాణ గాథను దూరంగా ఉన్న (చేరుకోలేని) గతంగా వర్ణించారు. మేధావులు (వామపక్ష వాదులను కూడా కలుపుకొని) కూడా ఈ పదాన్ని తప్పుగా ఉపయోగించారు. ప్రజల ఆలోచనల్లో గందర గోళం సృష్టించారు. పురాణగాథ వాస్తవం గా నమ్మబడింది. కానీ దానికి గట్టి ఆధారమేమీ లేదు.

**(అనువాదం: కె. నాగమల్లేశ్వరరావు)**

# ప్రయివేటు గుప్పిట్లోకి మన రక్షణ రంగం

గౌతమ్ నవ్‌లఖ్



రచయిత సామాజిక కార్యకర్త

భారతదేశ రక్షణ వ్యవస్థకు సంబంధించి, కీలక విభాగాలైన డిజైన్, అభివృద్ధి మరియు ఉత్పత్తికి చెందిన కొన్ని ముఖ్యమైన రంగాల ను సమర్ధవంతమైన ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న సత్యం వాస్తవానికి అత్యంత కఠినమైనది.

పద్నాలుగు నెలల సుదీర్ఘ ఆలశ్యం తర్వాత కేంద్ర మంత్రివర్గ కమిటీ రక్షణ వ్యవస్థకు సంబంధించి ఓ ముఖ్యమైన ఫైలుపై తను అంగీకారాన్ని తెలిపింది. అది "భారతీయ రక్షణ వ్యవస్థకు సంబంధించి, మిలటరీకి అవసరమైన రక్షణాయుధాల తయారీకి కొన్ని పాశ్చాత్య కంపెనీలతో వ్యూహాత్మకంగా కలసి పని చేయడం". వాస్తవానికి ఇది కొత్త విషయం కాదు... గతంలో దేశాన్నేలిన "కాంగ్రెస్" హయాంలో "రక్ష ఉద్యోగ రత్న" అన్న పేరుతో 12 ప్రైవేటు కంపెనీలకు, రక్షణవ్యవస్థకు కావాల్సిన కీలక పరికరాలకై ఆమోదం తెలిపింది. ప్రస్తుతమున్న భారతీయ జనతా పార్టీ సైతం, అదే మార్గాన్ని అనుసరిస్తూ, రెండు సంవత్సరాల క్రితమే " స్ట్రాటజిక్ ప్రైవేట్ పార్టనర్స్ (యస్‌పిపి) అంటూ ముందు కొచ్చింది. 2016వ సంవత్సరం మార్చి 28న 'గోవా' లో ప్రకటించిన 'డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ (డిపిపి)లో యస్‌పిపి లోని 7వ అధ్యాయాన్ని మినహాయించి ప్రకటించటం దీనికి కారణం, ప్రభుత్వం ఎంపికచేసిన ప్రైవేటు కార్పొరేట్ సంస్థల మధ్యనున్న వ్యాపారాత్మక వైరుధ్యాలు నరేంద్రమోడి ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వం, ముక్కలు ముక్కలుగా వ్యవస్థను చీలుస్తున్న విధానం కూడా దీనికి మూలమే, గోప్యత అంటూ వ్యవహరిస్తూ కొన్ని కీలకాంశాలను ప్రస్తుటంగా ప్రకటించకపోవడం కూడా మరో కారణం. భాగస్వామ్యం వహిస్తున్న సంస్థల, సంపూర్ణ వివరాలను, గోప్యత పేరుతో ప్రకటించక పోవడం, నిర్ణీత సమయంలో అందించాల్సిన సామాగ్రి అందించడంలో విఫలమైనట్లయితే, ఎటు వంటి జరిమానా సంబంధిత సంస్థలకు వేయడం జరుగుతుందో తెలియకుండా గోప్యంగా ఉంచడం కూడా కారణాలే!

సబ్‌మెరైన్‌లు, ఫైటర్ జెట్‌లు హెలికాప్టర్‌లు మరియు యుద్ధ క్షిపణులను కలిగిఉండే వాహనాలు, ట్యాంకర్లు, ఈ నాలుగు రంగాలలో "వ్యూహాత్మక భాగస్వాములను" ఎంపిక చేయడం జరిగింది. డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ (డిపియస్‌యు)లను, ఫైటర్ జెట్స్, హెలికాప్టర్లకు కనీసం బిడ్డింగ్ కూడా వేయకుండా రక్షణశాఖ నిరోధించింది. అంతేగాక సబ్ మెరైన్లకు, యుద్ధ ట్యాంకుల వాహనాలకైనా సిద్ధాంత పరమైన వ్యతిరేకతతో బిడ్డింగ్‌కు అనుమతిస్తారా? లేక అనుమతించరా అన్నది కూడా గమనించాల్సిన విషయమే! ప్రతి విభాగంలోనూ ఆరుగురు వ్యూహాత్మక భాగస్వాములుగా దరఖాస్తూ చేయవచ్చు.... వారి నుండే ఒక్కరిని ఎంపిక చేయడం జరుగుతుంది అదే విధంగా ఒక్కో విభాగంలోనూ రెండు లేదా మూడు కంపెనీలను "ఒరిజనల్ ఎక్విప్‌మెంట్ మాన్యుపాక్చరర్స్ (ఓఇయంయస్), అనగా సహజమైన సాయుధ సామాగ్రి ఉత్పత్తి దారులుగా ఎంచడం జరుగుతుంది. ఈ విభాగాలలో పోటీ పడే సంస్థలకు స్వంత మౌలిక వసతులు, పాశ్చాత్య మేధావుల అనుభవజ్ఞత, వారి సేవల వినియోగంతో పాటుగా కనీసం 2000 కోట్ల రూపాయల స్వంత ఆస్థులు, గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా కనీసం 4,000 కోట్ల వార్షిక టర్నోవర్ తగ్గకుండా ఉండాలన్న నిబంధనలు పాశ్చాత్య సంస్థలకు మాత్రమే ఉపయోగపడుతుంది. అవి అందించే సాంకేతికత పరంగా, వారి యొక్క పరిధి, విస్తృతి, లోతు పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. దేశీయ సంస్థలు స్థానికంగా మౌలిక వసతులు కల్పించుకుని, విదేశీ సంస్థల భాగస్వామ్యంలో సాంకేతికను అందిపుచ్చుకొని, కావాల్సిన రీతిగా ఉత్పత్తి చేయడం జరుగుతుంది. నిజానికీ దేశీయంగా మంచి నేపథ్యమున్న "భారత్ ఫోర్జ్, లార్సన్ అండ్ టూబ్రో, టాటాపవర్, మహీంద్ర" వంటి సంస్థలు మిలటరీకి రక్షణాయుధాల తయారీలో సహకరించిన నేపధ్యముంది. నైపుణ్యం పరంగా సైతం మంచి చరిత్ర ఉంది. కానీ మిలటరీ రక్షణ వ్యవస్థకు సంబంధించిన పరికరాల తయారీకి విషయంలో మాత్రం, బెహమాత్ కంపెనీ తో పోల్చినపుడు, కాస్త దిగువస్థాయిలోనే దేశీయ కంపెనీలున్నాయన్నది వాస్తవం.

కొత్తగా ప్రవేశిస్తున్న నూతన కంపెనీలను, దేశీయ కంపెనీలతో పోల్చినట్లయితే కొత్త వారిని రక్షణ రంగంలోకి అహ్వానించడం అంత శ్రేయస్కరం కాదు. ప్రభుత్వం కేటాయించే భూములు, తక్కువ వడ్డీతో పెట్టుబడులు, ఖచ్చితంగా లభించే ప్రభుత్వ ఆర్డర్లు ఇవన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే కేవలం "పరికరాలను కలిపి, ఉత్పత్తి చేయడానికే" విదేశీ సంస్థలు ఉపయోగ పడబోతున్నాయా? కేంద్ర రక్షణమంత్రి నాయకత్వంలోని "డిఫెన్స్ ఎక్విజిషన్ కౌన్సిల్" చెప్పేదే మంటే, స్వీయ అపరాధాలను, రుణాల పునర్మిర్మాణము, నికర్ధక ఆస్థులపై తెచ్చే అప్పులు, మొదలయిన చరిత్రను పరిగణలోకి తీసుకొని వ్యూహాత్మక భాగస్వామిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపింది. ఉదాహరణకు ప్రభుత్వం ఎంపిక చేసిన పరిమిత కంపెనీల పట్టికలో ఉన్న "అనిల్ ధీరూభాయ్ అంబానీ కంపెనీ 1.25 లక్షల కోట్లు, అదానీ గ్రూప్ కంపెనీలు 96,031 కోట్ల రూపాయలు, పబ్లిక్, మరియు ప్రైవేట్ బ్యాంకులకు బకాయిలున్నాయి. వీటిలో కొంతభాగం నిరర్ధక ఆస్థులుగా మారాయి. మరి ఈ కంపెనీలను ఎలా ఎంపిక చేశారు? పట్టికలో తొలి స్థానాలలో ఎలా కూర్చోపెట్టారు? ప్రభుత్వం నిర్దేశించిన పరిధులను అతిక్రమించి మరీ రక్షణ వ్యవస్థను ప్రైవేటుపరం చేయబోతుందని ఈ ఎంపిక ద్వారా స్పష్టమవుతున్నది. వాస్తవానికి 2017 ఫిబ్రవరిలో ప్రభుత్వం రఫాయెల్ సంస్థతో 29,000 కోట్లకు ఒప్పందంలో రిలయన్స్ సంస్థ

(మిగతా 23వ పేజీలో)

ఆర్థిక రంగం

# తిరోగమన బాట పట్టిన ఆర్థిక వ్యవస్థ



రచయిత ప్రముఖ ఆర్థికవేత్త

సి.పి. చంద్రశేఖర్

కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వానికి గత సెప్టెంబర్ నెల నుంచి గడ్డుకాలం మొదలైంది. మోడీ గారు 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మంత్రిమండలి పునర్ వ్యవస్థీకరణ కసరత్తులో మునిగితేలుతుంటే మరోవైపు భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో గణనీయంగా తగ్గి 5.7 శాతానికి పడిపోయింది. గత ఏడాది దాదాపు 8 శాతంగా ఉన్న వృద్ధి రేటు ఈ ఏడాది జనవరి – మార్చి కాలంలో 6.1 శాతానికి, తరువాత జూన్ నాటికి 5.7 శాతానికి పడిపోయింది.

ఊహించినట్టుగానే ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన ప్రభుత్వం స్వల్ప కాలిక కుదుపులుగా అభివర్ణించింది. సహజసిద్ధంగా భారత వృద్ధి రేటు 7 – 8 శాతం మధ్య ఉంటుందంటూ జాతీయ ప్రజాతంత్ర కూటమి (ఎన్డీయే) చెబుతున్న మ్యాజికల్ ప్రమాణాలకు ఇది విరుద్ధం. భారత ప్రధాన గణాంకవేత్త టిసిఎ అనంత్ విలేకర్ల సమావేశం నిర్వహించి మరీ ఈ కుదుపులపై వివరణ ఇచ్చారు. వాస్తవానికి ప్రధాన గణాంక వేత్త వాస్తవిక బాధ్యత గణాంకాలను పరిశీలించి నివేదికలు రూపొందించడమే కానీ, ఆ గణాంకాలకు కారణాలు వివరించే పని కాదు. ఏప్రిల్ – జూన్ పతనం నోట్ల రద్దు అల్లకల్లోల ఫలితం కాదనీ, వస్తు సేవల పన్ను (జిఎస్టీ)కి ముందస్తు ఆందోళనలతో 'అప్రకటిత నిల్వల' ఫలితమని ఆయన ప్రకటించారు. కొత్త నిబంధనలను, రేట్లను వర్తింపజేసేలోపే నిల్వలను క్లియర్ చేసుకోవాలని భావించిన తయారీదార్లు కొత్త ఉత్పత్తుల్లో పాత నిల్వలను చేర్చకుండా చూశారని అనంత్ వివరణిచ్చారు. జనవరి – మార్చి పతనాన్ని కూడా ఇదే తరహాలో నోట్ల రద్దు ప్రభావం కాదని ప్రకటించిన ప్రధాన గణాంకవేత్త కనీసం ఆ రకంగానైనా నిలకడగా ఉన్నారు. వాస్తవమేమంటే 2016–17 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.9 శాతంగా ఉన్న వృద్ధి రేటు ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో మూడేళ్ల కనిష్ట స్థాయి 5.7 శాతానికి పడిపోవడాన్ని అవాంఛనీయమైన కొన్ని స్వల్పకాలిక ఆర్థిక ఫలితాలని కప్పిపుచ్చలేము. ఆర్థిక వ్యవస్థలో ప్రధాన సరుకు ఉత్పాధక రంగాలైన వ్యవసాయం, తయారీరంగం దెబ్బతినిపోతున్నవైనాన్ని వృద్ధిరేటు గణాంకాలు నేరుగా సూచిస్తున్నాయి.

ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోకుండా ఖర్చులు చేస్తూ తన ఖజానా రాబడులను, స్థిరత్వాన్ని కోల్పోతున్న నేపథ్యంలో తాజా వృద్ధిరేటు పతనం ఆందోళన కలిగించేదే. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గణాంకాల ప్రకారం 2017–18 ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు మాసాల్లో (ఏప్రిల్ – జులై) కేంద్ర ప్రభుత్వ ఖర్చులు మొత్తం బడ్జెట్‌లో 38 శాతంగా ఉన్నాయి. గతేడాది ఇదే కాలంలో ఖర్చుల మొత్తం 33 శాతంగా ఉంది. వృద్ధి మందగించినా ప్రారంభంలో చేసే ఈ బడ్జెట్ ఖర్చుల వల్ల ఆర్థిక వ్యవస్థపై స్వల్పకాలికంగానైనా ఉద్దీపన ప్రభావం తప్పనిసరిగా చూపాలి. కానీ అది ఏమాత్రం లేదు.

పైగా ఎగుమతుల పనితీరు చెప్పుకోదగ్గ స్థాయిలో వృద్ధి చెందింది. భారత ఎగుమతులను డాలర్ ప్రమాణాల్లో గణిస్తే 2017 ఏప్రిల్ – జులైలో ఎగుమతుల వృద్ధి 8.7 శాతం పెరిగింది. 2016లో ఇదేకాలంలో ఎగుమతుల వృద్ధి 3.6 తగ్గుదలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ముఖ్యమైన ఉద్దీపన అంశాల్లో ఎగుమతులను ఒకటిగా పరిగణించపోయినా..భారత ఆర్థిక వృద్ధి పతనానికి ప్రపంచ అననుకూల వాతావరణానిదే బాధ్యత అనే వాదన అర్థంలేనిదని ఎగుమతుల్లో నమోదైన ఈ వృద్ధి స్పష్టం చేస్తోంది.

ఇక మిగిలిన అంశం వ్యక్తిగత వినియోగం, పెట్టుబడుల డిమాండ్. పెట్టుబడుల రంగం ప్రస్తుతం చాలా నిరుత్సాహంగా ఉంది. ప్రభుత్వ ముందస్తు ఖర్చు ఏ విధంగా అయితే ఉద్దీపన ప్రభావం చూపిస్తుందో అలాంటి అవకాశాన్ని పెట్టుబడుల్లో నెలకొన్న ఈ నిరుత్సాహం ముంచేస్తోంది. వ్యక్తిగత ఖర్చు తగ్గిపోవడం, డిమాండ్ అనేవి అటు దీర్ఘకాల, ఇటు స్వల్పకాల రెండు రకాల వనరులనూ కలిగియుంటాయి. నయా ఉదారవాద సంస్కరణల ఆర్థిక ఉపాంశంగా ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో దీర్ఘకాలం పాటు ప్రయివేటు పెట్టుబడులను తగ్గించడం వల్ల ప్రతి ద్రవ్యోల్బణ వాతావరణం ఏర్పడుతుంది. 1990ల ప్రారంభంలో ఈ తరహా సంస్కరణలు మొదలైనప్పటి నుంచే ద్రవ్యలోటుకు కళ్లెం వేయడం ప్రభుత్వానికి ఒక ప్రకటిత లక్ష్యంగా మారిపోయింది. విదేశీ ద్రవ్య పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఉద్దేశించిన ఇలాంటి ఆర్థిక విధానంలో 'సూక్ష్మ ఆర్థిక స్థిరత్వ' ఆధారాల అన్వేషణ, పెట్టుబడుల రాకపోకల నియంత్రణ నిబంధనల సరళీకరణ ద్రవ్యలోటు తగ్గుదలను తప్పనిసరి చేస్తాయి. అందువల్ల 1990ల చరమాంకంలో ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాల కట్టుబాటును వాయిదా వేసుకుంది. దేశంలో పరోక్ష పెట్టుబడులు (పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్) పోగుబడటం పెరిగిపోయింది. అది అలా పెరిగి పెరిగి 2003లో ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బిఎం) చట్టం తీసుకొచ్చేందుకు దారితీసింది. ఈ చట్టం ప్రభుత్వ చేతులను పూర్తిగా కట్టిపడేసింది. ఇది అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి ద్రవ్యలోటు తగ్గించుకుంటూ వచ్చారు. 2016–17లో ఇది జిడిపి నిష్పత్తిలో 3.5గా ఉంది. జిడిపి నిష్పత్తిలో పన్నులపై పరిమితి విధించడంతో పాటు వాటిని అంతకంతకూ తగ్గిస్తూ పెట్టుబడిదారుల అనుకూల పన్ను విధానాన్ని అమల్జేస్తున్న నేపథ్యంలో తీసుకొచ్చిన ఎఫ్‌ఆర్‌బిఎం పర్యావసనంగా ఖర్చులు తగ్గిపోవడంతో అది మొత్తంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతి ద్రవ్యోల్బణ ప్రభావం చూపింది.

ఏదేమైనప్పటికీ, భారీ విదేశీ పెట్టుబడుల రాకతో సమకూరిన ద్రవ్యంతో

> **"అసలైన ప్రమాదకర అంశం జిఎస్టీని తీసుకురావడం. అనేకమైన నిత్యావసర సరుకులను జిఎస్టీలో అత్యధిక పన్ను శ్లాబుల్లోకి చేర్చడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పరోక్ష పన్నులను సరుకులు, సేవలపై వేసి తద్వారా తన ఖర్చులకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవాలని చూస్తోంది."**

బ్యాంకు రుణాల కారణంగా అత్యధిక వృద్ధి సంవత్సరాలుగా చెబుతున్న 2003-08 కాలంలో ఈ ప్రభావం కనిపించదు. రుణాల మూలాన వినియోగం, పెట్టుబడుల ఖర్చు పెరగడం వృద్ధి ఉద్దీపనకు కూడా దోహదం చేసింది. రిటైల్ రుణాల్లో ప్రత్యేకించి ఇంటి రుణాల్లో పెరుగుదల నమోదు కావడంతో పాటు వాణిజ్య బ్యాంకుల స్థాయి భారీ కార్పొరేట్ రంగంగా విస్తరించడం అధికమైంది. ఈ రుణాధారిత పెట్టుబడుల్లో అత్యధికం దీర్ఘకాల కష్టాలు..స్వల్ప లాభాలుండే రంగంగా అభివర్ణించే మౌలిక సదుపాయాల రంగంలో ఉండటం విశేషం. ఇలాంటి పెట్టుబడులను ప్రయివేటు రంగంలో ప్రోత్సహించాలని ప్రభుత్వం భావించినప్పటి నుంచీ భారీ మొత్తంలో పెట్టుబడులు అవసరమయ్యే ప్రాజెక్టులకు ప్రభుత్వం సృష్టించిన హైప్ వల్ల అంతే భారీస్థాయిలో ఆయా కంపెనీలకు రుణాలు ఇచ్చారు. ఈ శతాబ్ది రెండో దశకం ప్రారంభంలో ఈ ప్రాజెక్టులు చాలా వరకు నగదు రాబడులను సృష్టించడంలో విఫలమై కనీసం తీసుకున్న రుణాల వడ్డీలను చెల్లించే పరిస్థితి కూడా లేకుండా పోయింది. రుణాలు చెల్లించలేక చేతులెత్తేయడంతో నిరర్థక ఆస్తులు భారీ స్థాయిలో పెరిగాయి. ఈ పరిణామం ఇటు ప్రభుత్వ రంగ బ్యాంకులకు, అటు ప్రభుత్వానికి అపరిష్కృత సమస్యగా మారిపోయింది.

ఇలాంటి పారు బకాయిల మూలాన ఏర్పడిన నష్టాలను పూడ్చుకోలేకపోవడం, లాభాలను త్యాగం చేయాల్సిరావడం వంటి కారణాల వల్ల బ్యాంకులు జాగ్రత్తపడటంతో రుణాల వృద్ధి ఇటీవల మాసాల్లో బాగా పడిపోయింది. దీని ప్రభావం వల్ల డిమాండ్, వృద్ధి అంశాలు ప్రభుత్వం తగిన ఖర్చులు చేసినా కూడా ప్రతికూల వాతావరణంలోకి నెట్టివేయబడ్డాయి. డిమాండ్ తగ్గిపోయింది. వృద్ధి పతనమైపోయింది. ఈ విధంగా చూసినప్పుడు ఇటీవలి త్రైమాసికాల్లో వృద్ధి పతనమనేది స్వీయ దిద్దుబాటు ఫలితంగా ఏర్పడిన స్వల్పకాలిక అడ్డంకులు లేదా కుదుపులుగా భావించలేము. నయా ఉదారవాద వాతావరణంలో కృత్రిమ ఉద్దీపనలను సుస్థిరపర్చలేక వ్యవస్థ విఫలం చెందిన ఫలితంగానే ఈ తగ్గుముఖ ధోరణులకు కారణం. రుణ బుడగలపైన సవారీ చేసే వృద్ధి అత్యంత అస్థిరమైనదనీ, ఆర్థిక వ్యవస్థ మందగమనంలో కూరుకుపోతుందనేది దీన్నిబట్టి నిర్ధారణైంది.

### ఆర్థిక సంక్షోభానికి సంకేతం

స్వీయ ప్రకటిత ఆర్థిక స్థిరీకరణ నియమాలను ఉల్లంఘించకుండా వృద్ధి పెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకపోతే ఆర్థిక సంక్షోభానికి ప్రస్తుత పతనాన్ని ఆరంభంగా చెప్పవచ్చు. ఇటీవల తీసుకున్న చర్యలు మూడు ప్రాధమ్యాలకు సంకేతాలిస్తున్నాయి. మొదటిది ప్రయివేటీకరణను, వ్యూహాత్మక అమ్మకాలను పెంచడం ద్వారా రుణేతర పెట్టుబడి రాబడుల (క్యాపిటల్ రిసిప్ట్స్) సుస్థిర పెరుగుదల కోసం ఉద్దేశించినది. గణించిన ద్రవ్యలోటుకు ఈ క్యాపిటల్ రిసిప్ట్స్ మినహాయింపు. 2017-18 బడ్జెట్‌లో ప్రయివేటీకరణ రిసిప్ట్స్ అత్యంత అధిక స్థాయిల్లో రూ.72,500 కోట్లుగా చూపారు. ఇవి మరింతగా పెరిగే అవకాశముంది. ప్రస్తుత ఖర్చుల ఆర్థిక అవసరాల కోసం ఉన్న ఆస్తులను అమ్మేయడం ఆర్థిక దృష్టి ఏమాత్రం అనిపించుకోదు. కానీ సాహసోపేతమైన ప్రభుత్వం మాత్రమే ఆర్థిక దిద్దుబాటుకు తెగిస్తుంది.

రెండోది, భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) 'లాభాల'ను దాని 'యజమాని'గా ఉండే ప్రభుత్వానికి డివిడెండ్ చెల్లింపుల రూపంలో బదిలీ చేయడం. కేంద్ర బ్యాంకుగా ఆర్‌బిఐ వాణిజ్య కార్యకలాపాలు ఏమీ నిర్వహించదు. అందువల్ల దాని లాభాలన్నీ కూడా బ్యాంకు నోటు జారీ చేయడం ద్వారా వచ్చిన ఆదాయం (టంక శుల్కం లేదా డబ్బుల ముఖ విలువకు, భౌతికంగా దానిని ముద్రించేందుకు అయిన ఖర్చుకు మధ్య వ్యత్యాసం వల్ల ఒనగూడిన లాభం), ఆస్తులు, ద్రవ్య నిర్వహణ చర్యల ఫలితంగా దేశ, విదేశాల్లో కలిగియున్న బాండ్లు, బిల్లులపై వడ్డీల ద్వారా లభించే ఆదాయం రూపంలో వచ్చేవే. ప్రభుత్వానికి కేంద్రబ్యాంకు నుంచి బదిలీ అయ్యే ఇలాంటి 'కాగితపు లాభం' బడ్జెట్‌లో రూ.58 వేల కోట్లు. అయితే 2016-17లో రూ.44,000 కోట్లు మిగులు సాధించిన రిజర్వుబ్యాంకు నోట్ల రద్దు దెబ్బతో ఇప్పటివరకు రూ.30,659 కోట్లు మాత్రమే విడుదల చేయగలిగింది. 2015-16లో ఇదే కాలానికి రిజర్వుబ్యాంకు రూ.65,876 కోట్లు బదిలీ చేసింది. మీడియా కథనాల ప్రకారం ప్రభుత్వం ఇంకా ఇవ్వాలని ఒత్తిడి చేసినా..రూ.13 వేల కోట్లకు మించపోవచ్చని తెలుస్తోంది.

చివరిది, అసలైన ప్రమాదకర అంశం జిఎస్టీని తీసుకురావడం. అనేకమైన నిత్యావసర సరుకులను జిఎస్టీలో అత్యధిక పన్ను శ్లాబుల్లోకి చేర్చడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పరోక్ష పన్నులను సరుకులు, సేవలపై వేసి తద్వారా తన ఖర్చులకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవాలని చూస్తోంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఈ పన్నుల పంపకానికి సంబంధించిన నిబంధనలను తెరపైకి వచ్చినప్పటి నుంచీ జిఎస్టీ రేట్లను తగినంత ఎక్కువ పెంచాలనే ఉద్దేశం ముందుకొచ్చింది. దానివల్ల అటు రాష్ట్రాలకు వచ్చే రెవెన్యూ నష్టాలను పూడ్చే బాధ తప్పుతుంది. కేంద్రం తగినంత ఆదాయాన్ని సమకూర్చుకోగలుగుతుంది. దీనిద్వారా రాష్ట్రాల్లోనూ కేంద్ర ప్రతిపాదనలకు అంగీకారం లభిస్తుంది. ప్రభుత్వం ఈ ఎత్తుగడలోనే పందెం పూనింది. ఈ పందెంలో ప్రభుత్వం గెలిచిందా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. కానీ ఆ విజయం చాలా పాక్షికమైనది మాత్రమే. రెవెన్యూ సమస్యను పరిష్కరించే అత్యధిక రేట్లు అస్థిరమైన ద్రవ్యోల్బణ ధోరణలకు కూడా దారితీస్తాయి. మరోవైపు, ఒక వేళ ఆదాయాలు పెరగకపోతే అంతర్జాతీయ ద్రవ్య, వ్యయ స్థాయిల కంటే ద్రవ్యలోటు లక్ష్యాలు తగ్గిపోయి వృద్ధి పతనానికి అవసరమైన తిరోగమన స్థాయిలకంటే దిగువకు పడిపోతాయి.

2019లో రెండోసారి కూడా భారీ స్థాయిలో విజయం సాధించాలని చూస్తున్న ఎన్డీయే ఎదుర్కొవాల్సిన ప్రధానమైన సమస్య ఇదే. తనకు తానుగా పరిష్కారం కనుగోలేని క్లిష్టమైన సమస్య కూడా ఇదే.

❋

**మార్పు**

# విద్యార్థి ఎన్నికల్లో సంఘ్ పరివార్‌కు పరాభవాల పరంపర

మతతత్వ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనుబంధ అఖిల భారతీయ విద్యార్థి సంఘం (ఏబివిపి) ఇటీవల వరుసగా జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల్లో ఘోర పరాభవం చవి చూడ్డం నేటి రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో చాలా ప్రాముఖ్యత గల అంశం. విద్యా కాషాయీకరణ, ప్రయివేటీకరణ దూకుడు పెంచిన ఎన్డీయే ప్రభుత్వ తీరుకు నిరసనగా విద్యార్థుల్లో, యువతరంలో వస్తున్న వ్యతిరేకతకు ఇది నిదర్శనం. సహేతుకమైన చర్చలు, సద్విమర్శలు, సాంస్కృతిక, మేధోపర సంఘర్షణలకు వేదికలుగా బాసిల్లాల్సిన విశ్వవిద్యాలయాల్లో కాషాయ కాలనాగులను వైస్ చాన్సలర్స్‌గా నియమించి రోహిత్ వేముల వంటి పరిశోధక విద్యార్థులను పొట్టనపెట్టుకున్న పాలకుల దిమ్మతిరిగేలా యువత సరైన తీర్పునిచ్చింది. విద్యార్థి రాజకీయాలు విశాల ప్రజాభిప్రాయాన్ని సూచిస్తాయి. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు అంటూ అధికారపీఠమెక్కిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల మూడేళ్ళ క్రితం యువతలో ప్రధానంగా పట్టణ ప్రాంతాల యువతలో ఎంతో ఆదరణ ఉండేది. 2013 - 14 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల ప్రాంగణాలలో మోడీకి ఘనంగా స్వాగతం పలికిన విద్యార్థిలోకం ఇప్పుడు నల్లజండాలతో నిరసన తెలియజేస్తోంది. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా వంటివన్నీ ఊదేలోపే పేలిపోయే గాలి బుడగలవ్వడంతో ఇప్పుడు మోడీ మాయదారి మాటలను నమ్మేవారు తగ్గిపోతున్నారన్న దానికి పలు యూనివర్శిటీల్లో ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘానికి ఎదురవుతున్న పరాజయాలే నిదర్శనం. దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు, దళిత సంఘాలు లాల్-నీల్ నినాదంతో కలిసి మతోన్మాదంపై విస్తృతంగా ఉద్యమాలు సాగిస్తున్న తరుణంలో జవహర్‌లాల్ నెహ్రూ, హైదరాబాద్ తదితర విశ్వవిద్యాలయాల్లో వామపక్ష, దళిత, మైనార్టీ విద్యార్థి సంఘాలు ఉమ్మడి వేదికలుగా ఏర్పడి మతత్వంపై విజయబావుటా ఎగురవేస్తుండటం విశేషం.

దేశంలో వివిధ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల ఫలితాలు ఏబివిపికి తీవ్ర పరాభవం మిగిల్చాయి. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటి, ఢిల్లీ యూనివర్సిటితో పాటు, హైదరాబాద్, గౌహతి, పంజాబ్ విశ్వవిద్యాలయాల్లో ఏబివిపి ఘోరంగా ఓటమి చవిచూసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిలో ఏబివిపి పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఘోరంగా ఓటమిపాలైంది. వామపక్షాలు, దళిత, గిరిజన విద్యార్థి సంఘాల ఉమ్మడి వేదికగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నేతృత్వంలో ఆవిర్భవించిన సామాజిక న్యాయ కూటమి అన్ని స్థానాల్లోనూ జయకేతనం ఎగురవేసింది. పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల గతంలో ప్రాతినిధ్యం వహించిన అంబేద్కర్ విద్యార్థి సంఘం (ఏఎస్‌యు) విద్యార్థి శ్రీరాగ్ హెచ్ఎస్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షునిగా ఏబివిపి అభ్యర్థిపై



**జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఎన్నికల్లో ఏబివిపి ప్యానెల్‌ను చిత్తుగా ఓడించి గెలుపొందిన యునైటెడ్ లెఫ్ట్ అభ్యర్థులు**



**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఏబివిపి ఓడించి యునైటెడ్ ఫ్రంట్ ఫర్ సోషల్ జస్టిస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు.**

| విద్యార్థి సంఘాలు గెల్చుకున్న స్థానాలు | సంవత్సరం | ఏబివిపి | ఎన్ఎస్‌యుఐ | లెఫ్ట్ | ఇతరులు |
|---|---|---|---|---|---|
| పంజాబ్ విశ్వవిద్యాలయం, ఛండీగఢ్ | 2017 | | 3 | | |
| | 2016 | | 4 | | |
| | 2015 | | | | 4 |
| హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ | 2017 | | | 5 | |
| | 2016 | | | 5 | |
| | 2015 | | | 5 | |
| ఢిల్లీ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ | 2017 | 2 | 2 | | |
| | 2016 | 3 | 1 | | |
| | 2015 | 4 | | | |
| జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ | 2017 | | | 4 | |
| | 2016 | | | 4 | |
| | 2015 | 1 | | 3 | |
| గువహతి విశ్వవిద్యాలయం, అస్సాం | 2017 | 2 | 2 | | 11 |
| | 2016 | 1 | 8 | | 6 |
| | 2015 | 3 | 4 | | 8 |
| రాజస్థాన్ విశ్వవిద్యాలయం, జైపూర్ | 2017 | 2 | 2 | | |
| | 2016 | 4 | | | |
| | 2015 | 2 | 2 | | |
| కోటా విశ్వవిద్యాలయం, రాజస్థాన్ | 2017 | 4 | | | |
| | 2016 | 1 | 1 | | |
| | 2015 | 1 | 1 | | |
| ఎండిఎస్ విశ్వవిద్యాలయం, అజ్మీర్ | 2017 | 1 | 2 | | |
| | 2016 | | 3 | | |
| | 2015 | 1 | 2 | | |

170 మెజార్టీతో విజయం సాధించడం విశేషం. కాషాయ మనువాద వివక్ష ఉన్మాదానికి బలైపోయిన రోహిత్ వేముల ఆత్మహత్యపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య రూపన్ వాలా కమిషన్ అసత్యాలతో కూడిన నివేదికను తప్పుబడుతూ తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరిగిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ యూనివర్సిటీలో తొలిసారిగా ఏఎస్‌యు వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి పోటీ చేయడం ఈ ఎన్నికల్లో మరో విశేషం.

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు)లో వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కూటమి ఘన విజయం సాధించగా, ఢిల్లీ యూనివర్సిటీ (డియు)లో కాంగ్రెస్ అనుబంధ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యుఐ) గెలుపొందింది. పంజాబ్‌లో ఏబివిపి ఒక్క సీటు కూడా సాధించకపోవడం గమనార్హం.

'వాస్తవం ఏమిటంటే ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక విశ్వవిద్యాలయం పంజాబ్ యూనివర్సిటీ. భారతదేశంలోని యువత ఆలోచనలను ఇక్కడ జరిగిన ఎన్నికలు ప్రతిబింబిస్తాయి. ఎందుకంటే ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులే కాకుండా దేశం నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడకు వస్తారు.' అని పంజాబ్ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ అశుతోష్ కుమార్ అన్నారు. ఇది కేంద్రీయ విశ్వవిద్యాలయం కాకపోయినా..హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలు సమకూర్చే నిధులతో ఒక జాతీయ విశ్వవిద్యాలయంగా నడుస్తోంది.

మితవాద సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల్లో చైతన్యం వెల్లివిరుస్తోందనీ, విద్యార్థుల్లో కాషాయీకరణను ప్రశ్నించడం మొదలైందని రాజస్థాన్ విశ్వవిద్యాలయ సోషియాలజీ విభాగ మాజీ అధిపతి రాజీవ్ గుప్తా అభిప్రాయపడ్డారు.

ఏబివిపికి కాస్త ఆనందం ఏదైనా మిగిలివుందా అంటే అది బిజెపి పాలనలోని రాజస్థాన్‌లోనే. బికనీర్‌లోని మహారాజా గంగా సింగ్ యూనివర్సిటీలో అన్ని స్థానాల్లోనూ ఏబివిపి విజయం సాధించింది. ఆగస్టు 28న నిర్వహించిన ఈ ఎన్నికల ఫలితాలు సెప్టెంబర్ 4న విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో అన్ని స్థానాలనూ ఏబివిపి నిలుపుకున్నా..గతంలో కంటే ఓట్ల శాతం గణనీయంగా పడిపోయింది. యూనివర్సిటీలో ఏబివిపి ప్రాభవం బాగా దెబ్బతిన్నది.

అస్సాంలోని గువహతి యూనివర్సిటీలో ఆల్ అస్సాం విద్యార్థి సంఘం (ఏఏఎస్‌యు) అన్ని ప్రధానస్థానాల్లోనూ విజయం సాధించి ఏబివిపిని వెనుక్కనెట్టింది. సాంప్రదాయంగా 2001 వరకు ఎన్ఎస్‌యుఐకి ఈ యూనివర్సిటీలో పట్టు వుండేది. దానిని క్రమేపి ఎఎఎస్‌యు చేజిక్కించుకుంది.

'సాధారణంగా గౌహతి యూనివర్సిటీ విద్యార్థులను బట్టే రాజకీయాలపై ఒక అభిప్రాయానికి రావచ్చు. అస్సాం రాజకీయ ముఖచిత్రం ప్రభావం చూపే రాజకీయ నాయకులను ఏళ్ల తరబడి ఈ యూనివర్సిటీనే అందిస్తోంది' అని రాజకీయ విశ్లేషకులు దిలీప్ చందన్ అన్నారు.

# అంతర్జాతీయ విప్లవకారుడు ఫైడల్ కాస్ట్రో

ప్రకాశ్ కరత్



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

ఫైడల్ కాస్ట్రో ఇరవయ్యో శతాబ్దానికి చెందిన మేరు శిఖర విప్లవోద్యమ స్వరూపం. ప్రపంచంలోని చిన్న దేశాలలో ఒక్కటైన "క్యూబా" లో ఆయన నడిపిన విప్లవం, కాలానికతీతంగా, మహోన్నతంగా మానవాళి కోసం నిలబడింది.

హేయమైన బాటిస్టా దొరతనాన్ని కూల ద్రోయడమే, పశ్చిమార్ధ గోళంలో మొట్టమొదటి సోషలిస్ట్ విప్లవానికి దారి తీసింది. యునైటెడ్ స్టేట్స్ ఆధిపత్యంలో, మాఫియాలకు ఆటస్థలంగా, వారి చేతుల్లో బానిసగా ఉన్న దేశం సంకెళ్ల తెంచుకుని ఫైడల్ నాయకత్వంలో ఓ సరికొత్త వ్యవస్థగా ఎదిగింది. తన వ సంవత్సరం నాటికే, క్యూబా ప్రభుత్వాదినేతగా ఫైడల్ క్యాస్ట్రో ఎదిగారు. ఆయన నేతృత్వంలో క్యూబా సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా, మానవ హక్కుల పరిరక్షణలో ఉన్నతంగా ఎదిగింది. కాస్ట్రో మరియు అతని విప్లవ ప్రభుత్వం సోషలిజం ఏం చేయగలదో నిరూపించారు. అవిద్యను రూపుమాపటం, అంతర్జాతీయ విద్య, ప్రపంచంలోని అగ్రరాజ్యాలకు ధీటైన ఆరోగ్య పరిరక్షణా వ్యవస్థ, అన్ని రంగాలలో మహిళలకు సమాన హక్కులు మరియు జాతి వివక్ష లేని దేశాన్ని నిర్మించారు.

ప్రపంచంలోనే సామ్రాజ్యవాద శక్తికి ప్రతిరూపంగా ఉన్న యునైటెడ్ స్టేట్స్‌కి ప్రతిరూపంగా ఉన్న యునైటెడ్ స్టేట్స్‌కి కేవలం 90కి॥మీ దూరంలో ఉన్న క్యూబా అమెరికా బెదిరింపులకు ఏనాడూ తలొగ్గలేదు. సోషలిస్ట్ క్యూబాను కూల్చేయాలని దాదాపు 5దశాబ్దాలు అమెరికా చేసిన అనేకానేక కుట్రలకు ఎదురొడ్డి నిలిచింది. సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ (సి.ఐ.ఎ) కాలక్రమంలో వెలువర్చిన సత్యాలలో కాస్ట్రోని హతమార్చడానికి కొన్ని వందల ప్రయత్నాలు జరిగాయని తెలిపింది. 1961 లో నాటి అధ్యక్షుడు కెన్నెడీ ఆధ్వర్యంలోని బే ఆఫ్ పిగ్స్ దాడి నుండి మరణించేవరకూ



పదిమంది అమెరికా అధ్యక్షులు క్యూబాను అస్థిరపర్చడం కోసం చేసిన అన్ని ప్రయత్నాలను విఫలం చేశాడు ఫైడల్ కాస్ట్రో. గోలియత్ ని ఎదిరించి నిలచి విజయం సాధించిన డేవిడ్ గా ఫైడల్‌ని అభివర్ణించవచ్చు.

లాటిన్ అమెరికాలోని విప్లవోద్యమాలకు, ప్రగతిశీల ఉద్యమాలు, వామపక్ష భావజాలం మరింత ముందుకుపోవడానికి దారి చూపింది క్యూబా విప్లవం. ఫైడల్ కాస్ట్రో, అతని అత్యంత సన్నిహితుడైన కామ్రేడ్ చేగువేరా, ఎన్నో తరాల యువతకు విప్లవ చిహ్నంగా నిలిచారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలోని మరే కమ్యూనిస్ట్ నాయకుడికి లేనంత అంతర్జాతీయ దార్శనికత ఫైడల్ కుంది. దక్షిణాఫ్రికాలోని తెల్లజాతి వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుతున్న అంగోలా మరియు మొజాంబిక్ దేశాలకు సహాయంగా, క్యూబా సైన్యాన్ని పంపాడు కాస్ట్రో. దక్షిణాఫ్రికా స్వాతంత్ర్యంకోసం, జరిగిన పోరాటాలలో, క్యూబా విప్లవోద్యమం పాత్ర ఫైడల్ సహకారం గూర్చి మన దేశానికి తెలిసింది. చాలా తక్కువ. జాతి స్వేచ్ఛ కోసం పోరాటం జరుపుతున్న అంగోలాకు క్యూబా సైనిక దళాన్ని పంపాలన్నది ఫైడల్ నిర్ణయం. 1988లో, "క్యూటో క్యూనావాల్" నిర్ణయాత్మక యుద్ధంలో సిఐఎ ఆర్థిక సహకారంతో యుఎన్ఐటిఎ శక్తులు దక్షిణ ఆఫ్రికా [illegible] సహకరించినప్పటికీ క్యూబా సైన్యం చేతిలో పరాజయాన్నే పొందింది. ఓటమి పాలైన దక్షిణాఫ్రికా అంగోలా ప్రాంతంలో తన సైన్యాన్ని తొలగించింది. తద్వారా వర్ణవివక్షత సమసింది. అంతేగాక, నమీబియానుంచి సైతం తన సైనిక దళాలను ఉపసంహరించాల్సి వచ్చింది. జాతి వివక్షత, వర్ణవివక్షతలో దక్షిణాఫ్రికా లో అప్పటి వరకూ ఉన్న అనేకానేక సమస్యలను "క్యాటోక్యూనావాల్" విజయం కూలదోసింది. దక్షిణాఫ్రికా స్వాతంత్ర్యానంతరం, ఫైడల్ కాస్ట్రోకి తన కృతజ్ఞతలను బహిరంగంగా ప్రకటించాడు నెల్సన్ మండేలా!

మార్క్సిజాన్ని సృజనాత్మకంగా,

> “ ప్రపంచంలో మరే దేశము ఎదుర్కోనంత ఆర్థిక సంక్షోభాన్ని క్యూబా ఎదుర్కొంది. అమెరికా కుతంత్రాలను, దౌష్ట్యాన్ని ఎదిరిస్తూనే, నయా ఉదారవాద విధానాలను తిరస్కరిస్తూ తనదైన ప్రత్యేక సాంఘిక వ్యవస్థను నేటికీ కొనసాగిస్తోంది. ”

వాస్తవ పరిస్థితులనుకుణంగా మలచిన విప్లకారుడు ఫైడల్. అభివృద్ధి పథంలో అట్టడుగునున్న మూడవ ప్రపంచపు దేశంలో, జాతీయ సాంస్కృతిక వనరులు పరిమితంగా నున్న సమయంలో మార్క్సిజాన్ని అమలుచేసి, సోషలిస్ట్ వ్యవస్థకు మార్గం వేసిన మార్గదర్శకుడు.

అసాధారణ తెలివి తేటలు, విషయ పరిజ్ఞానాన్ని విసృతంగా గ్రహించే ప్రజ్ఞ ఫైడల్ స్వంతం. ప్రజలలో అలోచన రేకెత్తించి, విప్లవోద్యమం వైపు మరలేదిశగా, మనస్సును బలంగాతాకి, ప్రభావితం చేయగల ఉపన్యాసాలలో మరే కమ్యూనిస్ట్ నాయకుడు ఆయనకు చేరువలో లేనంత దిట్ట ఫైడల్ కాస్ట్రో. కొన్ని సందర్భాలలో నాలుగు గంటల వరకూ అనర్గళంగా సాగే ఆయన ఉపన్యాసాలు కేవలం అలంకార ప్రాయంగా గాక, రాజకీయ విశ్లేషణలు, వాస్తవాలు, లెక్కలతో కూడిన ఉదాహరణలుండి ప్రజలకు సులువుగా అర్థం చేసుకునే తీరుగా ఉండేవి.

లెనిన్ గూర్చి ఉదహరిస్తూ, విప్లవాన్ని సృష్టించుకోవడమే గాక, పరిరక్షించుకోవడం కూడా చాలా ముఖ్యమని స్పష్టం చేసేవాడు. సామ్రాజ్యవాద అమెరికా, క్యూబాను విధ్వంసం చేయాలని ఎన్ని సార్లు ప్రయత్నించినా, ప్రయత్నిస్తూనే ఉన్నా, ఆటంకాలన్నింటినీ ఎదిరిస్తూ విప్లవ స్ఫూర్తిని కొనసాగించడమన్నది కేవలం ఫైడల్ నాయకత్వం వలనే సాధ్యమయ్యింది. ఈ సుదీర్ఘప్రస్థానంలో కీలక సమయం 1991 నుండి 1999 మధ్యనున్న ఎనిమిది సంవత్సరాలు. ఆర్థిక సమస్యలు దేశాన్ని ముట్టడించి అతలాకుతలం చేసిన కాలం. రష్యా నాయకత్వంలోని “కొమెకాన్ బ్లాక్” దేశాలన్ని సతమతమవుతూ ఉండటం వలన క్యూబా ఆర్థిక విధానాలన్ని కుంటుపడ్డ తరుణం. అనుకూల పరిస్థితులను ఆధారం చేసుకొని, క్యూబా ఆర్థిక పరిస్థితులలో ఆమెరికా సంక్షోభాన్ని సృష్టించింది. క్యూబాతో, వ్యాపార సంబంధాలు కలిగియున్న మూడవ ప్రపంచపు దేశాలపై, జరిమానా విధించే దిశగా, యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ తమ చట్టాలను మార్చుకుంది. ఫైడల్ అధ్వర్యంలోని క్యూబా ప్రభుత్వం, అమెరికా యొక్క బ్లాక్ మెయిల్ కి తలొగ్గక స్థిరంగా నిలబడింది. సోషలిస్ట్ వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రజలు త్యాగం చేయాలని పిలపు నిచ్చింది. ప్రత్యేకమైన ఆ ఎనిమిది సంవత్సరాల కాలంలో అంతర్జాతీయంగా ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థను, ఉచిత విద్య, ఆరోగ్య పరిరక్షణ, మొదలగు ప్రజోపయోగ వ్యవస్థలను, ప్రైవేటుపరం చేయకుండా స్వేచ్ఛా విపణిలో వత్తిడులకు లోబడకుండా క్యూబా నిలబడింది.

భారతదేశంలోని కమ్యూనిస్టుల, ప్రగతిశీల వాదుల, ప్రజాస్వామ్యవాదుల హృదయాలలో క్యూబాకు, ఫైడల్ కాస్ట్రోకి ప్రత్యేక స్థానం ఉంది. సోవియట్ యూనియన్ పతనం తర్వాత, క్లిష్టమైన ఆర్థిక వ్యవస్థలోనున్న క్యూబాకి బలమైన సంఘీబావాన్ని ప్రకటించిది మనదేశం. 1992 వ సంవత్సరంలో హరికిషన్ సింగ్ సూర్జిత్ నేతృత్వంలో ఒక ఓడ నిండుగా గోధుమలు పంపాలన్న ప్రచారం జరిగింది. అదే సమయంలో “మందులు” కూడా సరఫరా చేయాలని కోరారు. 1992 డిశంబర్ మాసంలో పదివేల టన్నుల గోధుమలతో ఓడ ప్రయాణం క్యూబా దిశగా సాగింది. సూర్జిత్ మరియు యం.ఎ. బేబీ నేతృత్వంలో క్యూబా చేరిన ఓడను హవానా హార్బర్ లో స్వాగతించిన కాస్ట్రో “పదివేల నూట ఐదు టన్నుల గోధుమలు మరియు మందులు కేవలం ఆహార పదార్థాలు, ప్రాణాధార మందులు మాత్రమే కాదు. ఇవి పదివేల నూట ఐదు టన్నుల సంఘీభావం, పదివేల నూట ఐదు టన్నుల నైతిక బలం. మమ్ముల్ని అంతర్జాతీయ పౌరులుగా దేశభక్తులుగా, విప్లవకారులుగా, మేం ఎంచుకున్న లక్ష్యాల దిశలో మరింత ధృడంగా ముందుకు తీసుకువెళ్లే సూచికలు అని ప్రకటించాడు.

మా తరానికి, ఫైడల్ కాస్ట్రో అంటే మూర్తీభవించిన విప్లవ స్వరూపం విప్లవ అవతారం. 1978వ సంవత్సరంలో హవానాలో జరిగిన యూత్ ఫెస్టివల్ లో తొలిసారిగా నేను ఫైడల్ ను చూశాను. అంతర్జాతీయ సమ్మేళనానికి ఇరవై వేల మంది యువత హాజరయిన సమావేశం. ఊహించని పరిణామంలో, లెనిన్ పార్క్‌లో జరగుతున్న ముగింపు సభలో ఫైడల్ కాస్ట్రో ప్రత్యక్షమవ్వడం, ఓద్రిల్ ని మా అందరిలో కలిగించింది. కాస్ట్రోని చూడడమే గాక, ఆయన షేక్‌హాండ్ కోసం ఉగ్రూతలూగింది యువత. నాటి సమావేశంలో పాల్గొన్న ఎందరో నవ యువతీ యువకులు కాలక్రమంలో లాటిన్ అమెరికాలో ప్రసిద్ధి చెందిన విప్లవ నాయకత్వం గా ఆవిర్భవించారు. కొందరు ప్రభుత్వంలో నాయకులుగా ఎదిగారు.

1998వ సంవత్సరంలో రెండు దశాబ్దాలనంతరం, చేగువేరా 30వ వర్థంతి కార్యక్రమానికి నేను హాజరయ్యాను. శాంటాక్లారాలో ఆ రోజు ఫైడల్ చేసిన ఉపన్యాసం నేటికీ నా జ్ఞాపకాల అరల్లో ఉంది. క్యూబా విప్లవంలోని లోతుపాతుల అవలోకనముతోపాటు, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయంగా సాగుతున్న పోరాటాన్ని గూర్చి విశదీకరించారు.

ప్రపంచంలో మరే దేశము ఎదుర్కోనంత ఆర్థిక సంక్షోభాన్ని క్యూబా ఎదుర్కొంది. అమెరికా కుతంత్రాలను, దౌష్ట్యాన్ని ఎదిరిస్తూనే, నయా ఉదారవాద విధానాలను తిరస్కరిస్తూ తనదైన ప్రత్యేక సాంఘిక వ్యవస్థను నేటికీ కొనసాగిస్తుంది. ఆఫ్రికాలోని అనేక దేశాలలో జాతి స్వాతంత్ర్యానికి ప్రేరణగా నిలిచింది క్యూబా. అంతే కాదు లాటిన్ అమెరికా దేశాల్లో జాతీయ సార్వభౌమత్వం కోసం జరిగిన పోరాటాలకు సైద్ధాంతిక వెన్నుదన్నును క్యూబా సమకూర్చింది. దాని వల్ల అక్కడ వామపక్షాలు పురోగమనం సాధించడానికి అవకాశం ఏర్పడింది. మూడవ ప్రపంచపు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం ఆకాంక్షలకు ఉదాహరణ క్యూబా దేశం. దానికి మూలం, ప్రేరణ ఉత్ప్రేరకం అన్ని ఫైడల్ కాస్ట్రో యొక్క ఉద్యమ స్వరూపం. ❋

# సైద్ధాంతిక, సాంస్కృతిక కృషిలో వెనుకబాటును అధిగమించాలి

**సందేహాలు సమాధానాలు**



- బి.వి.రాఘవులు

**1. చంద్రబాబు ప్రజా సమస్యలు గాలికి వదిలివేస్తున్నారు. కానీ ప్రజలు ఎందుకు ఓట్లు వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తాడా?**

2019లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలెలవుంటాయో జోస్యం చెప్పడం కష్టం. అటువంటి జోస్యాల వలన ఉపయోగం వుండదు.

రాష్ట్ర విభజనను సమర్థించినా ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించారు. విభజన అయిన రాష్ట్రాన్ని అభివృద్ధిజేస్తారని కావచ్చు. సమైక్యతపట్ల కొన్ని తరగతుల్లో ప్రగాఢమైన నమ్మకం లేకపోవడం కావచ్చు. ప్రత్యర్థులపై నమ్మకం లేకపోవడం కావచ్చు. డబ్బు, ప్రలోభాలు, పందేరాలు విచ్చలవిడిగా వినియోగించడంగావచ్చు. కారణం ఏదయినా ప్రజలు తెలుగుదేశానికి మెజారిటీ ఇచ్చారు. అధికారంలో ఉన్న ఈ మూడేళ్ళలో తెలుగుదేశం పార్టీ ప్రజలకు చేసింది శూన్యం. అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా భూములను స్వాధీనంజేసుకోవడం, పాలకపార్టీ అనుయాయులకు లబ్ధి జరిగేట్టుగా, డబ్బు సంపాదించుకోవడానికి అనుగుణంగా కొన్ని పథకాలను అమలుజేయడం, అద్భుతమైన రాజధానిని నిర్మించబోతున్నట్లు నిరంతరం నోరూరించడం చేస్తున్నారు. ప్రత్యేకహోదా విషయంలో చేసిన మోసాన్ని, బిజెపి చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకునేందుకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. ప్రజా ఉద్యమాలను, నిరసనలను నిరంకుశంగా అణచివేస్తున్నారు. వంశధార, తొండంగి, తుందుర్రు, శకునాల, పోలవరం నిర్వాసితులు, గరగపర్రు, దేవరపల్లి ఇంకా అనేకచోట్ల ప్రజలు ఉద్యమిస్తే అణచివేయడానికి పూనుకున్నారు. కార్మికులు, ఉద్యోగులకు చేసిన వాగ్దానాలను అమలుజేయలేదు. వీటన్నింటి మూలంగా ప్రజలలో అసంతృప్తి పెరుగుతున్న మాట నిజం. అయితే టిడిపి పాలన వలన కొన్ని తరగతులు ముఖ్యంగా సంపన్నవర్గాలు లబ్దిపొందుతున్నాయి. అలాగే ప్రతిపక్షంగా వున్న వైఎస్సార్ పార్టీకి ప్రత్యామ్నాయ రాజకీయ అజెండా లేదు. ప్రజా సమస్యలకు స్పందించే తత్వం లేదు. వీటన్నింటనీ వినియోగించుకుని ప్రజల అసంతృప్తిని దాటిపోవచ్చని టిడిపి భావిస్తున్నది. రాబోయే రెండు సంవత్సరాల్లో ప్రజా ఉద్యమాల పెరుగుదలను బట్టి రాజకీయ పరిస్థితి వుంటుంది.

**2. మనం నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నాం. కానీ ప్రజలు మనవైపు ఎందుకు రావడం లేదు?**

ప్రజలు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ఉద్యమించడం, పోరాడడం కమ్యూనిస్టుల బాధ్యత. అలా చేయని ఏ కమ్యూనిస్టు పార్టీ అయినా తన పేరును సార్థకం చేసుకోలేదు. అయితే ప్రజా పోరాటాలలో ప్రజలను కదిలించినంత మాత్రాన వారందరూ మన రాజకీయాలవైపు వారంతట వారుగా వస్తారనుకోవడం పొరపాటు. ప్రజలు సమాజంలోని అనేక ఆలోచనలతో, భావాలతో, విలువలతో నిరంతరం ప్రభావితమ వుతుంటారు. కుల, మత తత్వాలు, పితృ స్వామిక భావాల వంటి తిరోగమన భావాలు వినిమయ వాదం, వ్యక్తివాదం, ఆత్మాశ్రయ వాదం వంటి ఆధునిక బూర్జువా భావాలతో ప్రభావితం అవుతుంటారు. వీటన్నింటనీ ఎండగట్టి సమానత్వాన్ని, సహకారాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలపర్చే సామ్యవాద ఆలోచనలను ప్రజలలో వ్యాపింపజేయాలి. ఈ కృషి జరగకుండా రోజూ వారి ఉద్యమాలకే పరిమితమైతే ప్రజలకు కొంత ఊరట కల్గించామన్న తృప్తి మిగులుతుంది తప్ప పార్టీ ప్రజాపునాది పెద్దగా జరగదు. ప్రస్తుతం సైద్ధాంతిక, సాంస్కృతిక రంగంలో కృషి చేయడంలో పార్టీ వెనకబడుతున్నది. ఈ లోపాన్ని సవరించుకుంటే తప్పకుండా వామపక్ష, అభ్యుదయ శక్తుల ప్రజా పునాది బలపడుతుంది.

**3. నవంబరు 8న నోట్ల రద్దును ప్రకటించిన తర్వాత వెంటనే పార్టీ ఎందుకు స్పందించలేదు? 100 మంది పైగా క్యూలలో నిలబడి చనిపోయిన నెల రోజుల తర్వాత స్పందించడానికి కారణం?**

కేంద్ర ప్రభుత్వం నవంబర్ 8న 500, 1000రూపాయల నోట్లు చెల్లుబాటును రద్దుచేస్తూ నిర్ణయం ప్రకటించిన రోజునే పార్టీ కేంద్రం తీవ్రంగా విమర్శిస్తూ ప్రకటన చేసింది. ప్రభుత్వ నిర్ణయం మూలంగా ప్రజలకు కలిగే నష్టాలను వివరిస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించింది. అయితే ఈ ప్రకటనలో ఉద్యమానికి నిర్దిష్టమైన పిలుపునివ్వలేదు. వివిధ తరగతుల ప్రజల స్పందనను కూడా గమనించి ఇతరులతో సంప్రదించి చేద్దామనుకున్నాం.

నిర్ణయం అమలులోకి వచ్చిన తరువాత వివిధ తరగతులు వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేయడం ప్రారంభించాయి. ఈ నిరసన కార్యక్రమాల్లో పార్టీ పాల్గొని, సంఘీభావం వ్యక్తం చేసింది.

**4. జి.యస్.టి కి సంబంధించి పార్లమెంటులో ఎన్నిక జరిగితే ఆ ఎన్నికలో మనం ఎందుకు పాల్గొనలేదు? తర్వాత ఇది నష్టదాయకం అని ఎందుకు అంటున్నాం?**

జిఎస్టీ బిల్లు పార్లమెంటులో ఆమోదానికి వచ్చినప్పుడు ఓటింగ్‌కు పట్టుబట్టింది మన పార్టీ మాత్రమే. కొన్ని ఇతర పక్షాలు మనకు మద్దతుగా నిలిచినప్పటికీ కాంగ్రెస్, బిజెపితో కుమ్మక్కై బిల్లును సమర్థించడంతో మన సవరణలన్నీ వీగిపోయాయి.

**5. యస్.సి వర్గకరణపై పార్టీవైఖరి ఏమిటి? అనుకూలమా వ్యతిరేకమా ? అనుకూలం అయితే 2004లో యుపిఎ ప్రభుత్వ భాగస్వామిగా ఉన్నప్పుడు ఎందుకు పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు? వ్యతిరేకం అయితే ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?**

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణకు తీర్మానం శాసనసభలో వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ దాన్ని సమర్థించింది. సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాల మూలంగా రిజర్వేషన్‌లే ప్రశ్నార్థకంగా మారుతున్న సమయంలో వర్గీకరణ మూలంగా దళితుల్లోని అసమానతలు తొలగిపోతాయన్న భ్రమ పార్టీకి లేకపోయినా, ఉన్నంతలో రిజర్వేషన్ల పంపిణీలో వ్యత్యాసాలు పోతాయని పార్టీ భావించింది. అందుకనే మార్క్సిస్టు పార్టీ సమర్థించింది. పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు కూడా ఈ అంశంపై అఖిలపక్షంతో చర్చించి ఏకాభిప్రాయం తేవాలని పార్టీ చెప్పింది.

❋

# మతోన్మాద వ్యతిరేక పోరాటంలో అసువులు బాసిన గౌరి లంకేశ్

(2వ పేజీ తరువాయి)


అద్వాని నిర్వహించిన రథయాత్ర కర్నాటకలో మతోన్మాదం పెరుగుదలకు దోహదం చేసింది. ఆ సందర్భంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో మత కలహాలు జరిగాయి. కోలార్ లాంటి మతపరంగా సున్నితమైన పట్టణంలో 78 రోజులు కర్ఫ్యూ విధించారు. ఆ తర్వాత క్రమంగా మత కలహాలను రెచ్చగొట్టే విధానాలను సంఘ్ పరివార్ అనుసరించింది. బాబా బుడాన్ గిరి, హుబ్లీలోని ఈద్గా మైదానాలను వివాదాస్పద స్థలాలుగా ముద్రవేసి, తమ మతోన్మాద కార్యకలాపాల విస్తరణకు వాటిని సాధనాలుగా వినియోగించు కున్నారు. బాబా బుడాన్ గిరిలో సూఫి గురువు హజరత్ బారా హయత్ ఖలందర్ దర్గా ఉంది. అక్కడే దత్తపీఠం కూడా ఉంది. బాబా బుడాన్ గిరిని అనేక శతాబ్దాల నుండి హిందువులు, ముస్లింలు తీర్థయాత్రా స్థలంగా బావిస్తున్నారు. మతాలతో నిమిత్తం లేకుండా పెద్దసంఖ్యలో ప్రజలు అక్కడికి వెళుతుంటారు. బాబా బుడాన్ గిరి విముక్తి పేరుతో 1998లో బిజెపి రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల నుండి రథయాత్రలను ప్రారంభిం చింది. బాబా బుడాన్ గిరిని మరో అయోధ్యగా మారుస్తానని ఆ సందర్భంగా ప్రవీణ్ తొగాడియా ప్రకటించాడు. ఆ విధంగా ఒక పథకం ప్రకారం మతోన్మాదాన్ని పెంచటానికి సంఘ్ పరివార్ ప్రయత్నం చేసింది. ఫలితంగా కర్నాటకలో హిందు మతోన్మాదశక్తుల పెరుగుదలకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా కర్నాటకలోని సముద్రతీర ప్రాంతంలో ఈ శక్తులు వేగంగా పెరుగుతున్నాయి. మతోన్మాదశక్తుల పెరుగుదలకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో గౌరి వ్యక్తిత్వం రూపుదిద్దుకున్నది. ఆమె పత్రిక ద్వారా మతోన్మాదానికి వ్యతిరేకంగా, మత సామరస్యం, మైనారిటీల రక్షణ కోసం పోరాటం నిర్వహించింది. మతోన్మాదశక్తుల కార్యకలాపాలను వ్యతిరేకించటం, మత సామరస్యాన్ని కాపాడటం కోసం జర్నలిస్టులు, కవులు, కళాకారులు, మేధావులు, వివిధ తరగతుల ప్రజలతో కలిసి ఆమె పోరాటాలలో పాల్గన్నారు. చిక్‌మగళూరులోని బాబా బుడాన్ గిరిని దత్తాత్రేయ పీఠంగా మార్చాలని హిందు మతోన్మాదులు 2003లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంవత్సరం ఉర్స్ సందర్భంగా బాబా బుడాన్ గిరి దర్గాలోకి పెద్దసంఖ్యలో ప్రవేశించాలని భజరంగ్‌దళ్ తన కార్యకర్తలను సమీకరించింది. భజరంగ్‌దళ్ పథకాన్ని ఎదుర్కోవటానికి వామపక్షాలు, అభ్యుదయ వాదులు, లౌకికవాదులు, మేధావులు, విద్యావేత్తలు, కవులు, కళాకారులు కూడా పెద్దసంఖ్యలో సమీకృతం అయ్యారు. ఉభయుల ప్రయత్నాలను గమనించిన పోలీసులు తీవ్ర ఘర్షణలు జరిగే ప్రమాదం ఉందని భావించి కర్ఫ్యూ విధించారు. గౌరి మరి కొందరు కార్యకర్తలతో కలిసి పోలీసుల కళ్ళుకప్పి, చిక్‌మగళూరులోనికి ప్రవేశించి సభ జరిపింది. గౌరిని, ఆమెతో పాటు పాల్గన్న కార్యకర్తలందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు.

హిందుమతంలో పాతుకుపోయిన కులవివక్షను, మహిళలను రెండవ తరగతి పౌరులుగా చూడటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. లింగాయతులు హిందుమతంలో భాగం కాదని, వారు మైనారిటి మతం వారని ఆమె ప్రచారం చేసింది. మత సామరస్యాన్ని బోధించే 'కోము సౌహార్ద వేదిక' కు నాయకత్వం వహించింది. కులవ్యవస్థను, అర్థం లేని మూఢ విశ్వాసాలను, సాంప్రదాయాలను ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. పెరుమాళ్ మురుగన్ రాసిన 'మదోరుభగన్' పుస్తకంపై హిందూ మతోన్మాదుల దాడులను ఆమె ఖండించింది. మురుగన్‌కు మద్దత్తుగా నిలిచింది. పురాణాలలో వివాహం లేకుండా బిడ్డలను కన్నవారిని, ఆ బిడ్డలను గొప్ప వారిగా చూపుతున్నవారు, సమాజంలో వెనుకబడిన తరగతులలో ఉన్న సాంప్రదాయాలను వివరించిన మురుగన్‌ను ఎందుకు విమర్శిస్తున్నా రని ప్రశ్నించింది. మూఢాచారాలపై ఆమె చేస్తున్న పోరాటంతో భయపడిన బ్రాహ్మణసంఘం ఆమెకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టింది.

పత్రికా స్వాతంత్ర్యాన్ని నొక్కిచెప్పింది. నక్సలైట్లలో పరివర్తన తీసుకువచ్చి, వారిని జనజీవన స్రవంతిలో భాగస్వాములను చేయాలని ప్రయత్నించింది. నక్సలైట్లను సామాజిక జీవనంలో భాగస్వాములుగా చేయటం కోసం కర్నాటక ప్రభుత్వం నియమించిన కమిటీలో ఆమెను కూడా సభ్యురాలుగా నియమించారు. ఆమె నక్సలైట్ల సానుభూతిపరురాలని, కమిటీ నుండి తొలగించాలని కొందరు ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చారు. వారి వత్తిడిని లెక్కచేయకుండా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆమెను కమిటీలో కొనసాగించాడు.

రాష్ట్రంలో బిజెపి నాయకుల అవినీతికి వ్యతిరేకంగా ఆమె పత్రికలో వ్యాసాలు ప్రచురించారు. వాటిలో ఒకవ్యాసంపై బిజెపి నాయకులు గౌరిపై కోర్టులో కేసుదాఖలు చేశారు. గౌరిలంకేశ్ పత్రికలో ప్రచురించిన వార్తలనే ఇతర పత్రికలలోనూ ప్రచురించారు. అయినా మిగతా పత్రికలపై కేసు దాఖలు చేయలేదు. గౌరి వామపక్ష భావాలు, మతోన్మాద వ్యతిరేక కార్యకలాపాలలో ఆమె చురుకుగా పాల్గంటున్న కారణంగా ఆమెపై కక్షసాధించటం కోసం కేసుపెట్టారు. తనపై పెట్టిన కేసును కొట్టివేయాలని గౌరి హైకోర్టుకు వెళ్ళింది. కేసు విచారణను ఆరు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు దిగువ కోర్టును ఆదేశించింది. 2016 నవంబరులో హుబ్లీ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆమెకు ఆరు మాసాలు జైలుశిక్ష విధించింది. కోర్టు ఆమెకు బెయిలు మంజూరు చేసి, పై కోర్టులో అప్పీలు చేసుకోవటానికి అవకాశం కల్పించింది.

తను నమ్మిన ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన గౌరి లంకేశ్‌ను హత్యచేయటం ద్వారా అడ్డుతొలగించుకున్నామని భావిస్తున్న మతోన్మాదులకు మరణానంతరం అజేయశక్తిగా మారిన గౌరి తమ భావజాలాన్ని మరింత తీవ్రంగా సవాలు చేయటం వారికి కంపరం కలిగిస్తున్నది. ఆమె చేసిన పోరాటం అందిస్తున్న స్ఫూర్తితో ఆ మార్గంలో ప్రయాణించటానికి, మతోన్మాదశక్తుల కుట్రలను తిప్పికొట్టటానికి లక్షలాదిగా కదిలిన ప్రజలు గౌరి లక్ష్యాన్ని సాధించటం కోసం ముందుకు సాగుతారు. ఆమె స్ఫూర్తితో మతోన్మాదాన్ని ఎదుర్కోవటం, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడటం, మహిళలు, అణగారిన తరగతుల హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేయటం ద్వారా ఆమెకు నివాళులు అర్పిద్దాం. ❋



RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-10-2017 (36 pages) Postal Regd. No VJ/172/2015-17

# రోబోట్లతో కాదు పెట్టుబడిదారీ వ్యవస్థతోనే ప్రమాదం



– స్టీఫెన్ హాకింగ్

రోబోట్‌ల వల్ల మానవాళికి ప్రమాదం ముంచుకొస్తోందని చాలా మంది అంటున్నారు. కానీ రోబోట్‌ల కన్నా ప్రమాదకరమైంది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ. మనం కోరుకున్న వాటన్నిటినీ యంత్రాలు ఉత్పత్తి చేస్తే అప్పుడు ఆ ఉత్పత్తి ఎలా పంపిణీ జరుగుతోంది అన్న దానిపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి. యంత్రాలు ఉత్పత్తి చేసే సంపద పంపకం జరిగితే అప్పుడు ప్రతి వ్యక్తీ విలాసవంతమైన విశ్రాంత జీవితం గడుపుతాడు. అలా కాకుండా యంత్రాల యజమానులు సంపద పంపిణీని అడ్డుకుంటే అత్యధిక ప్రజలు తీవ్రమైన దుర్భరజీవితాన్ని ఎదుర్కొన వలసి వస్తుంది. కొంతమంది యాంత్రీకరణ వల్ల సోషలిజం వస్తుందంటున్నారు కానీ నా ఉద్దేశంలో దానికి భిన్నమైన దిశలో అంటే యాంత్రీకరణ విపరీతమైన అసమానతలు పెంచే దిశగా ప్రపంచం పయనిస్తోంది.

పెట్టుబడి మరింతగా పోగుచేసుకోడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న ప్రయత్నాలు టెక్నాలజీ లక్ష్యాన్నే మార్చేస్తున్నాయి. ప్రజల సంపద పెంచడం కోసం కాకుండా మానవుల ఉపాధి పోగొట్టడమే దాని లక్ష్యంగా మారిపోయింది. ఈ హెచ్చరికను తీవ్రంగా తీసుకోకపోతే మనం అంతులేని కార్పొరేట్ ఆధిపత్యానికి లోనవుతాము. మన రాజకీయ వ్యవస్థనూ, వనరులనూ అమ్ముతూ, కొంటూ ఉండే వాళ్ల చేతుల్లోకి కృత్రిమ మేధస్సు వెళ్లిపోడానికి మనం అనుమతిస్తే మనం చాలా తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుంది.

**(గత ఏడాది రెడ్డిట్ పోర్టల్ నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఒక ప్రశ్నకు సమాధానంగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చెప్పిన అభిప్రాయాలివి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275 .Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.6. Published on October 1, 2017